ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

నవంబర్ 2020


రూ.10/-




## ఎన్‌జేఏసీని కొట్టివేసి సెల్ఫ్‌గోల్ చేసుకున్న సుప్రీంకోర్టు




## లోక్‌సత్తా గమ్యం, గమనంపై లోతైన చర్చకు జేపీ పిలుపు




### రాజ్యాంగానికి-సమాజానికి అంతరాన్ని తొలగించే వ్యవస్థకు

# రాజ్యాంగ దినోత్సవం స్ఫూర్తినివ్వాలి



"రాజ్యాంగంతో పనిలేకుండా సంస్కృతీసంప్రదాయాలే దేశాన్ని నడిపిస్తాయంటే.. భారతదేశం కొత్తగా ఏమీ చేయాల్సిన అవసరం లేకుండానే అగ్రరాజ్యంగా ఉండాలి. కానీ వాస్తవం అలా లేదని మనందరికీ తెలుసు. రాజ్యాంగానికి-సమాజానికి మధ్య ఉండే అంతరాన్ని తొలగించటమే రాజ్యవ్యవస్థ చేయాల్సిన పని. అలాంటి రాజ్యవ్యవస్థ నిర్మాణానికి తగిన భావజాలాన్ని, విధానాల్ని తొలిసారి భారతదేశంలో తీసుకొచ్చిన రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా. ఇప్పుడున్న స్థితి నుంచి మెరుగైన స్థితికి దేశాన్ని నడిపించేందుకు సాధనంగా రాజ్యాంగాన్ని వినియోగించకుండా కేవలం ప్రక్రియకు దాన్ని పరిమితం చేస్తే.. ఎవరు ఎన్నికవుతారన్నది కూడా పెద్ద అంశం అవదు, సానుకూల ఓటుకు సైతం విలువుండదు, ఏటా నవంబర్ 26న నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవం తంతుగా మిగిలిపోతుంది. విద్య, ఆరోగ్యం, ఉపాధి, చట్టబద్ధపాలన, లంచాల్లేని సేవలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, లాభసాటి వ్యవసాయం, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి మార్పుల కోసం సంస్కరణలు తెచ్చినప్పుడే ప్రజలు స్వేచ్ఛగా సృజనాత్మకతతో ఆలోచించగలుగుతారు, పాలనలో భాగస్వాములవుతూ వివక్ష లేకుండా ఎదగగలుగుతారు, రాజ్యాంగం సజీవ పరివర్తనాపత్రమవుతుంది"

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**
**ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 23 సంచిక 11

నవంబర్ 2020

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్

**జనబలం చందా రుసుము వివరాలు**

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

**చందాదారులకు విజ్ఞప్తి**

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

లోపలి పేజీల్లో...

06
లోక్‌సత్తా గమ్యం, గమనంపై లోతైన చర్చ చేయండి..

21
ఎన్‌జేఏసీ చట్టాన్ని కొట్టివేసి సెల్ఫ్‌గోల్ చేసుకున్న సుప్రీంకోర్టు

29
మూసీ ప్రళయం మళ్లీ వస్తే..?

కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288

Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

## కార్టూన్ కార్నర్




## జనబలంలో ప్రకటన రేట్లు

| | |
|---|---|
| **కలర్‌పేజీ:** | **10,000** |
| **ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **5,000** |
| **ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **2,000** |
| **సగం పేజీ బ్లాక్ అండ్ వైట్:** | **1,000** |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*

సంపాదకీయం

# కరోనా కష్టం - చదువుల నష్టం

కరోనా కష్టకాలంలో పిల్లల చదువులకు నష్టం జరిగిందని అసర్ -2020 తొలి విడత నివేదిక వెల్లడించింది. బడి పిల్లల్లో డిజిటల్ అగాథం పెరిగిందనీ, ఆన్‌లైన్ చదువుల్లో కూడా ఆడ పిల్లలకు అన్యాయం తప్పలేదని, బడుల మూసివేత నేపథ్యంలో పిల్లలకు అందచేసేందుకు ప్రభుత్వం రూపొందించిన డిజిటల్ పాఠ్యాంశాలు అందరికీ అందడం లేదని అసర్-2020 తొలి విడత సర్వే స్పష్టం చేసింది. బడుల మూసివేత పర్యవసానంగా పిల్లలకు జరిగిన చదువుల నష్టాన్ని పూడ్చటానికి తగిన ప్రయత్నం జరగకపోతే వారు చదువుల్లో మరింతగా వెనుకబడిపోతారని అసర్-2020 హెచ్చరించింది.

ప్రతి ఏటా వార్షిక విద్యా స్థితి నివేదిక పేరుతో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ విడుదల చేస్తున్న అసర్ నివేదికల వరుసలో 15వ నివేదికను అక్టోబర్ 28న ఆన్‌లైన్ కార్యక్రమంలో విడుదల చేశారు. ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఛైర్మన్ అజయ్ పిరామిల్ అసర్-2020 తొలివిడత నివేదికను విడుదల చేశారు. విద్యార్థుల సామర్థ్యాలు, కుటుంబాల స్థితిగతులు, తల్లిదండ్రుల విద్యా నేపథ్యం, పాఠశాలల్లో సదుపాయాలు వంటి అంశాలపై దేశంలోని సుమారు ఆరు వందల జిల్లాల్లో 2005 నుండి ప్రథమ్ సంస్థ సర్వే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2015వరకూ పది అసర్ నివేదికలను ప్రథమ్ రూపొందించింది. ఆ తర్వాత ప్రతి రెండేళ్లకూ ఒకసారి బేసిక్ అసర్ సర్వేను కొనసాగిస్తూ మధ్యలో ప్రత్యేకాంశాలపై అధ్యయనం చేసి నివేదికలను విడుదల చేస్తోంది.

అయితే 2020 మార్చి నుండి కరోనా కారణంగా పాఠశాలలన్నీ మూత పడిన సంగతి తెల్సిందే. పాఠశాలలు ఎప్పుడు తెరుచుకుంటాయో చెప్పలేని పరిస్థితుల్లో ప్రభుత్వమూ, ప్రైవేటు యాజమాన్యాలూ కూడా విద్యార్థులను ఆన్‌లైన్ తరగతుల ద్వారా బోధనాభ్యసన ప్రక్రియలో భాగస్వాములను చేసే ప్రయత్నం చేశాయి. కరోనా వ్యాధి విస్తరణ భయం వెన్నాడుతుండగా, అత్యధిక ప్రజల జీవనం, ఉపాధి అతలాకుతలం అయ్యాయి. సాధారణ జీవితం స్తంభించిపోయింది. పిల్లలు, తల్లిదండ్రులు నెలల తరబడి గృహ నిర్బంధంలో నలిగిపోయారు. కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. విపత్కర పరిస్థితులు పిల్లల మానసిక స్థితిపై ప్రతికూల ప్రభావాన్ని తెచ్చిపడేశాయి. ఈ నేపథ్యంలో పిల్లలు చదువుల్ని నష్టపోయారు. వివిధ మాధ్యమాల ద్వారా విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టేటట్లుగా చూసేందుకు ప్రయత్నం జరిగింది. ఆన్‌లైన్ సాంకేతికత ద్వారా డిజిటల్ పాఠ్యాంశాలను పిల్లలకు అందచేసి, వారి చేత కృత్యాలు చేయించేందుకు కృషి జరిగింది. గత ఆరు నెలల కరోనా కాలంలో పిల్లల చదువుల తీరు తెన్నులను అధ్యయనం చేసేందుకు ప్రథమ్ పూనుకున్నది. దేశంలోని 26 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాలలో 584 జిల్లాలకు చెందిన 16,974 గ్రామాల్లో 52,227 కుటుంబాలలోని 59,251 మంది 5-16 వయో వర్గం పిల్లలను అసర్ వలంటీర్లు ఫోన్‌ద్వారా ఇంటర్వ్యూ చేసి సమాచారాన్ని సేకరించారు. 8,963 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సంభాషించి పాఠశాలకు - విద్యార్థులకు మధ్య అనుసంధానం జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. సెప్టెంబర్‌లో ఈ సర్వే నిర్వహించారు.

దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు గత మూడేళ్లుగా పెరుగుతున్నదని అసర్-2020 తొలివిడత సర్వే వెల్లడి చేసింది. 2018లో ప్రభుత్వ పాఠశాలల నమోదు 62.8 ఉండగా, 2020లో 66.4 శాతానికి పెరిగింది. అయితే 6,7 వయో వర్గంలో వుంటూ బడిలో నమోదుకాని వారి సంఖ్య ఈ సంవత్సరం 5.5శాతం ఉంది. బడులు ఇంకా తెరుచుకోని కారణంగా చాలా మంది బడి ఈడు పిల్లలు బడి బయటే మిగిలిపోయారు. బడి బయటి పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో కర్ణాటక (11.3%), తెలంగాణ (14%), రాజస్థాన్ (14,9%) ఉన్నాయి. మొత్తం పిల్లల్లో 25శాతం తమ కుటుంబాల్లోని తొలి తరం విద్యార్థులు. 75శాతం పిల్లల తల్లిదండ్రులు ప్రాథమిక విద్య లేదా అంతకంటే పై చదువులు చదివిన వారున్నారు. కుటుంబాలలో స్మార్ట్ ఫోన్ వినియోగం గత రెండేళ్లలో విపరీతంగా పెరిగింది. 2018లో బడిలో నమోదైన పిల్లల కుటుంబాల్లో 36.5శాతం కుటుంబాలకు స్మార్ట్ ఫోన్ ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 61.8శాతం వరకూ ఉంది. స్మార్ట్ ఫోన్‌ల వినియోగంలో మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, త్రిపుర వంటి రాష్ట్రాల్లో 30శాతం పెరుగుదల నమోదయ్యింది.

పాఠ్యపుస్తకాలు పంపిణీ విషయంలో రాజస్థాన్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు మినహా మిగిలిన రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ప్రస్తుత తమ తరగతికి చెందిన పాఠ్యపుస్తకాలున్న విద్యార్థుల సంఖ్య 80శాతం వరకూ ఉంది. బడులు తెరుచుకోని కాలంలో పిల్లలకు ఇంటి దగ్గర చదువుల తోడ్పాటు లభిస్తున్న కుటుంబాలు 70శాతం వరకూ ఉన్నాయి. క్రింది స్థాయి పిల్లలకు తల్లిదండ్రుల తోడ్పాటు లభిస్తుండగా, పై స్థాయి తరగతి పిల్లలకు తమ కంటే పెద్ద వయసు సహోదరులు నుంచి తోడ్పాటు లభిస్తోంది. అయితే మొత్తం పిల్లల్లో 30శాతం మందికి మాత్రమే పాఠశాలల నుండి బోధనాభ్యసన సామగ్రి లభించింది. రాజస్థాన్, యూపీ, బీహారు వంటి రాష్ట్రాల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. సామగ్రి అందిన వారిలో కూడా 67.3శాతం పిల్లలకు వాట్సాప్‌ద్వారా అందగా, మిగిలిన వారికి ఉపాధ్యాయుల ద్వారా గాని, పిల్లలు బడికి వెళ్లి తెచ్చుకోవడం ద్వారాగానీ అందింది.

అభ్యసనా సామగ్రి అందని 70శాతం విద్యార్థులు తమకు బడి నుండి గానీ , ఉపాధ్యాయుల నుండి గానీ ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. సామగ్రి అందిన పిల్లల్లో 70శాతం వాటిని ఏదో రూపంలో వినియోగించారని తెలిపారు. తల్లిదండ్రులు, సహోదరులు, ఇరుగుపొరుగువారు, ట్యూషన్ మాస్టర్ల సాయంతో వాళ్లు చదువుకునే ప్రయత్నం చేశారు. ఆన్‌లైన్ తరగతులలో వీడియో పాఠాలను చూసిన వారు ప్రైవేటు పాఠశాల విద్యార్థులు 28.7శాతం కాగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 18.3శాతం మాత్రమే ఉన్నారు. అసర్-2020 తొలి విడత సర్వే వెల్లడించిన సమాచారాన్ని బట్టి 5-16 వయోవర్గం పిల్లల్లో డిజిటల్ డివైడ్ పెరిగిందని, అభ్యసనా సామగ్రి, డిజిటల్ కంటెంట్ పిల్లలకు సవ్యంగా చేరలేదని, చేరినా వాటిని విద్యార్థులు సక్రమంగా వినియోగించడం లేదని, పాఠశాలల నుండి పిల్లలను పర్యవేక్షించే కృషి సరిగ్గా సాగలేదని తేలింది. స్మార్ట్ ఫోన్‌ల వినియోగం పెరిగినా చదువు కోసం వాటిని వినియోగించినవారి శాతం తక్కువగానే ఉంది. టీవీ, వీడియో మాధ్యమాలను చూసేవారు చాలా తక్కువగా ఉన్నారు. ఒకరిని మించి పిల్లలున్న కుటుంబాల్లో ఒకటే స్మార్ట్ ఫోన్ ఉన్న సందర్భంలో అది మగపిల్లల వశం అవుతోందని, ఆడపిల్లల చదువుకు మరింత అన్యాయం జరిగిందని తేలింది.

డిజిటలైజేషన్ గురించి ఎంత మాట్లాడినా పాఠశాలల చదువులో ఉపాధ్యాయులు - విద్యార్థుల మధ్య ప్రత్యక్షంగా జరిగే అభ్యసనం ద్వారానే పిల్లల చదువులు మెరుగుపడతాయి. పాఠశాలలు తెరవడానికి ప్రభుత్వాలు సంసిద్ధం అవుతున్నందున గత ఆర్నెల్లుగా జరిగిన చదువుల నష్టాన్ని పిల్లలపై దాని ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అభ్యసనం జరగాలని అసర్ నివేదిక సూచించింది. పిల్లలకు కుటుంబం నుండి, ఇరుగుపొరుగు సమాజం నుండి మరింత తోడ్పాటు అందించే పద్ధతులను రూపొందించాలని, హైబ్రిడ్ బోధనా పద్ధతులను అనుసరించాలని, డిజిటల్ అభ్యసన ప్రభావాన్ని లోతుగా అంచనా వేయాలని, డిజిటల్ డివైడ్‌ను తొలగించే విధంగా ప్రభుత్వమూ, పాఠశాల, సమాజమూ కలసి కృషి చేయాలని 'అసర్-2020' నివేదిక సూచించింది.

డి. సోమ సుందర్

# లోక్‌సత్తా గమ్యం, గమనంపై లోతైన చర్చ చేయండి..

## పలు అంశాల్ని సహచరులతో పంచుకున్న జేపీ

లోక్‌సత్తా పార్టీ 14వ వార్షికోత్సవాన్ని పార్టీ నేతలు అక్టోబర్ 2న వెబినార్ ద్వారా నిర్వహించారు. మల్లాడి కిషోర్ సమన్వయం చేసిన ఈ సమావేశంలో.. పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడిన అనంతరం వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రసంగించారు. లోక్‌సత్తా ఆవిర్భావం నుంచి పలు అంశాల్ని ప్రస్తావిస్తూ గమ్యం, గమనం గురించిన భావాల్ని సహచరులతో పంచుకున్నారు. "నేను మనసు విప్పి మాట్లాడుతున్నాను. నిజానికి ఐదు, పది నిమిషాలే మాట్లాడి ఎక్కువ సమయం ఇవాళ ప్రశ్నలకి కేటాయిద్దామనుకున్నాను. ఆన్‌లైన్‌లోకి సందర్భంలో రాజకీయ వ్యూహాలు ఏం చేద్దామో మరో చర్చ పెట్టుకుందాం. పెద్ద ఖర్చులేని సాంకేతికత అందుబాటులో ఉంది కాబట్టి.. ఇక నుంచి ప్రతి నెలా ఒకసారన్నా కనీసం ఒక చర్చ పెట్టుకుందాం. దయచేసి ఇప్పుడు నేను చెప్పింది ఊరికే ఏదో ఊకదంపుడు ఉపన్యాసంలా భావించబోకండి.. చర్చించండి, ఆలోచించండి" అని జేపీ విజ్ఞప్తి చేశారు.

లోక్‌సత్తా పార్టీ వార్షికోత్సవంలో జేపీ ప్రసంగం స్థూలంగా..

నమస్కారం.

మన జాతి నిర్మాణం చేసిన మహాత్ముడి 151వ జయంతి సందర్భంగా ఆయన స్మృతికి అందరితో కలసి అంజలి ఘటిస్తున్నాను. గాంధీజీని గుర్తుంచుకోవాల్సింది ఆయన






వచ్చేదాకా ఫలానాది మాట్లాడదామని నేను అనుకోలేదు. అప్రయత్నంగానే నా మనసులో ఈ భావాలు మెదులుతున్నాయి. అయినా స్పష్టతతోనే వచ్చినాయని నమ్ముతున్నాను. చాలా స్పష్టంగా హృదయంలో నుంచి మేధస్సును సంధానించి మాట్లాడుతున్నాను. ఏళ్ల తరబడి, బహుశా దశాబ్దాల తరబడి నిరంతరం మానసిక సంఘర్షణ, అనుభవం, మీ అందరి ప్రయత్నం, మీ అందరి నుంచి నేర్చుకున్నది.. ఇదంతా కలిపి, దాన్ని సమన్వయం చేసి నేను మీ ముందు పెడుతున్నాను. ఈ భావజాలం నాది కాదు.. మీ అందరిదీ, మనందరిదీ. దయచేసి ఆలోచించండి, ఇది రికార్డు కూడా అవుతోంది కాబట్టి, మళ్లీ మళ్లీ మళ్లీ చర్చించుకోండి, ఇందులోని తప్పొప్పులను ఆలోచించండి, మళ్లీ చర్చించండి. తదుపరి కార్యక్రమాన్ని ఈ అంశాలు ప్రాతిపదికగా ప్రశ్నోత్తరాల రూపంలో సమగ్రమైన చర్చగా పెట్టుకుందాం. మరింకో

స్వతంత్రం తెచ్చాడని కాదు. నేను ఎన్నో సందర్భాల్లో చెప్పాను. ఆయన లేకున్నా మన దేశానికి స్వతంత్రం వచ్చేది. చాలా దేశాల్లో స్వతంత్రం వచ్చింది. ఆ దేశాల్లో గాంధీలు లేరు. కానీ ఆయన లేకుంటే భారతదేశ నిర్మాణం సాధ్యమయ్యేది కాదు. ఇన్ని కులాలు, మతాలు, భాషలు, ప్రాంతాలు, ఇంతమందిని, ఇన్ని సంస్కృతుల్ని, విభిన్నమైనటువంటి భావజాలాల్ని అందర్నీ కలిపి ఒక తాటి మీద కూర్చోబెట్టి.. మనది ఒక దేశం, ఒకరి అవసరాలు మరొకరికి ముఖ్యం, ఒకరి కంట కన్నీరొలికితే మరో మనసు నుంచి కూడా కన్నీరొలకాలి, మనందరం కూడా ఒకటే అన్న భావాన్ని ఆసేతుహిమాచలం తీసుకొచ్చినటువంటి ఏకైక వ్యక్తి గాంధీజీ. ఇంత వైవిధ్యభరితమైన సమాజాన్ని కలపటమనేది ప్రపంచంలో ఎప్పుడూ జరగలా. అందుకు మహాత్ముడికి జాతి నిరంతరం రుణపడి ఉంది. లోక్‌సత్తా భావజాలాన్ని, ఈ స్ఫూర్తిని, ఈ పార్టీని

ఎన్నో త్యాగాలకోర్చి, కష్టాలకోర్చి, కొన్ని సందర్భాలలో సమాజం మనం అనుకున్నంత వేగంగా కదలకపోయినా కూడా నిరుత్సాహానికి గురికాకుండా కొనసాగిస్తూ నిరంతరం శ్రమిస్తున్న మీ అందరికీ లోక్‌సత్తా పార్టీ 14వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

మళ్లీ ఒకసారి మహాత్ముడి జీవితానికి వెళితే, రాజకీయాన్ని గుర్చి ఆయన ప్రతిపాదించింది- రాజకీయానికి ఒక లక్ష్యం ఉండాలి. Politics with a purpose. రాజకీయానికి ఒక సిద్ధాంతం ఉండాలి. Politics with principle. అందుకే seven great sinsలో politics without principle, power without principleఅన్నారు. మనం మహాత్మాగాంధీ మార్గంలో నైతికమైన భావజాలాన్ని రాజకీయంలో పెంపొందించుకోవాలి. అధికారం సొంతది కాదు, సొంతం కోసం కాదు.. సమాజ ఉన్నతి కోసం! అందుకే మొదట్నుంచి లోక్‌సత్తా అన్న మాట- రాజకీయం పవిత్ర వ్యాసంగం! అది బాపూ చూపిన రాజకీయం. ఆయన ప్రతిపాదించిన రాజకీయం. అదే విధంగా అంబేద్కర్ నిరంతరం పోరాడింది న్యాయం కోసం. న్యాయం అంటే సమాజంలో పుట్టుకతో వచ్చిన అసమానతల్ని తొలగించటం, చట్టబద్ధపాలన ఉండటం, ఎక్కువతక్కువలు లేకుండా అందరూ సమానంగా ఎదిగే అవకాశాలు ఉండటం. బాపూ పెద్దగా పట్టించుకోనిది, అంబేద్కర్ మన ముందుకు తీసుకొచ్చింది- వ్యవస్థల్ని, సంస్థల్ని!

కేవలం వ్యక్తి నైతికత మీద ఆధారపడినట్లయితే అది చాలదు. కొందరు ఎప్పుడూ నీతిమంతులుగానే ఉంటారు. కానీ నీతిని కాపాడే వ్యవస్థ లేకపోతే, దానికి కావలసిన సంస్థాగత ఏర్పాట్లు లేకపోతే.. ఆ నీతి కలకాలం నిలవదు. అందుకని అంబేద్కర్ రాజ్యాంగ విలువలను మన మనసుల్లో ప్రతిష్ఠించారు. మనం అందుకే గాంధీని, అంబేద్కర్‌ని కలిపాం. బహుశా భారతదేశంలో మరే సంస్థ, ఏ పార్టీ గాంధీని, అంబేద్కర్‌ని కలపలేదు. చాలామంది గాంధీకి, అంబేద్కర్‌కి వైరుధ్యాన్ని చూసి.. మీరు అంబేద్కర్‌ని ప్రేమిస్తే గాంధీని ద్వేషించటం అవసరం అనే భావనను ప్రతిపాదించారు. నా దృష్టిలో ఇది చాలా అసమగ్రమైనటువంటి అవగాహన. గాంధీ ప్రతిపాదించినటువంటి నైతికమైన రాజకీయము, లక్ష్యశుద్ధిగల రాజకీయము, పవిత్ర వ్యాసంగమైన రాజకీయము.. అంబేద్కర్ ప్రతిపాదించినటువంటి సంస్థాగతమైనటువంటి ఏర్పాట్లు, జవాబుదారీతనము, ప్రతి వ్యక్తి ఎదుగుదలకీ ఏర్పాట్లు, సమాజంలో అందరికీ న్యాయం జరిగే ఏర్పాట్లు- ఈ రెంటినీ సమన్వయం చేయాలి. రెండూ ఒకదానికొకటి వైరుధ్యం కాదు. రెండూ కూడా కాంప్లిమెంటరీ. సప్లిమెంటరీ కాదు. ఒకదానికొకటి ప్రత్యామ్నాయం కాదు. మనం మాత్రమే గాంధీని, అంబేద్కర్‌ని కలపగలిగాం. నేను చాలా గర్వపడుతున్నాను. మరెక్కడా కూడా ఒక పక్కన గాంధీని, మరోపక్కన అంబేద్కర్‌ని సమంగా పెట్టిన సంస్థ, పార్టీ భారతదేశ చరిత్రలో మరొకటి లేదు. ఇది ఊరికే కాకతాళీయంగా, లాంఛనంగా పెట్టింది కాదు. మనం మనసా, వాచా, కర్మణా దీన్లో మునిగి తేలుతున్నాం. ఈ 14 సంవత్సరాలుగా మీరంతా ఎన్ని కష్టాలు పడ్డారు. ఎన్ని త్యాగాలు చేశారో నాకు తెలుసు. లోక్‌సత్తా పార్టీ ప్రయత్నం సరిగా చేయలేదు అని కొంతమంది భ్రమలో ఉన్నారు. అద్భుతమైనటువంటి ఫలితాలు మనం మీట నొక్కితే వచ్చేస్తాయనే భ్రమలో నుంచి వచ్చిన భావన అది. కానీ ఇది లోక్‌సత్తా కార్యకర్తల ప్రయత్న లోపం కాదు. ఒక ప్రజాస్వామ్యం వికసించాలీ అంటే, అనుకున్నంత పరిణతి రావాలీ అంటే మన ప్రయత్నం దానిలో ఒక భాగం. కానీ చరిత్రలో చాలా శక్తులుంటాయి, చాలా ప్రభావాలుంటాయి, చాలా ఒరవడులుంటాయి.. అవన్నీ సమయం, సందర్భాన్ని గుర్తించి కలిసొచ్చినప్పుడు మౌలికమైన మార్పు వస్తుంది. ఇది ఒలింపిక్స్ కాదు. చాలాసార్లు నేను చెప్పాను. లేకపోతే ఇది వింబుల్డన్ టెన్నిస్ కాదు. ఒలింపిక్స్ అయినట్లయితే, మీరు సొంతంగా ఒక క్రీడాకారునిగా ఎంత ప్రతిభను చూపుతారు, ఎంత కష్టపడతారు, ఎంతగా మీ నైపుణ్యాన్ని పెంచుకుంటారు, ఎంత వేగంగా ఎలా పరిగెడతారు, లేకపోతే ఎంత ఎత్తుకు ఎగురుతారు, ఎంత లాంగ్‌జంప్ చేస్తారు.. మీ చేతుల్లో ఉంది చాలా మట్టుకు. అలాగే టెన్నిస్‌లో వింబుల్డన్ గెలవాలంటే అది మీ చేతుల్లో ఉంది. మీ కష్టం, మీ నైపుణ్యం, మీ ప్రతిభాపాటవాలు. జట్టుగా ఆడే క్రికెట్‌లాంటివి గెలవటమంటే మీ జట్టు చేతుల్లో ఉంది. మనం చాలా గుర్తించాలి.. లేకుంటే మన అమాయకత్వం అవుతుంది, అహంకారం అవుతుంది.

కోట్ల మంది హృదయాలలో మార్పు ఆకాంక్ష ఉంది. కానీ ప్రతి మనిషీ తన సందర్భాన్ని బట్టి, తన సంస్కృతిని బట్టి, తను పుట్టిన పరిస్థితులను బట్టి, తన చుట్టూ ఉన్న సమాజాన్ని బట్టి రోజువారీ నిర్ణయాలు తీసుకుంటాడు బతుకుతెరువు కోసం. సమాజంలో అత్యధికులు ఈ దేశం కోసం, సమాజం కోసం బతకరు. తమ కోసం, తమ కుటుంబం కోసం బతుకుతారు. ఆ బతుకు పోరాటంలో వారి అనుభవాన్ని బట్టి, వారికున్న పరిజ్ఞానాన్ని బట్టి, ఎక్స్‌పోజర్‌ని బట్టి నిర్ణయాలు తీసుకుంటారు. ఈ కోట్ల మంది నిర్ణయాల్ని మనం ప్రభావితం చేయాలి. రాజకీయం అంటే అదే. రాజకీయానికి - మిగతా వాటికి మౌలికమైన తేడా ఉంది. అందునా మన ఎన్నికల వ్యవస్థలో ఈ కోట్ల మందిలో కొద్దిపాటి మార్కెట్‌లో కొంత స్థానం ఉంటే చాలదు. మీరు వ్యాపారం పెడితే, కొద్దిపాటి నిష్ఠాతత ఉంటే ఆ వ్యాపారం విజయవంతమవుతుంది. కానీ మన ఎన్నికల వ్యవస్థ అట్లాంటిది కాదు. మీకు ఆ 30-40% ఓట్లు వస్తే, వచ్చే అవకాశం ఉంటే కనీసం- అప్పుడు రాజకీయంలో మీరు పెట్టినటువంటి శ్రమ, మీరు ప్రతిపాదించినటువంటి సిద్ధాంతాలు ఒక రాజకీయ శక్తిగా, ఒక అధికారంగా పరిణమిస్తాయి. కానీ సమాజంలో రాజకీయ శక్తి ఒకటే కాదు, ఇతర రూపాల్లో కూడా శక్తులుంటాయి. అందువల్ల మనకు ఈ చిక్కులెదురవుతున్నాయిగానీ, అది సిద్ధాంతలోపం కాదు, ప్రయత్నలోపం కాదు. మనం దీన్ని గుర్తించాలి.

మీ అందరి మనసుల్లో ఆరాటం ఉన్నది. మన దేశంలో రాజకీయము, దేశంలో మౌలికమైన మార్పులు అంటే ఎన్నికల్లో పోటీ అనుకుంటున్నారు. ఎన్నికల్లో పోటీ కచ్చితంగా ఒక మార్గం. దాన్లో అనుమానం లేదు. ఎన్నికల వ్యవస్థ సరిగా ఉన్నట్లయితే

ఎన్నికల్లో పోటీ అతి దగ్గర మార్గం. ఎందుకని రాజకీయాన్ని దేశమంతా ద్వేషిస్తున్న కాలంలో 'రాజకీయం పవిత్ర వ్యాసంగం, మీరంతా దీంట్లో పాలుపంచుకోండి' అని మొట్టమొదటి నుంచి ప్రతిపాదించాం? పార్టీ లేనప్పుడు కూడా! పార్టీ వచ్చాక, పార్టీ పెట్టిన కారణం కూడా అదే. పిచ్చెక్కి కాదు. ఇది అతి దగ్గర దారి.. సమాజం సిద్ధంగా ఉన్నట్లయితే, పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లయితే!కానీ మనకు అనుభవం ఏం పాఠాలు నేర్పిందీ- గుర్తించాలి.

మన సిద్ధాంతాల్ని మొత్తమ్మీద పట్టుకున్నటువంటి ఆమ్‌ఆద్మీ పార్టీ ఢిల్లీలో వాటిని ముందుకు తీసుకెళ్లగలిగింది. దానికి కారణాలు మనం అర్థం చేసుకోవాలి. నేను ఎన్నో సందర్భాల్లో చెప్పాను. ఒక స్థానిక ప్రభుత్వంలో- ఢిల్లీ యూనియన్ టెరిటరీ అనుకున్నా కూడా- ఎంతో కొంత స్వయం నిర్ణయాధికారం కలిగిన ఈ ప్రభుత్వాన్ని ఇక్కడ ఎన్నుకుంటే స్పష్టంగా మన జీవితాల్లో ఈ మార్పులు వస్తాయన్న అవగాహన ప్రజల్లో కలుగుతుంది. నగర ప్రాంతం కాబట్టి కులాలు, మతాల ప్రభావం కాస్త తక్కువ. అసలు లేకుండా ఈ దేశంలో ఉండదు కాబట్టి. నగర ప్రాంతం అవటం, కాస్త సంపద ఉన్న ప్రాంతం కావటం వల్ల మిగతా దేశంతో పోలిస్తే డబ్బులతో ఓట్లు కొనేవాళ్లు ఎక్కువమంది లేరు. అన్నిటినీ మించి స్థానికంగా వేసే ఓటు వల్ల నాకేం జరుగుతుందో ప్రతి పౌరునికీ స్పష్టమైన సమాధానం దొరికింది. ఈ మూడూ కలిసొచ్చినప్పుడు ఒక గణనీయమైన శక్తిగా ఎదగటం సాధ్యమవుతుంది. ఈ నేపథ్యాన్ని మనం అర్థం చేసుకోవాలి. కానీ కచ్చితంగా రాజకీయం లో ఫలితాలు, ఎన్నికల్లో పోటీ, పోటీలో వచ్చిన ఓట్లు లేదా సీట్లు పక్కన పెడితే- నేనీ వేళ గుండె మీద చేయి వేసుకుని చెప్పగలను ఘంటాపథంగా.. శ్రీనివాస్ చెప్పినట్లు లోక్‌సత్తా అనే కోడి ఇంకా వేకువకు ముందే కూసినటువంటిది! దేశంలో 5-10-15-20 ఏళ్ల తర్వాత ఈవేళ అనివార్యం అనుకుంటున్నవి మనం మొట్టమొదటే ప్రతిపాదించాం, ప్రజల ముందు పెట్టాం, వాటి కోసం పోరాడాం.

పాలనకు సంబంధించి సమాచార హక్కులాంటి అంశాలు, సరే.. అందరికీ తెలుసు. ఎన్నికల వ్యవస్థలో చేతనైన మేరకు మార్పులు, ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం, పెట్రోల్ బంకుల్లో తూనికల్లో మోసాల్ని అరికట్టటం కోసం, అట్లాగే నేరచరిత్రులు వివరాల వెల్లడించేలా ఎన్నికల్లో వారే తమ వివరాల్ని బయటపెట్టే చట్టం చేయటం కోసం- ఇలా ఎన్నో రంగాల్లో. పార్టీ ఫిరాయింపుల్ని ఆపటం కోసం, పార్టీల నిధుల సేకరణ నిజాయతీగా జరపటం కోసం.. ఇవన్నీ మనం చేసిన పోరాటాలు, విజయం సాధించిన పోరాటాలు. అధికారంలో ఉన్న ఏ పార్టీలకన్నా ఎక్కువ విజయాల్ని సాధించాం. అలాగే సహకార సంఘాలకు స్వయంప్రతిపత్తి కల్పించటం కోసం, ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకాల్లో కొన్ని ప్రమాణాలు పాటించటం కోసం.. దాన్ని కోర్టు అన్యాయంగా కొట్టివేసింది. మరి ఈవేళ మిత్రులు ప్రస్తావించినట్లుగా వ్యవసాయ రంగంలో రైతుకి సంకెళ్లు తొలగటం కోసం, దేశం లోపలగానీ, దేశం బయటగానీ వ్యవసాయోత్పత్తుల వాణిజ్యంలో అడ్డంకులు తొలగటం కోసం మనం వీళ్లందరూ ఊహించినదాని కంటే చాలా గొప్ప పోరాటం చేసి విజయం సాధించాం. రాష్ట్రంలో సాధించాం, జాతీయ స్థాయిలో సాధించాం. ఆనాడు మనం చేసిన పోరాటం వల్లనే బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయటంపై ఉన్న నిషేధాన్ని తొలగించారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా బియ్యంలో భారతదేశం ప్రపంచంలో నెంబర్‌వన్ ఎగుమతిదారు. దాన్లో తెలుగునాట మన రెండు రాష్ట్రాల నుంచి అతి ఎక్కువ ధాన్యం, అతి ఎక్కువ బియ్యం ఎగుమతి అవుతుంటాయి. కాబట్టి ఎన్నో రంగాల్లో. ఒక ఆరోగ్య పథకాన్ని జాతీయ స్థాయిలో సాధించాం. దేశంలోని అవసరాలతో పోలిస్తే అది చిన్నదైనా కూడా. 2 జీ స్పెక్ట్రమ్ లైసెన్సులు క్యాన్సిల్ చేయించటం, దాని పర్యవసానంగా సహజవనరుల కేటాయింపులో ఇక నుంచి పారదర్శకమైన పోటీతో కూడిన పద్ధతులు అమల్లోకి రావటం మన కృషి ఫలితమే.

ఇలా ఎన్నో మార్గాల్ని ఈ జాతి ముందు పెట్టి విజయం సాధించాం. కొన్నిటికి పరిష్కారాలు పెట్టాంగానీ అమలు కాలేదు. మనకున్న పరిమితమైన శక్తిసామర్థ్యాలతోనే పలు పరిష్కారాల్ని అమలు చేయించగలిగాం, సాధించాం. ఎందుకంటే అవి వాస్తవమైనవి కాబట్టి, అవి సత్యం కాబట్టి, అవి అవసరం కాబట్టి, అవి తర్కబద్ధమైనవి, హేతుబద్ధమైనవి కాబట్టి, ఆ సమయాన్ని, సందర్భాన్ని ఒడుపుగా ఉపయోగించుకున్నాం కాబట్టి! అందుకే ఎన్నికల్లో నెగ్గినా ఓడినా కూడా లోక్‌సత్తా కార్యకర్తలు ఎప్పుడూ తలదించుకోనక్కర్లేదు. ఎన్నికల్లో నెగ్గినా కూడా ఈ సాంప్రదాయ రాజకీయం కుళ్లులో మగ్గుతున్నవాడు భేషజాన్ని, అహంకారాన్ని చూపించవచ్చుగానీ వాడికి ఆత్మగౌరవం లేదు.. అందుకే పదవి పోగానే వాడు కుంగిపోతాడు. నన్నెవడూ పట్టించుకోడు, నేను సామాన్యుడిని అనే భావం వాళ్ల మనసుల్లో ఉంటుంది. మనకది ఏనాడూ లేదు. కాబట్టి నేను మీ అందరినీ కోరేది ఈ ఆత్మనిబ్బరం ఉండాలి. మనం చేస్తున్నది ఏమిటనే స్పష్టమైన అవగాహన, ఎందుకు చేస్తున్నామనే స్పష్టమైన అవగాహన ఉండాలి.

మనం ఏదోరకంగా అధికారం కోసం ఆరాటపడే సంస్థ కాదు, రేపొద్దున ఏం చేద్దాం అని పాకులాడి, వెతుకులాడే సంస్థ కాదు. స్పష్టమైన లక్ష్యాలను మన ముందుంచుకున్నాం. ఎలాంటి సమాజాన్ని, ఎలాంటి బహిరంగ జీవనాన్ని, ఎలాంటి రాజకీయాన్ని కోరుతున్నామనేది స్పష్టంగా అర్థం చేసుకుని ప్రజల ముందు విస్పష్టంగా ప్రకటించి, దాని కోసం నిరంతరం వివిధ రూపాల్లో ప్రయత్నం చేస్తున్నవాళ్లం. మనకున్న కొద్దిమేర అవకాశాలతోనే అసాధారణ ఫలితాలను చూపెట్టినవాళ్లం ఈ జాతికి. కేవలం ప్రాంతీయంగానే కాదు, జిల్లాలోనే కాదు, ఈ దేశంలోనే మార్పులకు శ్రీకారం చుట్టినవాళ్లం. అందుకని మన ప్రయత్నాలు విఫలమవుతున్నాయనుకోబోకండి. చివర్లో దానికి వస్తాను.

ఈవేళ దేశం ఒక తీవ్రమైన సంక్షోభంలో ఉంది, ప్రపంచమంతా సంక్షోభంలో ఉంది. ప్రపంచంతో పోలిస్తే మన సంక్షోభం చాలా ఎక్కువ. కరోనా రాకముందే మన ఆర్థిక పరిస్థితి మందకొడిగా సాగుతోంది. దీంతో మనం తీవ్ర సంక్షోభంలో ఉన్నాం. కానీ మన సంక్షోభం ఎప్పుడూ అవకాశం. సంక్షోభాన్ని చూసి వాపోయేవాడు ఒకడు. మరి దట్టమైన మబ్బుల్లో కూడా కాంతి

రేఖల్ని చూసేవాడు ఒకడు. కారుచీకట్లో దీపస్తంభాన్ని చూసేవాడు ఒకడు. ఆ కారుచీకట్లో కూడా దీపస్తంభాన్ని చూసేవాళ్లం మనం. సంక్షోభం పెనుమార్పులకు అవకాశం. ఆరోగ్య రంగాన్నే తీసుకోండి. అనారోగ్యం గురించే కదా కొవిడ్ వచ్చాక గొడవంతా.

గొప్ప ఆరోగ్య వ్యవస్థ ఉన్న దేశాలను కూడా కొవిడ్ బాధిస్తోంది. కానీ వాళ్లకి ఆరోగ్య వ్యవస్థంటూ ఉంది. ఇవాళ కాకపోతే రేపయినా వ్యాక్సిన్ వచ్చిన తర్వాత కొవిడ్‌ను అదుపు చేయగలరు, మిగతా జబ్బులున్న ప్రజల మీద భారం పడకుండా. సంపద, టెక్నాలజీ ఉన్నా కూడా మూర్ఖమైన వ్యవస్థ వల్ల కొన్ని దేశాల్లో ప్రజలకు తగినంత న్యాయం చేయలేకపోతున్నారు. అమెరికా ఉదాహరణకి. కానీ ప్రపంచంలో నాగరికత ఉన్న ప్రతి దేశమూ ఆరోగ్యాన్ని బాగుచేయటం కోసం, పెంచటం కోసం ఆధునిక సౌకర్యాలను సామాన్యుల జేబుపై భారం లేకుండా అందరికీ అందించ గలిగాయి. మన దేశం మాత్రం ఆ పని చేయలేదు. అది చేయకపోతే ఇక ప్రభుత్వాలెందుకు, రాజకీయాలెందుకు తగలెట్టనా? ఎవడు అధికారంలో ఉంటే ఏం కావాలి! ఏ పార్టీవాడు ప్రధానమంత్రయితే ఏం కావాలి, ముఖ్యమంత్రయితే ఏం కావాలి? ఎమ్మెల్యే అయితే ఏం కావాలి, ఎంపీ అయితే ఏం కావాలి? అందుకోసమా మనం? ఒక ఫ్యూడల్ సమాజంలో ఉన్నామా మనం? అద్భుతమైన ఆరోగ్యాన్ని బ్రిటన్‌లాగా, ఫ్రాన్స్‌లాగా ఒక్కరోజులో మనం ఇవ్వలేకపోవచ్చు. కానీ చాలా గౌరవప్రదమైన ప్రమాణాలతో, వాళ్ల స్థాయిలో 70-80 శాతం అందించే అదృష్టం, అవకాశం మనకున్నాయి. లోక్‌సత్తాయే ఒక ప్రతిపాదన తయారు చేసి ఇచ్చింది. ఇప్పుడు చేస్తున్న ఖర్చుకి అదనంగా ఓ రూ.90,000 కోట్లు వెచ్చిస్తే చాలు. ఇది జాతీయాదాయంలో అర శాతం. ఇవాళ ఖర్చు పెడుతున్నది 1.3%. ప్రభుత్వం నుంచి చేస్తున్న ఈ ఖర్చులో రాష్ట్రాలు ఎక్కువ పెడుతున్నాయి, జాతీయ స్థాయి నుంచి కొంత పెడుతున్నారు. దానికి మనం ఒక అర శాతం కలిపితే, విజ్ఞతతో ఖర్చు చేస్తే ప్రతి సంవత్సరం.. రేపొద్దున నా బతుకు ఏమైపోతుంది, కొవిడ్ వస్తే, డెంగీ వస్తే, గుండెజబ్బు వస్తే ఏమైపోతాను, లేకపోతే మామూలు జ్వరమొస్తే డాక్టర్ దగ్గరికి పోవాలంటే వేల రూపాయలు అయిపోతున్నాయి అన్న భయం, ఆందోళన లేకుండా ఈ దేశంలో ప్రతి కుటుంబానికీ ఆరోగ్యం అందించవచ్చు. పదుల లక్షల మందికి ఉపాధి కల్పించవచ్చు. వ్యవస్థలో చాలా జీవకళ వస్తుంది, ఆత్మవిశ్వాసం వస్తుంది, ఉత్పాదకత వస్తుంది. ఇది సాధ్యం. మన ముందు గొప్ప ఎజెండా ఉంది. చాలా దేశాల్లో అమెరికాలాంటి దేశాల్లో ఆరోగ్యాన్ని బాగు చేయటం అతి పెద్ద ఎజెండా పార్టీలకి. మనకు అసలు ప్రతిపాదించే పార్టీయే లేదు. ఈ స్పష్టత ఉన్నటువంటి నాయకత్వం లేదు. మన అదృష్టంకొద్దీ మనకు మొట్టమొదటి నుంచీ అవగాహన ఉంది, మన ముందొక స్పష్టమైన పథకం ఉంది. కొవిడ్ సంక్షోభాన్ని అవకాశంగా తీసుకుని రాష్ట్రాల స్థాయిలో ముందుకొస్తే రాష్ట్రాల్లోనూ అమలుకు ప్రయత్నిద్దాం. బహుశా తెలుగు రాష్ట్రాలు మిగతా రాష్ట్రాల కంటే ముందుండొచ్చు. మంచోచెడో ఆరోగ్య రంగాన్ని రాజకీయ

## లోక్‌సత్తా వాదనలే ప్రభుత్వాల విధానాలుగా వస్తున్నాయి

పధ్నాలుగు సంవత్సరాల నుంచి పార్టీగా, అంతకుముందు మరో పదేళ్ల నుంచి ఉద్యమ సంస్థగా కొనసాగుతున్న లోక్‌సత్తా ఈనాటికీ, ఏనాటికీ ఆచరణాత్మకమైన సైద్ధాంతిక శక్తేనని నిరూపితమైంది. ఇటీవలికాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు కావచ్చు, తీసుకొస్తున్న బిల్లులు, చట్టాలు కావచ్చు.. మన వాదనలకు మరింత బలం చేకూర్చేలా ఉంటున్నాయి. ఈ పరిణామాలన్నీ కూడా లోక్‌సత్తా కార్యకర్తలను ముందుకు నడిపిస్తున్నాయని నేను బలంగా నమ్ముతున్నాను. మనం సంస్థగా, పార్టీగా ముందుకొచ్చిన నాటి పరిస్థితులకు, ఇప్పటి పరిస్థితులకు ఎలాంటి మార్పు లేదు. ఇంకా చెడిపోయింది కూడా. అంటే మన అవసరం ఇంకా పెరిగిందని నేను బలంగా నమ్ముతున్నాను. పార్టీగా నిలదొక్కుకోవటానికి, పటిష్టంగా ముందుకు రావటానికి ఇది మనకొక మంచి అవకాశం. ఈ పరిస్థితులను ఉపయోగించుకుంటూ పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు, నాయకులకు నేను విన్నవించుకుంటున్నాను. ఇందుకోసం ప్రణాళికను రూపొందించి కార్యాచరణ వైపుకి వెళ్లాలి. దురదృష్టవశాత్తూ కరోనా మహమ్మారి వల్ల మనం అనుకున్నట్లు అడుగు వేయలేకపోతున్నాం. భవిష్యత్తులో సంస్థాగత నిర్మాణం పట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, పార్టీ సిద్ధాంతాల్ని, ఆచరణాత్మక విలువల్ని ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు లోక్‌సత్తా పార్టీ తెలంగాణ శాఖ శాయశక్తులా కృషి చేస్తుందని నేను తెలియచేస్తున్నాను. గతంలో మనం ఏదైతే నినాదాల్ని, విధానాల్ని ఇచ్చామో పార్టీలుగానీ, మీడియాగానీ వాటి వైపు రావటం లోక్‌సత్తాకు మరింత బలాన్ని చేకూరుస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బాగా పెరిగింది. దీని గురించి మనం 20 ఏళ్లుగా చెబుతున్నాం. అలాగే వ్యవసాయోత్పత్తుల అమ్మకంపై ఆంక్షల్ని తొలగించాలని, రాష్ట్రంలోని రైతులు దేశంలో ఎక్కడైనా పంటల్ని అమ్ముకోవచ్చని జేపీ గారి నేతృత్వంలో కర్ణాటక, మహారాష్ట్రలకు భుజాలపై ధాన్యం మూటల్ని తీసుకెళ్లి అమ్మి చేసిన పోరాట ఫలితం ఈవేళ కేంద్ర ప్రభుత్వం చేసిన కొత్త వ్యవసాయ చట్టాల రూపంలో వచ్చింది. కొంతమంది విచక్షణారహితంగా విమర్శిస్తున్నప్పటికీ, రేపు జరగాల్సింది ఇదే అని జేపీ గారు స్పష్టం చేయటం లోక్‌సత్తా పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తోందని నేను నమ్ముతున్నాను. ఇవన్నీ ఒక మంచి అవకాశం పార్టీని ముందుకు తీసుకెళ్లటానికి. జేపీ గారు ఎప్పటిలాగా మన వెన్నంటి ఉండి సహాయసహకారాల్ని అందిస్తారని ఆశిస్తున్నాను.

**తుమ్మనపల్లి శ్రీనివాస్, లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షులు**

ఎజెండాగా మార్చింది తెలుగు రాష్ట్రాలు. గతంలో రాజశేఖరరెడ్డి గారి హయాంలో.. వారు చేసిన తీరు వల్ల పెట్టిన ఖర్చుతో పోలిస్తే ఫలితాలు తీసుకురాకపోవచ్చుకానీ, దాని వెనకాల ఒక వ్యూహం ఉంది. ఆరోగ్యాన్ని రాజకీయ రంగంలో ఒక అంశంగా మార్చే పంథా ఉంది. దాన్ని మనం ఉపయోగించుకోవచ్చు.

వ్యవసాయం. మీకు ఏప్రిల్ మాసంలో గుర్తుండి ఉంటుంది. ఉల్లిపాయలు మన ఇళ్లల్లో మనందరం కిలో 8, 10 రూపాయలకు కొనుక్కున్నాం. రైతులకు 2,3 రూపాయలు వచ్చింది. ఈవేళ ధర రూ.30 అయింది మార్కెట్‌లో. వెంటనే ఎగుమతుల్ని నిషేధించారు. ఇదే సమయంలో వ్యవసాయ చట్టాలు కొన్ని వచ్చాయి. ఇవేమీ తుది పరిష్కారం, సర్వరోగ నివారిణి కావు. కానీ మనం ఏదైతే మార్కెట్‌లో రైతుకు స్వేచ్ఛ ఉండాలి, అతను పండించిన వస్తువుకి గిరాకీ పెరగాలి, నూటికి 50 మంది ఇప్పటికీ కూడా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నందున వారికి ఆదాయాలు పెంచటం మన విధానాలకు మూలం కావాలి, అంతేగానీ వాళ్ల బతుకుల్ని కుళ్లబెట్టి వాళ్లకు ఏదో చేస్తున్నామని వాళ్లందర్నీ నమ్మించి, ఎంతసేపటికీ నగర ప్రాంతాల్లోని వినియోగదారుల కోసమే చర్యలు తీసుకుంటే అంతకంటే అన్యాయం లేదు.. అంటున్నామో అందుకనుగుణమైనవి ఈ చట్టాలు. అందుకనే ఈ మూడు చట్టాల్ని మనం విస్పష్టంగా సమర్థిస్తున్నాం. కొంతమేర రైతుకి స్వేచ్ఛనిస్తాయి, కానీ ఇవి తుది పరిష్కారం కాదు, సర్వరోగ నివారిణి కాదు. ఇంకా చాలా చేయాలి. ఉత్పత్తిదారునికి – వినియోగదారునికి మధ్య దూరాన్ని తగ్గించాలి, రిటైల్ చైన్స్ పెద్దఎత్తున తీసుకురావాలి. రిటైల్ విధానం కాగితం మీద పెట్టారు, అమలు కావటం లేదు. నిలవ చేస్తే రైతుకి తట్టుకునేటటువంటి శక్తి కావాలి, ఆర్థికంగా తట్టుకునే శక్తి కావాలి. మళ్లీ పంట వేయాలి, దానికి పెట్టుబడి కావాలి. అక్కడ పంట ఉంది కాబట్టి దాన్ని సెక్యూరిటీగా తీసుకుని దానికి రుణసదుపాయం కల్పించగలగాలి. ప్రాసెసింగ్ పెద్దఎత్తున జరగాలి. మన దేశంలో 3% మాత్రమే ప్రాసెసింగ్ జరుగుతున్నది. గిడ్డంగులు విపరీతంగా పెరగాలి. ప్రభుత్వం చేయలేకపోతే, ప్రైవేటు రంగం రావటం ఒక మార్గం. దానిలో ఒక భాగం రిటైల్ చైన్స్. మన దేశంలో దాదాపు 45 కోట్ల టన్నుల పండ్లు, కూరగాయలు ఉత్పత్తి అవుతున్నాయి. దాన్లో 15–20 శాతం కుళ్లిపోతుంటే మనకున్న శీతల గిడ్డంగులు కేవలం 3.8 కోట్ల టన్నులు. అంటే 6.7% ఉన్నాయి. బంగాళ దుంపలకి తప్ప మిగతా పంటలకి దాదాపు స్టోరేజీ లేదు. అలాగే విదేశీ వాణిజ్యంలో మనకు స్థానం కావాలి. ప్రపంచంలో 8వ వంతు వ్యవసాయ భూమి ఉన్నా కూడా వ్యవసాయంలో మన స్థానం కేవలం 1.6%. ప్రపంచంలో నెంబర్‌వన్ పంటలు మనకు చాలా ఉన్నాయి గానీ, ఆయా పంటల్లో ప్రపంచ వాణిజ్యంలో మన వాటా అర శాతం, పావు శాతం. సిగ్గుచేటు. ఇంకా చాలా చేయాలి. కానీ కనీసం వ్యవసాయం మీద ఒక చర్చ మొదలైంది. ఈ కొవిడ్ నేపథ్యంలో సప్లయ్ చైన్స్ గూర్చి ఆరాటం మొదలైంది. కాబట్టి ఈ అంశాల్లో మనకున్నంత స్పష్టత ఇంకెవరికీ లేదు. మనం గతంలో చేసినంత ఏ పార్టీ చేయలా. ఏ ప్రధాన పార్టీలు కూడా వ్యవసాయంలో మనం చేసినంత వాళ్లు చేయలా. జాతీయ స్థాయిలో చేశాం, రాష్ట్రం మొత్తం ప్రభావితమయ్యేట్లు చేశాం. వీళ్లెవరూ కాదు. నేను గుండె మీద చెయ్యేసుకుని చెప్పగలను. కాబట్టి ఈ చట్టాల్ని మనం ముందుకు తీసుకెళ్లాలి.

మూడోది, స్థానిక ప్రభుత్వాలు. కనీసం నగరాల్లోనైనా సరే మార్పు రావాలి, ఈ కొవిడ్ సంక్షోభం ప్రధానంగా నగరాల సంక్షోభం కాబట్టి. మనం చూశాం గ్రామాల నుంచి వలస వచ్చిన వాళ్లు కొవిడ్ లాక్‌డౌన్‌తో నరకాన్ని చూశారు. మనం మనుషుల్లా చూడలా వాళ్లని, పురుగుల్లా చూశాం. ఒక నాగరిక దేశంలో, అంబేద్కర్ పేరున చట్టబద్ధ పాలన ఉండాల్సిన దేశంలో, మనం చేసింది చట్టబద్ధ పాలన కాదు. గ్రామాల నుంచి వచ్చిన పాపానికి, పేదలైన పాపానికి, పొట్ట చేత పట్టుకుని కన్నీళ్లతో తలదించుకుని మండుటెండలో ఈ నగరాల నుంచి గ్రామాలకు వలస పోవాల్సి వచ్చింది. సిగ్గుచేటు. మనం నాగరిక సమాజమని చెప్పుకోవటం మనందరికీ సిగ్గుచేటు. తలదించుకోవాలి. మనందరం వ్యక్తులుగా, సంస్థలుగా త్యాగాలు చేశాం, తలాకాస్త సాయం చేశాం. కానీ ఇదంతా తాత్కాలికమైన సాయం. ఈ పూట వాళ్లకేదో భోజనం పెడితే, కిట్ ఇస్తే పరిష్కారం కాదు. అసలు ఈ పరిస్థితి రాకూడదు. అది రాకుండా ఉండాలంటే చాలా ఏర్పాట్లు చేయాలి. దానిలో ఒక భాగం నగరాల్లో మౌలికమైన మార్పులు రావటం. నగరాల్లో ఏ పని చేసినా కూడా ఆర్థిక కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు వలస వచ్చిన వాళ్లకి గౌరవప్రదమైన జీవితం కావాలి. కనీసం నగరాల స్వయంపాలన, నగరాల సుపరిపాలన ఈ రెండూ కావాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ రెండూ కలసిసాగకపోతే దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం, సామాన్యులకి కడగండ్లు. కాబట్టి దీన్ని ఒక అవకాశంగా తీసుకుని నగరాల్లో స్వపరిపాలన, సుపరిపాలన సాధించాలి. కనీసం. దాన్నుంచి మన లక్ష్యం కూడా నెరవేరుతుంది. ఎప్పుడూ కూడా స్వామికార్యం, స్వకార్యం కలపాలి. స్థానిక స్వయంపాలన, సుపరిపాలనలోనే రాజకీయం మారటం కూడా ఉంటుంది. మీరు ఊహించండి ఒక్కసారి. 5–10 లక్షల జనాభా ఉన్న ప్రతి నగరంలో కూడా ఢిల్లీలాగా స్వపరిపాలనకు ఏర్పాట్లు జరగనీ, అప్పుడు మీలాంటి యోధానయోధులు ముందుకొస్తారు. ప్రతి నగరంలో ఉన్నారు ఈ దేశంలో మార్పు కావాలనే కోర్కె ఉన్నవాళ్లు, మనం లోక్‌సత్తా పేరు పెట్టుకున్నాం, పేరు పెట్టుకోకుండా ఉన్నవాళ్లుంటారు. నాకు రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి రోజూ వస్తుంటాయి మెస్సేజీలు. లోక్‌సత్తాలో చేరతాం, ఇది చేస్తాం, ఆ పని చేస్తాం అని చెప్పి. మనం ప్రతిపాదిస్తున్నవి కావాలని అందరికీ ఉంది. మనం ఆ పేరు, బ్రాండ్ గురించి ఆలోచిస్తున్నాం. కానీ ఈ లక్ష్యం అందరికీ ఉంది. ప్రతి నగరంలో స్వపరిపాలన వస్తే, మీకు నూటికి నూరుపాళ్లూ నేను చెబుతున్నాను– ఐదు నుంచి పదేళ్లలోపు దేశ రాజకీయ స్వరూపం మొత్తం మారిపోతుంది. దీన్నొక అవకాశంగా మనం తీసుకొని దాని కోసం పోరాడాలి. మనం రాజకీయ పోరాటమంటే ఊరికే ఇప్పుడున్నవాళ్లతో తలపడి, వాడు రూ.30

కోట్లు ఖర్చు పెడుతుంటే మనం 3 లక్షలు కూడా ఖర్చు పెట్టలేక, అంతకంటే ఖర్చు పెట్టటం ఇష్టంలేక, ముందు ఉబ్బితబ్బిబ్బై పోవటం, తర్వాత కళ్లనీళ్లయిపోవటం.. ఎక్కడికి పోయినా జనం మనల్ని ఆదరిస్తున్నారు సార్, జిందాబాద్ అంటున్నారు సార్, ఓట్లు మాత్రం పడటం లేదు సార్.. అనుకుంటే లాభంలేదు. ఎన్నిసార్లు అనుకున్నాం మనం! అది కాదు. దీన్ని మార్చాలి. వాడి క్షేత్రంలోకి పోయి మనం పోరాడితే ఉపయోగం లేదు. క్షేత్రాన్ని మార్చాలి. అది అంత తేలిక కాదు. మీకు తెలుసు, నాకు తెలుసు. దీనికో వ్యూహం కావాలి. దానికి ముందు ఒక ఆలోచన కావాలి, ఒక స్పష్టత కావాలి, చుట్టూ సత్యాన్ని దర్శించేటటువంటి శక్తి కావాలి. కాబట్టి నగరాల్లో సుపరిపాలన తీసుకురండి. నేను గ్రామాల మీద ఎందుకు దృష్టి పెట్టటం లేదంటే, అవసరం లేదని కాదు. గ్రామాల్ని నిర్వీర్యం చేశారు. గ్రామాల్లో సమర్థులైన నాయకులు లేకుండా చేశారు. ఆర్థిక వ్యవస్థను కుళ్లబొడిచేటప్పటికి, ఏ మాత్రం శక్తిసామర్థ్యాలున్నా కూడా గౌరవప్రదంగా బతకాలంటే నగరాలకు వలస వెళ్లటం అవసరమైంది. రెండు, గ్రామాల్లో ప్రజల్ని బిచ్చగాళ్లుగా మార్చేశారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఆశపడటం తప్ప నేను నిలబడతాను అన్న ఆత్మస్థయిర్యం కొరవడింది. ఒకప్పుడు ఉండేది గ్రామాల్లో ఆ స్థయిర్యం. పేదరికం ఉన్నకాలంలోనే, 60లు, 70ల కాలంలో. నేను మీలో చాలామంది కంటే ముసలోడ్ని. పూర్వం లోక్‌సత్తా ప్రారంభించినప్పుడు చాలామంది కంటే నేను కుర్రాడిగా ఉండేవాడ్ని. మా చిన్నప్పుడు గ్రామాల్లో డబ్బుల్లేవు, మౌలిక సదుపాయాలు లేవు, టెలిఫోన్ గురించి వినటమే తప్ప చూడటం లేదు. నేను టెలిఫోన్‌ను కోఆపరేటివ్ మిల్లు దగ్గర దూరంగా ఉండి చూసేవాడ్ని. కానీ అప్పట్లో సమర్థులైన, ఆత్మవిశ్వాసం గల నాయకత్వం ఉండేది. స్వావలంబన ఉండేది. మన ఊళ్లో మనం చేసుకుందామని కొంత ఖలేజా ఉండేది. ఈవేళ టెక్నాలజీ పెరిగినా, సంపద పెరిగినా ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని చంపేశాం గ్రామాల్లో. అందుకని బహుశా ప్రధానంగా ఇది మొట్టమొదట నగరాల్లోనే సాధ్యమవుతుంది. వివిధ కారణాల వల్ల. పన్నులు కట్టేవాళ్లు, పన్నులు కట్టినా కూడా పనులు జరగటం లేదని ఆక్రోశించేవాళ్లు, పరిష్కారాలు సాధించగల నేర్పరులు, నాయకత్వాన్నిచ్చేటువంటి శక్తిసంపన్నులు నగరాల్లో ఉన్నారు. కానీ పాలనలో వాళ్లకు స్థానం లేకుండా పోయింది. నగరాల్లో స్వపరిపాలనకు మనం ఏదోకరూపంలో వ్యవస్థను గనక సరిదిద్ద గలిగితే, అది నగరాల్ని మార్చటమే కాదు.. నగరాల్లో పేదల జీవితాల్ని బాగుచేయటమే కాదు.. స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటమే కాదు.. రాజకీయంగా మౌలికమైన మార్పునకు నాంది పలుకుతుంది.

ఇక విద్య. చాలాకాలం నుంచి మనం పోరాడుతున్నాం. మనం ఏదైతే కోరామో ఇప్పుడు దాదాపు అలాంటి విద్యావిధానమే వచ్చింది. కానీ ఇల్లలకగానే పండుగ కాదు. అది అమలుకావాలంటే.. చాలా లోతైనటువంటి అవగాహన కావాలి, పరిశీలన కావాలి! పేదరికం పోవాలి, కుల వ్యవస్థ ప్రభావం పోవాలి, ఈ దేశంలో అందరూ కూడా రాజ్యాంగం నీడలో బతకాలి, తలెత్తుకుని తిరగాలి, అందరూ సమానంగా వికసించాలి, అందరికీ సమానావకాశాలు రావాలి అంటే రెండే రెండు.. ఒక పక్కన మంచి ప్రమాణాల విద్య, పుట్టుకతో సంబంధం లేకుండా ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చే విద్య, ప్రతిభాపాటవాలను వెలికితీసే విద్య.. మరోపక్కన ఉత్పాదకతను పెంచేటువంటి, మనుషుల్ని నిబ్బరంగా నిలబెట్టేటువంటి మంచి ప్రమాణాల ఆరోగ్యం. ఈ రెండూ లేకుండా వ్యక్తి పెరగటం అసాధ్యం, సమానత్వం రావటం అసాధ్యం. నినాదాలిస్తే ఉపయోగం లేదు. విద్య, ఆరోగ్యం అందకే గదా ఆ ఉత్తర ప్రదేశ్ హథ్రాస్‌లో మనం చూశాం. ఆ పాప ఆ నిరుపేద కుటుంబంలో పుట్టిన కారణంగానే కదా.. అంతటి ఆక్రోశానికి గురైతే, గురైన తర్వాత కూడా ఆ పాపను చూసిన తీరు. ఆస్పత్రిలోగానీ, మరోచోటగానీ. చివరకు ప్రాణం పోయిన తర్వాత కూడా ఆ కుటుంబం పట్ల ప్రవర్తించిన తీరు. తల్లిదండ్రులకు కూడా తెలియకుండా, ఆ కుటుంబానికి కూడా తెలియకుండా, అనుమతి లేకుండా ఆ శవాన్ని అర్థరాత్రి దహనం చేశారు. చట్టబద్ధపాలనకు తర్వాత వస్తాను కానీ అసలు ఆ కుటుంబానికి, ఆ బిడ్డకు గానీ మంచి ప్రమాణాల విద్య, సంపాదించే శక్తి, మంచి ఆరోగ్యం ఉన్నట్లయితే, ప్రశ్నించే గొంతు ఉన్నట్లయితే, ఎలా ప్రశ్నించాలో తెలుసుకునే ధైర్యం ఉన్నట్లయితే ఈ పరిస్థితి చాలా మేరకు ఇలా ఉండేది కాదు. అద్భుతమైన సమాజమైనా కూడా కొన్ని నేరాలు జరుగుతుంటాయి. అవి పక్కన పెడదాం. కానీ ఈ పరిస్థితులు రావు. కులం కారణంగా నేరాలకు బలి కావాల్సిన అవసరం లేదు, పేదరికం కారణంగా దిక్కూమొక్కూలేకుండా ఆరోగ్యం అందక అలమటించాల్సిన అవసరం లేదు, అంతా అయ్యాక అన్యాయం జరిగిన తర్వాత కూడా అన్యాయాన్ని ప్రశ్నించే అవకాశం కూడా లేకుండా నోర్మూసుకు కూర్చోవాల్సిన అవసరం లేదు. ఇది మనల్ని కదిలించాలి. రాజకీయం ఎమ్మెల్యే, ఎంపీల పదవుల కోసమైతే అంతకన్నా దిక్కుమాలిన రాజకీయం ఇంకోటుండదు. మహాత్ముడు చెప్పింది రాజకీయానికి ఒక లక్ష్యం ఉండాలి. ఆ లక్ష్యం కోసం రాజకీయం ఒక మార్గం. ఆ మార్గం అనుకూలిస్తే, ఆ మార్గం సత్యమైతే దాన్ని పాటిద్దాం. లేకపోతే మరో మార్గం తీసుకుందాం. కానీ మన లక్ష్యం మాత్రం మారదు.

ఇంకోటి, సామాన్యుడికి మామూలు ప్రభుత్వ సేవలు సరిగా అందే ఏర్పాటు! మళ్లీ దీన్లో కూడా మీరు గమనించారో లేదో మొట్టమొదట ఈ నినాదం ఎత్తింది మనం. 1998లోనే ఈ 'స్వరాజ్యం' అన్న పుస్తకాన్ని మనం వెలువరించాం. రెండు లక్షల కాపీలు అమ్ముడుపోయిందది. పెట్రోలు బంకుల్లో మార్పుని ప్రారంభించాక పట్టణాల్లో సిటిజన్ చార్టర్స్ సాధించాం. కొంతకాలం అమల్లోకి వచ్చాయి. ఈవేళ ఆ డిమాండ్ క్రమంగా దేశంలో ఒక ఉద్యమం అవుతోంది. పార్టీలు మొట్టమొదటిసారిగా దీన్లో ఓట్లున్నాయని గమనించాయి. కర్ణాటకలోగాని, మహారాష్ట్రలోగాని, తెలంగాణలోగాని, మరికొన్ని చోట్లగాని క్రమక్రమంగా వివిధ రూపాల్లో ఏదోకరకంగా ప్రజలకి ఈ

# పైలట్ ప్రాజెక్టుగా కొన్ని నియోజకవర్గాల మీద దృష్టి పెడదాం

ఇది ఒక గొప్ప రోజు. గొప్ప ఆలోచనలతో జయప్రకాష్ నారాయణ్ గారు లోక్‌సత్తా పార్టీని ప్రారంభించారు. 14 సంవత్సరాలుగా జేపీ అడుగుజాడల్లో నడుస్తున్నాం. మనల్నందరినీ అన్నదమ్ముల్లా సమాదరిస్తూ కాపలాకాస్తూ ఈ నాయకత్వ స్థాయికి తీసుకొచ్చినందుకు ముందుగా జేపీగారికి కృతజ్ఞతలు. తమ్ముడు తుమ్మనపల్లి శ్రీనివాస్ చెప్పినట్లు ఇప్పుడు మన అవసరమైతే దేశంలో, రాష్ట్రంలో ఎక్కువగా ఉంది. ఏకరువు పెట్టనుగానీ, మనం సాధించిన విజయాలు అనేకం ఉన్నాయి. ఈవేళ పత్రికలు కూడా జేపీ గారి భాష వాడాల్సిన పరిస్థితి వచ్చింది. ఈరోజు ప్రభుత్వాలు కూడా మనం చెప్తున్నవే చేయాల్సి వస్తోంది. ఉదాహరణకు ఏపీ విషయాన్నే తీసుకుంటే, కంటి ముందు పాలన, ఇంటి ముందు ప్రభుత్వం అని మనం ఇచ్చిన నినాదానికనుగుణంగానే గ్రామ, వార్డు సచివాలయాలు ప్రారంభమయ్యాయి. మరింతగా ప్రజల దగ్గరికి వచ్చింది పరిపాలన. అయితే లోపాలు అనేకం. గతంలో తెలుగుదేశం హయాంలో లోపాలు వేరు, ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి హయాంలో లోపాలు వేరు. పెద్దలు జేపీ గారికి.. ఇలా చేద్దాం, ఇలా చేయాలి అని చెప్పగలిగేంతవాడిని కానుగానీ, గత 14 సంవత్సరాలుగా లోక్‌సత్తా వేదిక మీద మూడు ఎన్నికల్లో పోటీ చేయటం సహా పలు కార్యక్రమాల్లో, అనేకమంది సహచరులతో కలసి పాల్గొన్న వ్యక్తిగా చెబుతున్నాను.. నాలాగా పనిచేయటానికి చాలామంది సిద్ధంగా ఉన్నారు. నేను జేపీ గారిని కోరుతున్నాను.. అయ్యా, మీరు ఆలోచించండి. 2024కి ముందు ఒక పైలట్ ప్రాజెక్టుగా ఇప్పుడు ఏదైనా అంశాన్ని తీసుకుందాం. దాన్ని ఒక ఉద్యమ పోరాటంగా మలుద్దాం. ఎన్నికల సంగతి దేవుడికెరుక. ఈరోజు సంగతి అప్పుడు ఆలోచిద్దాం. మీరు తెలంగాణలో ఒక 10 నియోజకవర్గాలు, ఏపీలో 10 ఎంపిక చేసి.. ఎవరైతే టైమ్ ఇవ్వగలరో, ఎవరైతే తమంతటతాముగా నిధుల్ని సమీకరించుకోగలుగుతారో, ఎవరైతే ప్రజాఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటారో, అలాంటి వాళ్లను తయారుచేసి ఆ నియోజకవర్గాల్లో పైలట్ కార్యక్రమంగా నడిపించండి. ఏపీలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి, కోర్టులకు మధ్య ఘర్షణ వాతావరణం నేపథ్యంలో మీరిచ్చిన స్టేట్‌మెంట్‌ని వైఎస్సార్ పార్టీ వాళ్లు సర్క్యులేట్ చేసుకుంటున్నారు. ఇప్పుడు ఆ మాట చెప్పే ధైర్యం ఉన్న వ్యక్తి రాష్ట్రంలో, దేశంలో కూడా ఎవరూ లేరు. రాష్ట్రంలో ఎవరూ మాట్లాడలేని పరిస్థితి. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మాట్లాడిన వాళ్లకి ఇపుడు జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక విశ్వసనీయత లేకుండా పోయింది. జేపీగారు ఒక మాట చెబితే, అది కులాలు, మతాలు, ప్రాంతాలకి అతీతంగా ఉంటుందనే భావన ప్రజల్లో ఉంది. అయితే రెండో వైపు కూడా ఉంది. గతంలో తెలుగుదేశం హయాంలో మీరు ఏం మాట్లాడినా ఒక వర్గం వారు స్వాగతిస్తే ఇంకో వర్గం వారు వ్యతిరేకించారు. అట్లాగే ఇప్పుడు వైసీపీ హయాంలో ఒక వర్గం వారు వ్యతిరేకిస్తుంటే, ఇంకో వర్గం వాళ్లు స్వాగతిస్తున్నారు. రాజకీయాలలో ఇది జరుగుతుంటుంది. అశోక్‌గజపతి రాజు గారి ఆధ్వర్యంలోని మాన్సాస్ ట్రస్ట్ ఇంకో చిన్న ఉదాహరణ. ఒక వ్యక్తిని టార్గెట్ చేసుకుని కోట్లాది రూపాయల కార్యక్రమాల్ని భూస్థాపితం చేసే ప్రయత్నం చేశారు. కానీ మాట్లాడటానికి ఏ ఒక్కరికీ ధైర్యం లేదు. మనం ఒక్కళ్లమే లీడ్ తీసుకున్నాం. లోక్‌సత్తా పార్టీ తరపున మాట్లాడాం. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు ఎక్కడెక్కడ పనిచేసే అవకాశమున్నవాళ్లుంటారో, ఆ నియోజకవర్గాల మీద దృష్టి పెడదాం. మీరు గైడ్‌లైన్స్ ఇవ్వండి. లేదూ, ఇది రాజకీయానికి సమయం కాదు, మనం ఒకరికి దగ్గర, ఇంకొకరికి దూరం అవుతామనుకుంటే.. కేవలం ప్రజాఉద్యమాన్ని స్టార్ట్ చేద్దాం. నా దృష్టిలో కొన్ని అంశాలున్నాయి. విద్యుత్ మీటర్ల మీద మీ స్టాండ్‌నే విశాఖ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. కొవిడ్ వల్ల ప్రజల డబ్బుని ప్రైవేటు ఆస్పత్రులు పిండేస్తున్నా, ప్రభుత్వాస్పత్రులు చేతులెత్తేసినా ప్రభుత్వం ఒక పరిధి దాటి ఏమీ చేయలేకపోయింది. జగన్మోహన్ రెడ్డి రెండు అంశాల మీద తప్ప దేని మీదా దృష్టి పెట్టటం లేదు. ఏడాదికాలంలో అయ్యే అప్పును కేవలం 5 నెలల్లో చేశారని ఏపీ ప్రభుత్వాన్ని 'కాగ్' తీవ్రంగా ఆక్షేపించింది. మూడు రాజధానుల గొడవ, కోర్టులతో వివాదాలు వంటి సమస్యలున్నాయి. వీటన్నిటిపై మీరు బయటికొచ్చి చర్చను ప్రారంభించాలి. పరిష్కారాలతో కొన్ని పార్టీలను కలుపుకుని పోరాటం ప్రారంభించాలి. లేదూ ఒంటరిగానైనా లోక్‌సత్తా కొత్త రాజకీయానికనుగుణంగా రోడ్‌మ్యాప్‌ను తయారుచేసి ముఖ్యమంత్రి ముందుంచి, అందులోని అంశాల సాధన కోసం ప్రజల్లో కార్యక్రమాలు చేయాలి. లోక్‌సత్తా ప్రత్యక్షంగా కనిపించకపోవటంతో పవన్ కళ్యాణ్ లాంటి వాళ్లు కూడా తమకు పోటీలేదన్నట్లు సొంత పనులు చూసుకుంటున్నారు. ఇప్పుడు నా వయసు 55. నలభైల వయసు నుంచి మీ నాయకత్వంలో, వర్మ గారి నేతృత్వంలో, డాక్టర్ పట్టాభి రామయ్యగారి ప్రోత్సాహంతో అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మీరిచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని ప్రజల మధ్య ఉంటూ ప్రజాప్రయోజనాల కోసం పెద్దపెద్ద నాయకులతో కూడా తలపడగలిగాను. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకత్వం విఫలమవటంతో రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఏర్పడింది. లోక్‌సత్తా విధానాలు, స్పష్టత పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణ, విశ్వసనీయత ఏమాత్రం చెక్కుచెదరలేదు. మీ మాటకు విలువుంది. మీరు నాయకత్వం వహిస్తే రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద మార్పు వస్తుంది.

**- భీశెట్టి బాబ్జీ, లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షులు**

మామూలు సేవలు అవినీతి లేకుండా, వేగంగా, సులభంగా అందటం మొదలైంది. దాన్లో ఓట్లున్నాయనే విషయాన్ని గుర్తించి కొందరు దృష్టి పెట్టారు. ఆలస్యంగా జరుగుతోంది. 22 ఏళ్లు అయింది మనం మొదలుపెట్టి. అయినా ఇప్పుడు జరుగుతోంది. దీన్ని మరింత వేగవంతం చేయాలి. అన్నిటికీ విస్తరించాలి. ప్రతి సామాన్యుడికీ అర్థం కావాలి. దీన్ని ఉద్యమరూపంలోకి తీసుకురావాలి.

ఇక చట్టబద్ధపాలన. అన్నిటికంటే కీలకమైనది. మనిషికి ఆత్మగౌరవాన్నిచ్చేది, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేది, పుట్టుకతో ఉన్న అసమానతలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ సమాజంలో స్థానం కల్పించేది చట్టబద్ధపాలన! అందుకే అంబేద్కర్ జీవితమంతా పడ్డ తపనకి ఒకేఒక్క నిర్వచనం ఇవ్వాలంటే చట్టబద్ధపాలన! సమాజంలో దుర్మార్గాలు, కుల వ్యవస్థ ఉన్నాయి. సమాజంలో ఉన్నటువంటి ఈ దుర్నీతికి – రాజ్యాంగంలో ప్రతిపాదించిన విలువలకి మధ్య ఎప్పుడూ కూడా కొంత అగాథం ఉంటుంది. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క రకంగా ఉంటుంది. అమెరికాలాంటి దేశాల్లో ఒకపక్కన మనుషులంతా సమానమే అని చెబుతున్నా కూడా బానిసత్వం ఉంది. రాజ్యాంగంలో మనుషులంతా సమానమే. కానీ సమాజం రీతి బానిసత్వం. రెంటికీ మధ్య అగాథం ఉంది. అలాగే ఇతర దేశాల్లో. ప్రతి సమాజంలో ఈ సమస్యలున్నాయి. ఉదాత్తమైన విలువలకి, మనం కోరుకునే సమాజానికి.. మనం రోజువారీ నడిచే రీతికీ మధ్య ఎప్పుడూ తేడా ఉంటుంది. ఈ తేడాని, ఈ దూరాన్ని తగ్గించేదే రాజ్యవ్యవస్థ, చట్టబద్ధపాలన. అది లేకుండా.. కుల వ్యవస్థ పోవాలి, వివక్ష పోవాలి అని నినాదాలిస్తూ కూర్చుంటే అన్యాయం పోదు. బలమైన చట్టబద్ధ పాలనకు ఏర్పాట్లు కావాలి. వివిధ రూపాల్లో. చాలా మామూలు రూపంలో మనం చూసినట్లయితే పోలీసు యంత్రాంగం సమర్థంగా పనిచేస్తోందా? నిష్పాక్షికంగా పనిచేస్తోందా? స్వతంత్రంగా పనిచేస్తోందా? జవాబుదారీగా పనిచేస్తోందా? ఈ నాలుగు పదాలు ఉండాలి. మన దేశంలో సమర్థం, నిష్పాక్షికం, స్వతంత్రం, జవాబుదారీతనం.. ఈ నాలుగూ లేవు. అవి చేయటమెట్లా? ఇది పోలీసులకు వ్యతిరేకం కాదు, అనుకూలం కాదు. పోలీసులు చాలా కీలకమైన పని చేస్తున్నారు. లేకపోతే వ్యవస్థ కుప్పకూలిపోతుంది. అరాచకత్వం వస్తుంది. అంబేద్కర్ ఏనాడో చెప్పాడు– అరాచకత్వం మార్గం కానే కాదు అని. అందుకనే స్వతంత్రం వచ్చాక అంతకు ముందున్న పద్ధతుల్ని మీరు ఆపేసేయండి అని. అవి పూర్వకాలం పద్ధతులు, వలస పాలనలో పోరాడిన పద్ధతులు. ఈవేళ మీకు ఓటు, వాక్స్వాతంత్ర్యం, స్వేచ్ఛ ఉన్నాయి. మరొకరిని ఆటంక పరిచే పద్ధతులు, రాస్తారోకోలు, బంద్‌లు మార్గాలు కానే కాదు అని చాలా స్పష్టంగా చెప్పిన మొట్టమొదటి జాతీయ నాయకుడాయన. కానీ అది జరగాలంటే మీ హక్కులకి రక్షణ ఉండాలి. నేరపరిశోధన స్వతంత్రంగా ఉండాలి, సమర్థంగా ఉండాలి, నిష్పాక్షికంగా ఉండాలి, జవాబుదారీగా ఉండాలి. మొట్టమొదటి మూడూ ఉండి కూడా చేతిలో తుపాకీ ఉన్నవాడు, లాఠీ ఉన్నవాడు మనల్ని శాసిస్తుంటే ఈ దేశం బాగుపడదు. కాబట్టి జవాబుదారీగా ఉండాలి. ఈ నాలుగింటినీ కూడా జాగ్రత్తగా మిళితం చేయాలి. ఈవేళ హత్రాస్‌లోగానీ, నిర్భయ గానీ, మరో కేసు గురించి గానీ కేవలం ఆవేశంతో అలసిపోవటం కాకుండా దానికొక పరిష్కారమార్గాన్ని కావాలి. మన మనసులో ఉన్నటువంటి ఆకాంక్షలకి ఒక నిర్దిష్టమైనటువంటి వాస్తవ రూపాన్నిచ్చి దాని కోసం సమాజాన్ని ప్రేరేపించి రాజకీయాన్ని సందర్భోచితంగా ఆ మార్గానికి తిప్పటం అనేది నిజమైనటువంటి నాయకత్వం, నిజమైనటువంటి మార్పు. అలాగే ప్రాసిక్యూషన్. మన దేశంలో ఉన్నది బలహీనమైన ప్రాసిక్యూషన్. అమెరికాలాంటి దేశంలో దాదాపు 50,000 మంది ప్రాసిక్యూటర్లు ఉన్నారు. మన దేశం మొత్తంలో 7,000 మంది ప్రాసిక్యూటర్లు ఉన్నారు. ప్రపంచంలో ఎక్కడా ఇట్లా ఉండదు. మరి ఈ ప్రాసిక్యూటర్ల సంఖ్యను పెంచటం జరగాలి. సంఖ్యను పెంచితే చాలదు, సామర్థ్యాన్ని పెంచాలి. నిష్పాక్షికంగా, ధైర్యంగా స్వతంత్ర నిర్ణయం చేయాలీ అంటే ప్రతి జిల్లాకి ఓ ప్రాసిక్యూషన్ యంత్రాంగం ఉండి ఒక జిల్లా జడ్జి వాళ్లందరికీ నాయకత్వం ఇచ్చే ఏర్పాటు కావాలి. ఇక కోర్టులు జాప్యం లేకుండా, వేగంగా, న్యాయంగా, సామాన్యులకు అందుబాటులో ఉండేట్లుగా న్యాయం అందించే ఏర్పాట్లు చేయాలి. దీని కోసం చాలా పోరాటాలు చేశాం. స్థానిక న్యాయాలయాల చట్టం కూడా తీసుకొచ్చాం. అమలు పట్టించుకోవటం లేదు. ఈ మొత్తాన్ని సాధించగలిగి ఉండాలి. నాగరికత ఉంటే ఇది కనీసమైనటువంటి లక్ష్యం!

వీటిని సాధించటంతోపాటు వీటిపై ప్రజల్ని చైతన్య పరచటం ఎంతో అవసరం.

ఉదాత్తమైన చట్టబద్ధపాలన, ఈ దేశంలో అధికారం ఉందా లేదా అన్నదానితో సంబంధం లేకుండా, ఆడంబరానికి గురికాకుండా సేవాభావంతో పనిచేయటం, జవాబుదారీతనం ఉండటం, ఫ్యూడల్ సంస్కృతి నుంచి ప్రజాస్వామ్య సంస్కృతిని తీసుకురావటం, వీఐపీ సంస్కృతిని అంతం చేయటం ఈ మొత్తం ప్రజల మనసుల్లో నాటుకోవాలి. మీరు, నేను మనసులో అనుకుంటే లాభం లేదు. ఎక్కడ, ఎందుకని ఆలస్యమవుతున్నాయా ఇలాంటివి అంటే.. మన మనసులో ఉన్న ఆలోచనలు, లేకపోతే కొన్ని సందర్భాల్లో ఏదో కారణంగా వస్తున్న చట్టాలు, నిబంధనలు ప్రజల్ని ఆ మార్గానికి ఇంకా తీసుకెళ్లలా. కోర్టులు ఏం చెబుతున్నాయా.. ఎవరూ కూడా కారుకి హోదా లైట్లు గట్రా పెట్టుకోకూడదని. కానీ ఏ ఊళ్లోనూ పట్టించుకోరు. ఎందుకంటే, ప్రజల్ని మనం సమాయత్తం చేయలా, సమాజం ఇంకా సిద్ధం కాలా, ఈ ప్రజాస్వామ్య సంస్కృతి ఇంకా మన నరనరాల్లో ఇంకలా. కాబట్టి చట్టబద్ధపాలన, న్యాయపాలన ఊరికే చట్టాలతో మాత్రమే రాదు. అందుకే లోక్‌సత్తా తయారుచేసిన, సాధించిన చట్టాలు కేవలం ఇలా ఉండకూడదని చెప్పటం కాదు– అలా ఉండటం కోసం తగిన సంస్థాగత ఏర్పాట్లు సహా ఉంటాయి. అది అంబేద్కర్ రీతి.

ఇక మౌలికమైన రాజకీయ సంస్కరణ! ఎన్నికల వ్యవస్థలో మార్పులు ఒకపక్క, రాజకీయ పార్టీల్లో మార్పులు ఇంకోపక్క

వెంటనే సాధ్యమవుతుందో కాదో చూద్దాం సందర్భాన్ని బట్టి. వీళ్లేదో తెలిసోతెలియకో ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటున్నారు కాబట్టి దాన్ని ఉపయోగించి ఎన్నికల వ్యవస్థలో మార్పుకి ప్రయత్నం చేస్తున్నాం. ప్రత్యక్ష ఎన్నిక పెట్టాలని అడుగుతున్నాం. కనీసం ఒక మార్పన్నా రావాలి. ఎప్పుడైతే ఆ మార్పు వస్తుందో, ఎమ్మెల్యేలని గెలిపించుకోవటం, ఎమ్మెల్యే బాగా డబ్బు ఖర్చు పెట్టేవాడు రావటం బదులు.. ఒక నాయకుడు, నాయకురాలి వ్యక్తిత్వం, ప్రజల్లో ఉన్న ప్రతిష్ఠ మీద ఎక్కువ ఆధారపడటం జరుగుతుంది. ఎమ్మెల్యేల బాధ్యత శాసనసభలో చట్టాలు చేయటం, జవాబుదారీతనాన్ని కాపాడటం అవుతుంది. అప్పుడు స్థానిక ప్రభుత్వాలు బలపడతాయి. రోజువారీ పాలనలో జోక్యం ఉండదు. డబ్బుల ప్రభావం ఒక్కరోజు కాకపోయినా క్రమక్రమంగానైనా తగ్గుతుంది. డబ్బు బదులు నాయకుల ప్రతిభ, సామర్థ్యం, వారి చరిత్ర తదితరాలు ప్రధానమవుతాయి. దామాషా పద్ధతికి అవకాశముంటే దాని కోసం ప్రయత్నిద్దాం. కానీ ఈవేళ నా దృష్టిలో ఈ అవకాశం కన్పించటం లేదు. రాజకీయ పరిస్థితుల్ని బేరీజు వేసుకుని వ్యూహాన్ని మనం తీసుకోవాలి. కాబట్టి మన ముందు స్పష్టమైన లక్ష్యాలుండాలి. దీనికి మీరంతా చెప్పినట్లు ఉద్యమ రూపాన్నివ్వాలి. ఎన్నికల్లో పోటీ అనేది మీ మనసుల్లో కొంతమందికి ఉందని నాకు తెలుసు. మీ అందరికీ తెలుసు– నేను అంత తేలిగ్గా కాదనేవాడ్ని కాదు. ఒకరి మాటను నిరాకరించేవాడ్ని కాదు. అది నా మనస్తత్వం కాదు. నా మీదున్న ఆరోపణ అది. కానీ మన కళ్ల ముందు స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు వాస్తవమేంటో.. మనం ఊహాలోకాల్లో తేలితే లాభం లేదు. రాజకీయానికి మరో రూపాన్ని మనం ఇచ్చాం. మన పట్ల ఆదరణ ఎందుకుందో మీరు గమనించటంలా. ఇప్పటికి కూడా మనం ఏం చెప్పినా ప్రతి పార్టీ వారూ వాళ్లకు అనుకూలమైన అంశాలను తీసుకుని అదే పనిగా మెగాఫోన్లలో పబ్లిసైజ్ చేసుకుంటున్నారు. ఏ పార్టీ అయినా సరే. ఇవాళ వ్యవసాయ రంగంలో భారతీయ జనతా పార్టీ. కొత్త వ్యవసాయ చట్టాలపై మా మంత్రులు పాల్గొంటున్నారు, మీరొస్తారా సభకు అని వాళ్లు అడిగితే మొట్టమొదటిసారిగా కొవిడ్ నేపథ్యంలో ఒక సభలో పాల్గొనటానికి నేను ఒప్పుకున్నా. మామూలుగా నేను వెళ్లటంలా సభలకు. ఎవరూ వెళ్లకూడదు మామూలుగా. బీజేపీకైనా, మరొకరికైనా వేసిన ఓటు చాలా కీలకమైనదయా, ఓటుకి ఫలితాలుంటాయి, ఓటేసి ఎన్నుకున్న తర్వాత ప్రభుత్వాన్ని పరిపాలించకూడదనే హక్కు మనకి లేదు, తప్పు చేస్తే నిలువరించే హక్కున్నది, విమర్శించే హక్కున్నది, కానీ ఓటును ఆషామాషీగా తీసుకోకూడదనే మాటను మళ్లీమళ్లీ చెబుతుంటే.. ఒకళ్లు బాగుందనుకుంటున్నారు, ఒకళ్లు బాగా లేదనుకుంటున్నారు. ఎందుకంటే ప్రతిదీ కూడా మనం రాజకీయము, ఫ్యూడల్ స్వభావము, ఒక వ్యక్తి, ఒక పార్టీ, ఒక కులం చుట్టూ తిప్పుతున్నాం తప్పితే, ఒక రాజ్యాంగ వ్యవస్థ, కొన్ని మౌలికమైన సూత్రాలు, శాశ్వతంగా ఉండేటువంటి కొన్ని సిద్ధాంతాలు, సత్యాలు అన్న విషయం మన దేశంలో మర్చిపోయాం. ఆ కారణంగా మనం ఏం చెప్పినా కూడా వక్రభాష్యాలు, లేకపోతే వాళ్లకు అనుకూలంగా మలచుకోవటం. కానీ మీరు గమనించారా.. ఏ ఒక్కరూ కూడా మన విశ్వసనీయతను శంకించలేకపోతున్నారు. ఎందుకంటే, నేను చెప్పింది వాస్తవమని వాళ్లకు తెలుసు. ఇంకో సందర్భంలో మనం చెప్పేది.. ఇవాళ మనం చెప్పింది బాగుందనిపిస్తున్నవారికి వ్యతిరేకంగా అనిపిస్తుంది. కానీ అలాంటి సందర్భాల్లో కూడా శంకించలేకపోతున్నారు. మౌనంగా ఉంటున్నారు. ఎందుకొచ్చిందీ ఆ బలం.. మీరు ఎప్పుడైతే జాతికి కావలసిన లక్ష్యాల కోసం నిరంతరం పోరాటం చేశారో, అప్పుడు నిజమైన నైతికాధికారం మీ దగ్గరకు వస్తుంది. రాజ్యాధికారం రావచ్చు, రాకపోవచ్చు. దానికి పరిస్థితులు ఉండచ్చు, ఉండకపోవచ్చు. మనం ఈ ప్రవాహంలో కొట్టుకుపోయి ఊబిలో కూరుకుపోయి ఎట్లాగొట్లా రాజ్యాధికారం కావాలంటే, ఇవాళ ఎమ్మెల్యేలైనవాళ్లకి ఏం అధికారం ఉందండీ? వాడి పదవి తప్ప. మీరు కొంచెం మనసు పెట్టి ఆలోచించండి. వాడి పదవి తప్ప వాడు ఏం మార్పు తేగలుగుతున్నాడు? ఎంపీ అయినవాడికి ఏం అధికారం ఉంది, మంత్రి అయినవాడికి ఏం అధికారం ఉంది? ముఖ్యమంత్రికేముంది, ఆ మాటకొస్తే ప్రధానమంత్రికి ఏముంది నిజమైన అధికారం, మార్పులు తెచ్చే అధికారం? మనం ఎలాంటి అధికారం కోరుకున్నామో అలాంటి అధికారం ఉంటే ఇలా ఎందుకుంటుంది ఈ దేశం? ఇవాళ పదవులు లేవా? అప్రతిహతమైన అధికారం లేదా? అడ్డున్నారా వాళ్లకెవరైనా? ఏం చేస్తున్నారక్కడ, ఏం ఉద్ధరిస్తున్నారు గనక? మనం అలాంటి అధికారాన్ని, ఆ రీతిలోనే కోరితే అది నిష్ప్రయోజనం, జాతికి చాలా హాని చేసినవాళ్లమవుతాం. మనం ఆ కారుచీకటిలో దీపస్తంభంలాగా ఉండాలి. ఈ చీకట్లను తొలగించే ఏర్పాట్లపై సంస్థాగతంగా మనం లోతైన ఆలోచన చేసినవాళ్లం కాబట్టి, దీర్ఘకాలిక కృషి చేశాం కాబట్టి– దాని కోసం నిలబడాలి. 'ఆప్' లాంటి పార్టీ కూడా సందర్భం వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడలేకపోతోంది సిద్ధాంతంతో. రైతుల గొడవైంది. ఆప్ ఈ వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకమని ఉద్యమం. ఏదో తాత్కాలిక అవసరాల కోసం. ఎందుకంటే వాస్తవం కోసం నిలబడే ధైర్యం చాలటంలా. మనం ఏనాడూ అలా లక్ష్యశుద్ధిని మార్చలా. ఈ దేశానికి అది కూడా కరువైపోయినట్లయితే, నిరంతరం సత్యం పక్కనే వెళ్లేది, కారుచీకట్లో దీపస్తంభాన్ని చూపెట్టేది, ఈ చీకటిని ఛేదించేది లేకపోతే, ఆ వెలుతురు లేకపోతే ఇంకా ఏమిటి దేశానికి మార్గం? 'సుదూరంగా ఉండే నక్షత్రాలను చూసి దారిని నిర్ణయించుకోవాలి, హడావుడిగా వెళ్తుండే లాంతర్లను చూసి కాదు' అని మొట్టమొదట్నుంచి అనుకున్నాం మీకు గుర్తుందో లేదో!

We must search our coast with the light of the distant stars, by the twinkle of the distant stars, not by the passing ships. ఒక్క విషయం మనసులో పెట్టుకోండి. నేను మనసు విప్పి మాట్లాడుతున్నాను. ఇది రికార్డు కూడా అవుతోంది కాబట్టి, మళ్లీ మళ్లీ మళ్లీ చర్చించుకోండి, ఇందులోని తప్పొప్పులను ఆలోచించండి, మళ్లీ చర్చించండి. రాజకీయ వ్యూహాలు ఇంకోసారి కూర్చుని మాట్లాడుకుందాం. కానీ ఒక్క విషయం ఏనాడూ మర్చిపోకండి. మానవ ఇతిహాసంలో గత

100 ఏళ్లుగా వచ్చిన అనూహ్యమైన మార్పులు చరిత్రలో ఎప్పుడూ రాలా. గత 25 ఏళ్లుగా వచ్చిన మార్పులు అంతకుముందున్న 5,000 సంవత్సరాలలో రాలా. బహుశా వచ్చే 10 ఏళ్లలో వచ్చే మార్పులు.. ఈ మాట చాలా జాగ్రత్తగా ఆలకించండి, వచ్చే పదేళ్లలో వచ్చే మార్పులు గత 5,000 సంవత్సరాలలో కూడా రాలా. ఈ మార్పులకి రాజకీయం ఒక అంశం మాత్రమే. సాంకేతికమైన శక్తులు, టెక్నాలజీ, ఆర్థికమైన శక్తులు, ఆర్థికంగా తాము ఎదగాలన్న ప్రజల ఆకాంక్షలు– వీటి నుంచి మార్పు బలంగా వస్తుంది. రాజకీయం కొన్ని సందర్భాల్లో దీన్ని ఆపుతుంది. ఇవాళ అమెరికాలాంటి పరిణతి చెందిన దేశంలో కూడా రాజకీయం భ్రష్టుపట్టింది. మనం సిగ్గుపడేట్టుగా ఉంది. కొన్ని సందర్భాల్లో అంత పరిపక్వతలేని సమాజమైనా, అంత అనుభవంలేని ప్రజాస్వామ్యమైనా వాళ్ల కంటే మనం మెరుగనిపిస్తుంది. కాబట్టి రాజకీయంలో ఒడిదుడుకులున్నాయి, ఏ దేశంలోనైనా సరే. మనమంతా బాగుందనుకున్న దాన్నుంచి ఒక్కసారి కుంగిపోవటం అంత కష్టం కాదు. అనుకోనిరీతిలో కొన్ని జరుగుతుంటాయి. కాబట్టి రాజకీయం ఒక్కటే కాదు. సాంకేతిక విజ్ఞానం, టెక్నాలజీ ఇవాళ అద్భుతంగా మారుతోంది. కానీ ఎలా మలచాలి మానవాళి మనుగడకు, మన దేశ భవిష్యత్తుకి, ప్రతి బిడ్డకి ఎదిగే అవకాశాలు రావటం కోసం! ఆర్థిక శక్తులుంటాయి సమాజంలో.. కోట్ల మంది నిర్ణయాలు, వారి ఆకాంక్షలు, వారి అవసరాలు, దాన్ని బట్టి ఆర్థిక రంగాలు, ఆర్థిక వ్యవస్థ మలుపు తిరుగుతుంటాయి. ఈ రెంటినీ మనం అర్థం చేసుకోవాలి.

చివరిగా ఒక మాట. మనం ఎప్పుడూ కూడా స్వల్పకాలంలో మనం సాధించగల అద్భుతాలను ఎక్కువగా అంచనా వేస్తాం.. చాలా జాగ్రత్తగా ఆలోచించండి, ఆలకించండి.. స్వల్పకాలంలో– ఆర్నెలల్లో, సంవత్సరంలో, రెండేళ్లలో మనం చేయగల, సాధించగల విజయాల్ని, చేయగల పనుల్ని చాలా ఎక్కువగా అంచనా వేసుకుంటాం. దీర్ఘకాలంలో ఒక పదేళ్లు ఆపైన కాలంలో మన వల్ల ఫలితాలను తక్కువగా అంచనా వేస్తాం. మళ్లీ మళ్లీ మననం చేసుకోండి. లోక్‌సత్తానే చూడండి. ప్రతి ఆర్నెల్లు, ప్రతి మూడ్నెల్లకు కాకుండా 24 ఏళ్ల ప్రస్థానంలో సంస్థగా, పార్టీగా లోక్‌సత్తా సాధించిన విజయాల్ని చూడండి. ఎంత అబ్బురమో ఆలోచించండి. కానీ ఆర్నెల్లకే ఎన్నికల్లో ఫలితం వచ్చిందా లేదా, వెంటనే మనం అనుకున్న పని జరిగిందా లేదా, బజార్లోకి వెళ్లి వందమందిని సమకూర్చాం, వెయ్యిమందితో గొంతువిప్పాం, పదివేల మందితో సమావేశం పెట్టాం, కోటి మందితో సంతకాలు పెట్టించాం స్థానిక ప్రభుత్వాలకు సాధికారత రావాలని, అరె, పెద్దగా ఫలితం రాలేదు గదా అనుకునే స్వల్పకాల ఆలోచనను చూడండి. మనకు ఆ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. ఇది మానవాళి మొత్తానికీ వర్తిస్తుంది ఆధునిక యుగంలో. స్వల్పకాలంలో మనం సాధించగలిగినటువంటి విజయాల్ని చాలా ఎక్కువగా ఊహించుకుంటాం.. దీర్ఘకాలం ఒక లక్ష్యంతో, ఒక స్పష్టతతో మనం కదిలితే మన వల్ల వచ్చే మార్పును తక్కువగా ఊహించుకుంటాం. ఇది గుర్తుంచుకుంటే, చరిత్రలో మన పాత్ర, మన కర్తవ్యం మనకు బోధపడుతుంది. ఇంకా పాతికేళ్లు నిండలేదు లోక్‌సత్తా ఉద్యమానికి. కానీ ఈ పాతికేళ్ల ప్రస్థానంలో అధికారంలేని ఉద్యమరూపంలో ఉన్నటువంటి ఒక సంస్థ, పార్టీగా ఉన్నా కూడా అధికారం లేకుండా, ఇంత సంక్లిష్టమైన దేశంలో, ఇంత విశాలమైన దేశంలో, ఇన్ని వేల సంవత్సరాల చరిత్ర ఉండి స్తబ్దంగా ఉన్న దేశంలో, ఇంత మౌలికమైన ఆలోచనలో మార్పుకి, ఇన్ని నిర్దిష్టమైన మార్పులకి శ్రీకారం చుట్టినటువంటి నిదర్శనం గత 70 ఏళ్లలో ప్రపంచ చరిత్రలో లేదు. దీర్ఘకాలంగా మనం ఇన్ని విజయాల్ని సాధించాం. అటు ఆలోచనాతీరును మార్చటంలో, దాన్ని ప్రభావితం చేయటంలో, ఇటు కొన్ని నిర్దిష్టమైనటువంటి చట్టపరమైన, రాజ్యాంగపరమైన, విధానపరమైన మార్పులను తీసుకురావటంలో. కానీ స్వల్పకాలంలో దాన్నొక రాజకీయ శక్తిగా మలచాలంటే సమాజంలో చాలా శక్తులు కలిసి రావాలి. అదీ మన సమస్య. అవి కలిసొస్తాయన్న ఆశ, సమన్వయమవుతాయన్న ఆశతోనే మనం రాజకీయ పార్టీగా కూడా వచ్చింది. అనుభవం మనకు కొన్ని పాఠాలు నేర్పింది. దానికి మనమేం పెద్ద బాధపడాల్సిన అవసరం లేదు. మనం ఎమ్మెల్యేలు, ఎంపీలు కాకపోతే కొంప మునిగిపోయిందేమీ లేదు. అయితే బాగుండేది. దాన్నుంచి పారిపోవటంలా. కానీ ఆ సమయాన్ని, సందర్భాన్ని గుర్తెరగకుండా మన వ్యూహం ఉన్నట్లయితే, మనం కూడా ఎన్నో సంస్థల్లా కాలగర్భంలో కలిసిపోతాం.

ఎన్నో దశాబ్దాలపాటు ఉద్యమాలు, త్యాగాలు చేసిన పార్టీలు, సంస్థలు ఉన్నాయి. పేర్లు అనవసరం. మీకూ తెలుసు, నాకూ తెలుసు. వాళ్ల సిద్ధాంతంలో నిజాయతీ ఉంది. అది అశాస్త్రీయమా, కాదా.. హేతుబద్ధమా, కాదా అని పక్కన పెడితే, చిత్తశుద్ధి ఉంది. త్యాగాలు చేశారు, కష్టాలు పడ్డారు. కానీ వారి ఉనికేమన్నా ఉందా? వారి గురించి పట్టించుకునే వాళ్లున్నారా? వాళ్ల ఉనికి వాళ్ల కోసం ఉండొచ్చు, కానీ ఆ భావాలకేమన్నా విలువుందా అసలు? ఎందుకని? సత్యాన్ని విస్మరించారు, దీర్ఘకాలిక దృక్పథాన్ని పక్కన పెట్టారు, హేతుబద్ధ పద్ధతుల్ని పూర్తిగా తిరస్కరించారు.. చివరకు విలువే లేకుండా పోయింది. ఎందుకు కష్టపడ్డామో తెలియదు. మనకు ఆ భయం లేదు. పదవులున్నా లేకున్నా కూడా మనం ఎంత స్పష్టంగా చేస్తున్నామో మనకు తెలుసు. మాట మార్చుకోవాల్సిన అవసరం లేదు. అదే సమయంలో పిడివాదంతో గతాన్ని పట్టుకుని కూర్చోవటంలా మనం. మారుతున్న వాస్తవాలు, మారుతున్నవంటి ఫ్యాక్ట్స్, దాన్ని బట్టి మన నిర్ధారణ కూడా మారుస్తున్నాం. మూడు రోజుల క్రితం దాకా బహుశా కొవిడ్ మన దేశంలో నవంబర్ నాటికి అంతరిస్తుందనుకున్నా. మూడు రోజుల క్రితం ఐసీఎంఆర్ సర్వే వచ్చింది. కేవలం 7–8% మాత్రమే ఇప్పుడు యాంటీబాడీలు వచ్చాయి. ఇప్పుడు కూడా నేను కూర్చుని అక్టోబర్‌కల్లా, నవంబర్‌కల్లా కొవిడ్ పోతుందంటే మూర్ఖత్వం అవుతుంది. నేను వాస్తవాల మేర వేరే సమాచారం తీసుకున్నా. కాబట్టి ఇప్పుడు జనవరి దాకా పట్టొచ్చు. మీకు ఏప్రిల్‌లో 0.7–8% ఉన్న యాంటీ బాడీలు ఒక 10 రెట్లు పెరగటానికి నాలుగు, మూడు నెలలు పట్టింది. ఈ పదిరెట్లు 7–8% నుంచి 60%కి

వెళ్లాలంటే ఇంకో నాలుగైదు నెలలు పడుతుంది. రేపు నవంబర్‌లో డేటా తీసుకుంటే, 10 శాతానికే వచ్చింది 7 నుంచి అంటే, మళ్లీ అంచనా మారుతుంది. మనకి ఆ ఫ్యాక్ట్స్, వాస్తవాలు, తర్కం ముఖ్యం. ఈ రెంటినీ పరిశీలించకుండా పిడివాదంతో పోతే, తా పట్టిన కుందేలుకు మూడేకాళ్లు అన్నట్లయితే అంతకంటే మూర్ఖత్వం ఉండదు. లక్ష్యాన్ని మనం విస్మరించం ఏనాడూ. భారతదేశంలో ప్రతి బిడ్డకీ వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలు కావాలి. గౌరవించే, గర్వించే ప్రజాస్వామ్యం కావాలి. చట్టబద్ధ పాలన కావాలి. సుపరిపాలన కావాలి– ఈ లక్ష్యం మారదు. కానీ ఆ లక్ష్యానికి కావలసిన మార్గాలుకానీ, వ్యూహాలుగానీ, ఈ వాస్తవాల ఆధారంగా, ఈ తర్కం ఆధారంగా మనం నిరంతరం పునఃపరిశీలించకుండా గుడ్డెద్దు చేలో పడ్డట్టు పోతే గుడ్డెద్దుకు జరిగే పనే మనకూ జరుగుతుంది. నేను మనసు విప్పి మాట్లాడాను. నిజానికి పది నిమిషాలే, ఐదు నిమిషాలే మాట్లాడి ఎక్కువ సమయం ఇవాళ ప్రశ్నలకి కేటాయిద్దామనుకున్నాను. మరో సమయంలో కూర్చుందాం. నేను మాటిస్తున్నాను కిషోర్.. దీన్ని ప్రాతిపదికగా తీసుకుని ఒక సమగ్రమైన చర్చ పెట్టుకుందాం. మరింకో సందర్భంలో రాజకీయ వ్యూహాలు ఏం చేద్దామో మరో చర్చ పెట్టుకుందాం. కానీ దయచేసి నేను చెప్పింది ఊరికే ఏదో ఊకదంపుడు ఉపన్యాసంలా భావించబోకండి. దీంట్లో మీతో ఇంత మనసు విప్పి మాట్లాడుదామని అనుకోలేదు. ఆన్‌లైన్‌లోకి వచ్చేదాకా ఇవాళ ఫలానాది మాట్లాడదామని నేను అనుకోలేదు. అప్రయత్నంగానే నా మనసులో ఈ భావాలు మెదులుతున్నాయి. అప్రయత్నంగానే అయినా స్పష్టతతోనే వచ్చినాయని నమ్ముతున్నాను. ఏదో ఊరికే తలాతోకా లేకుండా కొంతమంది మాట్లాడుతుంటారు. కచ్చితంగా చెప్పగలను– అది కాదు ఇది. చాలా స్పష్టంగా నేను మాట్లాడుతున్నాను. హృదయంలో నుంచి మేధస్సును సంధానించి మాట్లాడుతున్నాను. ఏళ్ల తరబడి, బహుశా దశాబ్దాల తరబడి నిరంతరం మానసిక సంఘర్షణ, అనుభవం, మీ అందరి ప్రయత్నం, మీ అందరి నుంచి నేర్చుకున్నది.. ఇదంతా కలిపి, దాన్ని సమన్వయం చేసి నేను మీ ముందు పెడుతున్నాను. ఈ భావజాలం నాది కాదు.. మీ అందరిదీ, మనందరిదీ. దయచేసి మీరు ఆలోచించండి, ఇంకోసారి దీని మీద, ఇవాళ మనం చర్చించుకున్న దాని మీద సమగ్రంగా మనం ప్రశ్నోత్తరాల రూపంలో పెట్టుకుందాం. ఇవాళ గాంధీ జయంతి కాబట్టి ఇంకా కార్యక్రమాలు చాలా ఉన్నాయి. తప్పకుండా మీరు ఎప్పుడంటే అప్పుడు సమావేశం ఏర్పాటు చేసుకుందాం. మనకేమీ ప్రత్యేకమైన ఏర్పాట్లు కూడా అక్కర్లేదు కదా. ఈ జూమ్ ఒక్కటే కదా కావలసింది. అసలు నేను అనుకోవటం ప్రతి నెలా ఒకసారన్నా మనం కనీసం ఒక చర్చ పెట్టుకుందాం. కేవలం రాజకీయాలు కాకుండా. ప్రపంచంలో చాలామందితో మాట్లాడుతున్నాను, చర్చలు పెడుతున్నాను, ఊపిరిసలపనంత పని ప్రస్తుతం. రోజూ 5–10 కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నాను. మరి మన పార్టీ, ఉద్యమ కార్యకర్తలతో సమావేశం మంచి ఆలోచన. కాబట్టి నేను కోరేది కిషోర్.. వీలుంటే 15 రోజులకోసారి, లేదా నెలకోసారి దానికో ఎజెండా రూపొందించి ఊరికే కాకుండా ఒక చర్చా కార్యక్రమంలాగా.. ఒక అంశం మీద కొంత బ్రీఫ్‌గా ఒక ప్రజంటేషన్, తర్వాత చర్చ ఉండేట్లుగా పెడితే బాగుంటుంది. ఇప్పుడు చర్చ ప్రత్యేకంగా ఒక మౌలికమైన రాజకీయ వ్యూహంలో భాగంగా ఒక అంశానికే పరిమితమైంది కాబట్టి, ఇవాళ మీ ముందు పెట్టాను కొన్ని అంశాల్ని. మరోసారి కిషోర్‌ని, బాబ్జీని, శ్రీనివాస్‌ని, అలాగే వారి సహచరుల్ని, వారి బృందాన్ని, బాలుని, ఇతర పెద్దల్ని, అందర్నీ కూడా మనసారా అభినందిస్తూ.. గర్వంగా చెప్పుకోండని చెబుతున్నా. బీజేపీ వాళ్లేతో నినాదం పెట్టారు– గర్వ్ సే కహో హమ్ హిందూ హై అని. మనం హిందూ హై అని కాదు, మనం కూడా గర్వంగా చెప్పుకుందాం– ఈ దేశ పునర్నిర్మాణంలో, ఈ వ్యవస్థను నిలబెట్టటంలో ఒక పోరాటంలో సైనికుల్లా నిరంతరం పోరాడాం. మా బతుకులు మేం చూసుకుంటూ, ఎవరి మీదా ఆధారపడకుండా, ఎవరి నుంచీ ఏమీ ఆశించకుండా, మేము శక్తికి మించి ప్రయత్నాన్ని చేశాం, చేస్తున్నాం, మేం పరిష్కారంలో భాగమని గర్వంగా చెప్పుకోండి. ఎక్కడా తలదించుకోవాల్సిన అవసరం లేదు. నిరాశకు గురికాబోకండి. మీరంతా సాధించిన ఫలితాలు అసామాన్యమైనవి. ప్రభుత్వాలు కూడా సాధించలేనివి.

రోజూ మీ కృషిని గుర్తించకపోవచ్చు. మన దేశంలోని సంక్షోభంలో మీడియా కూడా ఒక భాగం. గత 15 రోజులుగా, నెలరోజులుగా మీరు మీడియా చూసినట్లయితే.. నేను చూడను అదృష్టంకొద్దీ, మీ అందరికీ తెలుసు కదా. సరదా అయినటువంటివి, హాస్యం ఏమన్నా ఉంటే కాస్త మనసు ఉల్లాసం కోసం చూస్తాను తప్ప అసలు ఆ చెత్త వార్తలు, చర్చలు నేను చూడను. నా అదృష్టం అది. అందుకనే నా మనసు చాలా ప్రశాంతంగా ఉంటుంది. చాలా స్పష్టత ఉంటుంది ఆలోచనల్లో. కానీ పొరపాటున ఎప్పుడన్నా చూస్తుంటే, దేశవ్యాప్తంగా కొవిడ్ డేటా తెలుసుకుందామని, గత నెలరోజుల నుంచి రెండే అంశాలు వచ్చినై టీవీల్లో. ఎవరో పాపం ఒక నటుడు దురదృష్టం కొద్దీ మరణించాడు. ఆత్మహత్యా, వేరే రకంగానో కారణం ఏదైనా కానివ్వండి. 25 రోజుల పాటు భారతదేశంలోని ప్రజలందరికీ అది తప్ప ఇంకోటి లేదసలు. జాతీయ స్థాయిలో పొద్దుట్నుంచి రాత్రి దాకా దానిపైనే చర్చలా? కొంతమంది నటులు.. ఏదో వాళ్లకి డబ్బుంది, కొంత ఖాళీ సమయముంది గంజాయో, మరోటో పీల్చుకున్నారు. కొందరు బ్రాందీ తాగారు. నాకిష్టం లేదు, నేను బ్రాందీ తాగను, గంజాయి పీల్చను. దాన్ని ఇంకొకరికి ఇబ్బంది లేకుండా వాళ్లు చేస్తుంటే వీళ్లకి నష్టమేంటి? ఆ అలవాటు వల్ల మీకు సమస్యలొస్తాయి చెయ్యొబాకండి అని చెప్పటం తప్పితే.. అదేమన్నా రాజకీయ సమస్యా? పొద్దుట్నుంచి సాయంత్రం దాకా ఈ వాయురిజమా? తొంగిచూడటమా మన జీవితం? ఇవి చర్చలా?.. కాబట్టి సమస్య కేవలం రాజకీయం, ఎన్నికల్లో మాత్రమే లేదు. రాజకీయాల్లో ఉంది, పరిపాలనా యంత్రాంగంలో ఉంది, న్యాయవ్యవస్థలో ఉంది, మీడియాలో ఉంది. మీడియానే గనక ఈ దేశంలో నిజమైన చర్చను చేపడితే లోక్‌సత్తా ఏం చెబుతోందో, ఏం చేస్తోందో, ఏం ఫలితాల్ని సాధిస్తోందో, అవి మన పేరుతో


కాకపోయినా కూడా కీలకమైన అంశాలుగా వెళ్లి ఉండేవి ఈ దేశ ప్రజానీకంలోకి. కానీ అది జరగలేదు. ఈ ప్రజల్ని వివశుల్ని చేయటంలో రాజకీయం పాత్రతోపాటు మీడియా పాత్ర కూడా చాలా ఎక్కువ ఉంది. మన అందరికీ కూడా దేశంలో రాజకీయ చైతన్యం తీసుకురావాలంటే ఉన్న ఒకే ఒక్క ఆయుధం కమ్యూనికేషన్. ప్రజలకు సమాచారం అందించటం, ప్రజలతో సంపర్కం. దానికి మనకున్న ఒకే ఒక్క మీడియం మీడియా. అందుచేత ఈ సమస్య బహుముఖమైనది. మన సంస్కృతి, మన భారతీయ సమాజం, మన చరిత్ర, మన అవిద్య, మన పేదరికం, మన భూస్వామ్య సంస్కృతి, అధికారాన్ని పూజించే వ్యవహారశైలి.. ఈ మొత్తం ఇందులో మిళితమై ఉన్నాయి. కాబట్టి పోరాటం కూడా బహుముఖంగా ఉండాలి. చిరునవ్వుతో చేయాలి. నిరుత్సాహం లేకుండా చేయాలి. ఎందుకంటే శ్రీనివాస్ అన్నమాట నేనొకటి తిరస్కరిస్తున్నాను. 25 ఏళ్లలో ఇంకా కుళ్లిపోయిందన్న మాటను నేను ఒప్పుకోవటంలా. కుళ్లిపోలేదు తమ్ముడూ. మనం ఎక్కువ మాట్లాడుకుంటున్నాం. అప్పటి కంటే ఆర్థిక వ్యవస్థ ఇంకా బాగుపడింది. ఇంకా బాగుపడాల్సి ఉంది. రాజకీయ వ్యవస్థ కూడా అప్పటి కంటే కొంత బాగుపడింది. 25 ఏళ్ల క్రితం అసలు విద్యని, ఆరోగ్యాన్ని చర్చలోకి తీసుకురాలా ఈ దేశంలో రాజకీయంలో. ఈవేళ తీసుకొస్తున్నారు. ప్రజలకు సేవలందించటం అసలు చర్చలోకి రాలా. ఇవాళ వస్తున్నది. గతి లేకే. ఇంకా వేగంగా రావాల్సుండె. ఎప్పుడో రావాల్సుండె. ఇంకా జరగాల్సింది చాలా ఉంది. కానీ గతంలో చాలా బాగుంది, అంతకంటే కుళ్లిపోయింది అనే భావం వాస్తవం కాదు. కొన్ని రంగాలలో మాత్రం కుళ్లిపోయింది. మరీ బహిరంగంగా, నిస్సిగ్గుగా తిట్టుకోవటం.. అందులో అమెరికాలాంటి దేశాలు కూడా మనకు చాలా దుర్మార్గమైన ఉదాహరణను చూపెడుతున్నాయి కాబట్టి నార్మలైజ్ అయిపోయింది మూర్ఖపు ప్రవర్తన. ఆ సభ్యత, సంస్కారం విషయంలో కొంచెం చెడింది. అలాగే సోషల్ మీడియా ప్రభావం వల్ల ఇష్టమొచ్చినట్లు ఒకళ్లనొకళ్లు తిట్టుకునే దుర్మార్గపు సంస్కృతి, మూర్ఖపు సంస్కృతి వచ్చింది. అబద్ధాల ప్రచారం వచ్చింది. ఈ కాస్త వదిలేస్తే మిగతా రంగాల్లో బాగుపడుతున్నాం. అనుకున్నంత బాగుపడటం లేదు. మనకు వయసు పెరుగుతోంది. కాబట్టి అంతా చెడిపోయిందనే భావం క్రమక్రమంగా వస్తుంది. ఏనాడూ దానికి గురికాకండి. ఒక్కసారి టెక్నాలజీని పరిశీలించండి ప్రపంచంలో. ఒక్కసారి ఆర్థిక రంగంలో పెనుమార్పులు ఎట్లా వస్తున్నాయో పరిశీలించండి. నిన్నటిదాకా ఓడలుగా ఉన్నవి బళ్లు ఎట్లా అవుతున్నాయో, బళ్లు ఓడలెలా అవుతున్నాయో పరిశీలించండి. చైనా లాంటి దేశాలు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎలా ఎదిగాయో ఆలోచించండి. ఇంత పెనుమార్పులు ఎలా వస్తున్నాయో పరిశీలించండి. ఈ మార్పుల వెనుక చోదక శక్తుల్ని మీరు గమనించండి. మీకు అర్థమవుతుంది. కాబట్టి కుళ్లిపోయింది, అయ్యబాబోయ్... లేదు! కచ్చితంగా అనుకున్నంత మేలు జరగటం లేదు. కొన్ని రంగాల్లో కొంత నష్టం జరుగుతోంది. కానీ మొత్తం మీద మానవాళిగానీ, మన దేశంగానీ, మన జాతిగానీ ముందుకెళ్తున్నాయి. ఇంకా చాలా ముందుకెళ్లొచ్చు. అంతరం ఉన్నది. ఆ అంతరమే మనల్ని ప్రేరేపిస్తున్నది. మనలో ఉన్న కసి, కోసం, ధర్మాగ్రహాలకు కారణం.. జరగవలసిన దానితో పోలిస్తే జరుగుతున్నది చాలా తక్కువ. పోవాల్సిన చెడుతో పోలిస్తే, కొనసాగుతున్న చెడు చాలా ఎక్కువ. ఈ అంతరం మనల్ని బాధిస్తున్నది. అది బాధించాలి, మనకు స్ఫూర్తినివ్వాలి. అంతేగానీ నిరాశను కలిగించేరీతిలో.. ఇంకా చెడిపోయింది, ఇంకా కుళ్లిపోతుంది, మన ప్రయత్నమే వృథా, మన ఆలోచన వృథా అనుకోవటం పొరపాటు. అది వాస్తవం కాదు. నేను కేవలం సైకాలజీ కోసం చెప్పటంలా. That is factually not correct. దయచేసి మీరంతా ఆలోచించండి. మరోసారి మహాత్ముడి 151వ జయంతి సందర్భంగా ఆ మహనీయుడి స్మృతికి అంజలి ఘటిస్తూ, స్వతంత్ర పోరాటంలో ఆయనతోపాటు నడిచి, పోరాటం చేసి ఈ దేశ నిర్మాణానికి బీజం వేసిన ఎందరినో కూడా స్మరించుకుందాం. వారే ఈవేళ మనందరికీ ఒక ఉనికిని కల్పించారు భారతీయులుగా ఒక దేశం అని. మనం ముక్కు, ముఖం చూడనివాళ్లు వివిధ కులాలవాళ్లు, మతాలవాళ్లు, వివిధ పార్టీలు వివిధ భావజాలం ఉన్నవాళ్లు, వివిధ ప్రాంతాలవాళ్లు, అన్నిటినీ మించి వివిధ భాషలవాళ్లు.. అందరూ కూడా మనం ఒక దేశం అనుకోవటానికి కారణం వారందరి మహత్తర కృషి. అలాగే అదే రోజు జన్మించిన లాల్‌బహదూర్ శాస్త్రి. గాంధీజీ కోవకు చెంది, మహాత్ముడు చెప్పిన రాజకీయ నాయకత్వం, రాజకీయం ఎలా సాధ్యమో చూపెట్టారు ఈ దేశంలో కొంతకాలం. అలాంటి రాజకీయానికి నిర్వచనంగా నిలిచిన మహనీయుడు లాల్‌బహదూర్. ఆయన కృషికి అంజలి ఘటిస్తూ మరోసారి లోక్‌సత్తా పార్టీ 14వ వార్షికోత్సవ శు భాకాంక్షలను తెలియజేస్తూ, మీరంతా మనసుపెట్టి లోతుగా ఆలోచిస్తారని ఆశిస్తున్నాను. ముందు మన మస్తిష్కంలో గనక ఆ ఆలోచనలో స్పష్టత వస్తే ప్రపంచాన్ని మనం మార్చటం సులువవుతుంది. మన మనసుల్లో అస్పష్టత ఉన్నట్లయితే, మనం కూడా సాంప్రదాయ ఆలోచనల్లోనే కొట్టుకుపోతూ.. మనకు ప్రవర్తనలో, ఆలోచనలో నిజాయతీ ఉన్నా కూడా సాంప్రదాయవాదులుగానే వ్యవహరిస్తూ ఈ దేశంలో, ప్రపంచంలో మార్పులకు దోహదం చేయలేం. మనం ప్రవాహంలో పడిపోవలెనా? కొందరిలా మార్పుకి దోహదం చేయవలెనా? మనందరికీ చాలా స్పష్టమైన అవగాహన ఉండాలి. అది మీరు చేస్తారని ఆశిస్తున్నాను. నాకు తెలుసు మీరంతా ఎన్ని త్యాగాలు చేశారో, వ్యక్తిగతంగా ఎంత తృణప్రాయంగా మీకున్న అవకాశాల్ని త్యజించారో, ఎంత నష్టపోయారో, కొన్ని సందర్భాల్లో దాని కారణంగా కొంతమంది ఎంత తిట్లుతిన్నారో కూడా నేను ఊహించగలను. ఎందుకంటే కొన్ని తిట్లు నేను కూడా తింటుంటాను. నిరుత్సాహానికి గురికాకుండా ఇన్నేళ్లపాటు ఈ పోరాటాన్ని ఇన్ని త్యాగాలతో, లెక్కకు మించిన త్యాగాలతో.. తల్చుకున్నప్పుడల్లా కళ్లు చెమరిస్తాయి.. చేసినందుకు, చేస్తున్నందుకు మీ అందరికీ మనసారా అభినందనలు.

# లోక్‌సత్తా రాజకీయ ఉద్యమ సంస్థ
# 23 సంవత్సరాల ప్రస్థానం

– బండారు రామ్మోహనరావు, 98660 74027

వ్యక్తి గాని, సంస్థ గాని చరిత్రగా చెప్పుకోదగిన గతం పునాదుల మీద వర్తమానంలో నడుస్తూ భవిష్యత్తుకు బాటలు వేసుకోవటమే సాఫల్యతకు సరైన మార్గం. అయితే చరిత్ర కాగల పరిణామాల ప్రభావాల్ని వెంటనే గుర్తించటం చాలా సందర్భాల్లో సాధ్యం కాదు. ముఖ్యంగా సమాజం విషయంలో, ప్రజాజీవితంలో ఉన్నవారి విషయంలో. నడుస్తున్న చరిత్రలో భిన్నమైన సంఘటనల ప్రభావం సమకాలీన సమాజంలో అంతగా తెలియదు. కొన్ని దశాబ్దాలు గడిస్తే వాటి ప్రభావం జనజీవన దిశలో మార్పునకు ఎలా చోదకశక్తి అయ్యిందో అర్థమవుతుంది, బేరీజుకు అందుతుంది. అప్పుడు వ్యక్తి లేదా సంస్థ గురించి న్యాయమైన వ్యాఖ్యానం వినిపించవచ్చు. ఒక రకంగా కాలపరీక్షను తట్టుకోవటం అనుకోవచ్చు. అలా రాజకీయ ఉద్యమ సంస్థగా లోక్‌సత్తా గత ఇరవై మూడేళ్ల ప్రస్థానాన్ని మైలురాళ్ల లెక్కతో ఉజ్జాయింపుగా చెప్పే ప్రయత్నమిది.

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్.. తెలుగు రాష్ట్రాలలో ఈ పేరు విననివారుండరు. దేశవ్యాప్తంగా, ఇంకా చెప్పాలంటే ప్రపంచంలోని పలు ప్రధాన దేశాలలో ఆయన సుపరిచితులు. ఒక మెడికల్ డాక్టర్‌గా కెరీర్‌ను ప్రారంభించి, కేవలం శారీరక వైద్యం కాదు, సామాజిక వైద్యం చేయాలని ఆయన భావించారు. దేశానికి శస్త్రచికిత్స చేయాలంటే సివిల్ సర్వీస్ సరైన వేదిక అని ఎంచుకుని వైద్యం నుంచి సివిల్స్‌కు మళ్లారు. ఐఎఎస్ అధికారిగా సుమారు 17 సంవత్సరాలపాటు మన రాష్ట్రానికి, దాంతోపాటు దేశానికి ఉపయోగపడే చిరస్మరణీయ సేవలను తెలుగునేల నుంచి అందించారు. అయితే ఐఎఎస్‌గా కూడా తాను అనుకున్నదాంట్లో సాధిస్తున్నది కొంతేనని అనుకున్నారు. సమాజ అభివృద్ధిని కాంక్షించే వ్యక్తిగా ఒక అధికారిగా కంటే స్వచ్ఛంద రాజకీయ ఉద్యమ సంస్థ ద్వారా ఎక్కువ సేవ చేయవచ్చని భావించారు. 1996లో తన సివిల్ సర్వీస్ పదవికి రాజీనామా సమర్పించారు. ఇళ్ల స్థలం, పెన్షన్ వంటి వేమీ లేకుండా. ఆ తర్వాత ఒక సంవత్సరం పాటు "ప్రజాస్వామ్య సంక్షోభ పరిష్కారం" అనే మార్గదర్శిని రూపొందించే పనిలో ఉన్నారు. ప్రజాస్వామ్యంలో అనేక సంక్షోభాలు ఉంటాయని, సంక్షోభాలకు పరిష్కారాలు ఉంటాయని సాధికార స్పష్టతతో భావించారు. అలా 1975లో ఎమర్జెన్సీ సమయంలో వైద్య విద్యార్థి జేపీలో మొదలైన మౌలిక మార్పు తపన లోక్‌సత్తా భావజాలంతో సమగ్ర రూపం దాల్చింది.




లోక్‌సత్తా భావజాల పుస్తకం తయారైంది. దాని పేరే "ప్రజాస్వామ్యం – సంక్షోభం – పరిష్కారం". దీన్ని పునాదిగా చేసుకుని 1997 ఆగస్టు 3న హైదరాబాద్ నడిబొడ్డులో నౌబత్ పహాడ్ పైన ఉన్న బిర్లా సైన్స్ సెంటర్ సమావేశ మందిరంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ పురుడు పోసుకుంది.

ఆనాడు గుప్పెడు మందితో మొదలైన ఉద్యమం అంచెలంచెలుగా ఎదిగింది. గుండెలు గుప్పెడే కానీ అవి చాలా విశాలమైనవి. వ్యక్తి కులం, మతం, ప్రాంతాలకు అతీతమైనవి. వ్యక్తి కన్నా సంస్థ లేక తను నమ్మిన సిద్ధాంతం, ఈ రెంటి కన్నా దేశం, దేశ ప్రయోజనాలు, అలాగే ప్రపంచ మానవాళి సమస్యల పరిష్కారం తక్షణ కర్తవ్యంగా తలపోసిన గుండెలవి. అందుకే కర్తవ్య దీక్షతో, నిబద్ధతతో లోక్‌సత్తా రాజకీయ ఉద్యమం మొదటి అడుగు వేసింది. భారతదేశంలో సమగ్ర మార్పునకు పునాది పడింది.

ఉద్యమ ప్రారంభంలోనే తెలుగునాట అన్ని ప్రాంతాల్లో మంచి ఊపు వచ్చింది. లోక్‌సత్తా అంటే ఒక నూతనోత్తేజం.

# లోక్‌సత్తా కొత్త రాజకీయ కృషిని అభినందించిన ప్రణబ్

విలువలు పాటించిన రాజకీయ నాయకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రణబ్ ముఖర్జీ మరణం దేశానికి సామాజికంగా, రాజకీయంగా పెద్ద లోటు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు సంతకం పెట్టిన రాష్ట్రపతి. ఆయన హయాంలోనే తెలంగాణ రాష్ట్ర స్వప్నం సాకారమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు వ్యక్తిగతంగా కూడా ఆయన అనుకూలంగా ఉండేవారు. నేను ఆయనను మొత్తం రెండుసార్లు కలిశాను. ఢిల్లీలో ఆయన పీవీ నరసింహారావు మంత్రివర్గంలో కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు మొదటిసారి కలిశాను. ఆ తరువాత 2013 డిసెంబర్‌లో శీతాకాలం విడిదికి హైదరాబాద్ వచ్చినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో మరొకసారి ప్రణబ్ ముఖర్జీని కలిశాను. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌తో కలిసి వెళ్లాను. జేపీతోపాటు నేను, నా లోక్‌సత్తా సహచరులు రవి మారుత్, హైమా ప్రవీణ్ ఉన్నాం. మాకు ఇచ్చిన టైమ్ ప్రకారం ఒక్క నిముషం ఆలస్యం చేయకుండా మమ్మల్ని లోపలికి పిలిచారు. మమ్మల్ని పేరుపేరునా పరిచయం చేసుకున్నారు. నిండు కుండ తొణకదు అన్నట్లు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరుగుతుంది అన్న విషయాన్ని తన మాటల ద్వారా మాకు తెలుపకనే తెలిపారు. తెలంగాణ ఏర్పాటు కీలక దశకు చేరుకున్న సందర్భంగా రాష్ట్రంలోని కీలక వ్యక్తులు, రాజకీయ నాయకులు ఆయనను కలవడానికి పోటీలు పడ్డారు. అలాంటి ఒత్తిడి సందర్భంలో కూడా మాకు ఆయన అరగంట సమయం కేటాయించారు. ఆయన మాట్లాడుతూ ఉంటే మాకు సమయమే తెలియలేదు. అనర్గళమైన వాక్చాతుర్యం ఆయన సొంతం. సుమారు 45 నిముషాల పాటు మాతో మాట్లాడారు. ఆనాటి రాజకీయాలు, ప్రస్తుత రాజకీయాలు ఎలా ఉన్నాయో వివరించారు. రాష్ట్రపతిగా తన వంతు రాజకీయ విలువలు నిలబెడతానని మాతో చెప్పారు. నూతన రాజకీయ సంస్కృతి అవసరాన్ని ఆయన ఆహ్వానించారు. అలా సాంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా కొత్త రాజకీయంతో ఎదురీదుతున్న లోక్‌సత్తా ఉద్యమాన్ని, పార్టీని అభినందించారు. మంచి రాజకీయాల కోసం పౌరులను చైతన్యవంతం చేయాలన్నారు. ఆయన రాజకీయ జీవితంలో ఎదురైన అనేక సంఘటనలను మాతో పంచుకున్నారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడే ఒక ఉద్యమం.

స్వచ్ఛమైన పాలన కోసం ఆవిర్భవించిన ప్రజాస్వామ్య ఉద్యమంగా లోక్‌సత్తాను ప్రజలు ఆదరించారు. ప్రజాస్వామ్యానికి గొప్ప అర్థం చెప్పి భారతదేశానికి నూతన దశ, దిశను చూపిన ఉద్యమం ఇది. ప్రజాస్వామ్యంలో ఐదు మూలాలుంటాయని, అవి ఉంటేనే పరిపూర్ణమైన ప్రజాస్వామ్యం అని లోక్‌సత్తా ఉద్యమం విశదీకరిస్తూ చాటింది.

వలస పాలన నుండి భారత స్వాతంత్ర్యం కోసం స్వరాజ్య ఉద్యమం సాగింది. ఆనాడు ఎందరో సమరయోధులు తమ జీవితాలను ఫణంగా పెట్టి దేశానికి స్వతంత్రం సాధించారు. కానీ మూన్నాళ్లలోనే భ్రమలు తొలగిపోయాయి. నల్లదొరలు పోయి తెల్లదొరలు వచ్చారు. దాన్ని గమనించిన సోషలిస్టు నాయకుడు లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ పూర్ణ స్వరాజ్యం లక్ష్యమని ప్రకటించారు. దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభించారు. అప్పుడు నియంతృత్వంగా పాలిస్తున్న భారత ప్రధాని ఇందిరాగాంధీకి అది నచ్చలేదు. చివరికి ఆమె ఎమర్జెన్సీని ప్రకటించారు. ఆ తర్వాత ఎమర్జెన్సీని ఎత్తివేయడంతో 1977లో జనతా ప్రభుత్వం ఏర్పడింది. ఇందిర నియంతృత్వాన్ని నిరసించిన ప్రజలు జనతా పాలనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ జరిగింది వేరుగా ఉంది. "ఆటగాళు మారారు గానీ, ఆటనియమాలు మారలేదు". దానివల్ల కలగూరగంప పరిపాలన అస్తవ్యస్తమైంది. జనతా పార్టీ పాలన మూన్నాళ్ల ముచ్చటే అయింది. మూడు సంవత్సరాలకే దాని కథ ముగిసిపోయింది. 1985లో మళ్లీ ఇందిరాగాంధీ అధికారంలోకి వచ్చారు. ఇదంతా చరిత్రలో భాగంగానే జరిగింది. అలాగే దేశవ్యాప్తంగా కాంగ్రెసేతర ప్రభుత్వాలు పలు రాష్ట్రాల్లో ఏర్పడ్డాయి. ప్రజల ఆశలకనుగుణంగా ప్రాంతీయ పార్టీలు వచ్చాయి. వారు కూడా ప్రభుత్వంలోకి వచ్చారు. అయినా ప్రజల సమస్యలు తీరలేదు. ఎమర్జెన్సీ పరిణామాలతో మార్పు కోసం యువకునిగా అడుగులు ప్రారంభించిన లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ జనతా వైఫల్యంతో తీవ్ర అంతర్మథనానికి లోనయ్యారు. ఆటగాళ్లు మారటం కాకుండా ఆటనియమాలు మారితేనే భారతదేశంలో నిజమైన మార్పు వస్తుందని గుర్తించారు. ఇదే విషయాన్ని లోక్‌సత్తా నినదించింది.

మన ఓటు ద్వారా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి, మన పన్నుల డబ్బు ద్వారా ప్రభుత్వాలు నడుస్తున్నాయి, అందుకే "ప్రజలే ప్రభువులు" అనే నినాదంతో లోక్‌సత్తా ఉద్యమం మొదలైంది. మరొక రకంగా చెప్పాలంటే, ఇది "రెండవ స్వతంత్రం పోరాటం" అని డా॥ జేపీ అభివర్ణించారు.

అందుకు అనుగుణంగానే 1997లో "రెండవ స్వాతంత్ర్య ఉద్యమం" అనే పుస్తకాన్ని ప్రచురించడం జరిగింది. అలాగే అప్పటి నుండే "జనబలం" అనే మాసపత్రికను లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రారంభించింది. అలా ఉభయ తెలుగు రాష్ట్రాలలో లోక్‌సత్తా నూతన రాజకీయ భావాల ప్రచారోద్యమం ప్రారంభమైంది. ఎక్కడికక్కడ సమావేశాలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా లోక్‌సత్తా ప్రజాసంఘాలను ఏర్పాటు చేయడం జరిగింది. అలా ఒక సంవత్సరం పూర్తయింది. కానీ ప్రజలలో కదలిక రావాలంటే కేవలం అవగాహన సదస్సులు, సమావేశాలు

మాత్రమే సరిపోవు అని లోక్‌సత్తా ఉద్యమం గ్రహించింది. ప్రజా ఉద్యమ బాట పట్టకుండా అనుకున్న లక్ష్యం వేగంగా సాధ్యం కాదని భావించింది. "ప్రజాస్వామ్య పాలనా సంస్కరణల" కోసం ప్రజాఉద్యమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేసినప్పుడే సుస్థిర ఫలితాలు వస్తాయి.. అని విధానపరమైన స్పష్టతను ప్రకటించింది. అందుకనుగుణంగానే లోక్‌సత్తా ఉద్యమం ఆవిర్భవించిన సంవత్సరం తర్వాత 1998 అక్టోబర్ 2న "స్వరాజ్యం" పేరుతో ప్రజాహక్కుల పత్రాన్ని ప్రచురించారు. ఆనాటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సీఆర్ రంగరాజన్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూడకుండా అందులోని ప్రజాహక్కులను సాధించటానికి ఉద్యమబాట పట్టింది లోక్‌సత్తా. అందులో భాగంగానే మొట్టమొదటి ప్రజాస్వామ్య ఉద్యమంగా "పెట్రోల్ బంకుల్లో కల్తీ, తూకంలో మోసాలు"పై కార్యాచరణను ప్రకటించింది. ఆనాడు మన రాష్ట్రంలో కేవలం 1500 పెట్రోల్ బంకులు మాత్రమే ఉన్నాయి. జిల్లాకు ఒకటి రెండు చొప్పున లోక్‌సత్తా ప్రజాఉద్యమకారులు తనిఖీ చేశారు. అలాగే హైదరాబాద్‌లో చాలామంది ప్రముఖులతో ఈ ఉద్యమం విస్తృతంగా సాగింది. పౌరులు సంఘటితంగా రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక క్రమశిక్షణతో అలా ఉద్యమించటం ఒక కొత్తరకమైన ఉద్యమ సంస్కృతికి నాంది పలికింది. అప్పటికప్పుడు ఫలితాలు తేల్చేసే ఉద్యమమది. పెట్రోల్ బంకుల్లో ఉన్న అక్రమాలు ఈ దెబ్బకి బయటపడ్డాయి. పెట్రోల్, డీజిల్ కొలతల్లో మోసం, అందులోనూ కల్తీ జనంలో ఆగ్రహాన్ని కలిగించింది. ప్రభుత్వాన్ని కదలించింది. వెంటనే స్పందించిన తూనికలు కొలతల అధికారులు పెట్రోల్ బంకులపై దాడులు నిర్వహించారు. మోసాలకు పాల్పడుతున్న వాటిని సీజ్ చేశారు. జరిమానాలు విధించారు. ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్. అక్రమార్కులు కొంతవరకు తోకముడిచారు. అన్నిటికంటే ఇందులో గుర్తించాల్సిన అంశమేమంటే, పెట్రోల్, డీజిల్‌లో కల్తీ అని ఎలా తెలుసుకోవచ్చు, కొలతల్లో మోసాల్ని ఎలా తెలుసుకోవచ్చు అనే అంశాలు చాలా సులభంగా ప్రజల్లోకి వెళ్లాయి. ప్రజల జేబులను నిశ్శబ్దంగా నిత్యం కొల్లగొట్టే ఓ భారీ దోపిడీని గాంధీ, అంబేద్కర్ వంటి వారు ఆశించిన పద్ధతిలో శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా నిలువరించి దానిపై ప్రజల్లో చైతన్యం పెంచటం ద్వారా లోక్‌సత్తా తొలి పోరాటం పెద్దవిజయం సాధించిందని సగర్వంగా చెప్పుకోవచ్చు. ఆనాడు డిజిటల్ పెట్రోల్ బంకులు కావాలని, ఎలక్ట్రానిక్ మీటర్లు ఉండాలని ఉద్యమించాము. ఇప్పుడు అలాంటి ఆధునిక టెక్నాలజీతోనే పెట్రోల్ బంకులు నడుస్తున్నాయి. కానీ ఇందులో కూడా మీటర్ రీడింగులను తప్పుగా చూపెట్టేలా కంప్యూటర్ చిప్స్‌తో మాయజేసే మోసగాళ్లు తయారయ్యారు. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాలలో పెట్రోల్ బంకుల్లో మోసాలు మళ్లీ పెచ్చరిల్లుతున్నాయి. పెట్రోల్ బంకుల్లో మోసాలపై మళ్లీ పౌర ఉద్యమం అవసరం.

(ఇంకాఉంది)

## అదే లక్ష్యం కోసం భిన్నంగా పనిచేద్దాం

"మిత్రులారా, లోక్‌సత్తా పార్టీ 14వ వార్షికోత్సవం సందర్భంగా వ్యవస్థాపకులు డా॥ జేపీగారి సందేశాన్ని విన్న మాకు ఎంతో ఉత్సాహం కలిగింది. వారిని ఇలా చూడటం చెప్పలేని ఆనందాన్ని కలిగించింది. లోక్‌సత్తా పార్టీ ఆవిర్భావ దినోత్సవం గుర్తుకొచ్చి ఇప్పుడే రంగప్రవేశం చేయాలన్న ఆత్రం కలిగింది. ఆనాటి స్ఫూర్తి అణువణువూ నిండి ముందుకు నడవమంటోంది. ఇన్నేళ్ల అవగాహన నేపథ్యంలో.. కొత్త రాజకీయ లక్ష్యం కోసం ఆరోజు చేసినట్లు కాకుండా మరోలా చేయవచ్చున్న ఆలోచన కలిగింది. 'మన పరిధిలో ఏం చేయాలో అది చేద్దాం' అనిపించింది. ఈవేళ ఇంట్లో కూర్చుని కూడా అనుకున్నది సాధించే అవకాశాలు మన ముందున్నాయి. మనసు ఉండాలేగానీ చేయలేనిది లేదు. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక ఆసక్తి, అవగాహన ఉండాలేగానీ ఎలాంటివారైనా పనిచేయగల అవకాశం ఉంది. జేపీగారు చెప్పినట్లు, నెలనెలా కలుసుకుని మాట్లాడుకుంటే బాగుంటుంది. గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు చేసుకోవచ్చు. అందరూ చేరువ కావాలి. పట్టుదలతో పనిచేయాలి. దూరమైనవారు దగ్గర కావాలి. మనం ఏ లక్ష్యంతో మొదలుపెట్టామో అదే లక్ష్యంతో కలసి పనిచేయాలి. అవును సర్.. మార్పు కొద్దిరోజులలో సాధ్యం కాదు! ఎంతకాలమైనా కృషి కొనసాగుతుండటం ముఖ్యం. ఇండియాలాంటి దేశంలో ఈ మార్పు అత్యంత క్లిష్టమైన పని. ఇంత క్లిష్టమైన పనిలో కష్టం ఉంటుంది. అధిగమించినప్పుడే ఫలితం పొందగలం. ధన్యవాదాలు"

**- అన్నపూర్ణ బులుసు, లోక్‌సత్తా**

గమనిక: 'మనకూ మార్గదర్శి మేరీ జాక్సన్' శీర్షికతో 'జనబలం' సెప్టెంబర్ సంచికలో ప్రచురితమైన తన వ్యాసంలో కమలా హారిస్ గురించిన వాక్యాలు తాను వ్యక్తం చేసిన అభిప్రాయాలకు విరుద్ధంగా ఉన్నాయని రచయిత అన్నపూర్ణ గారు తెలియచేశారు. తాము రిపబ్లికన్ పార్టీ మద్దతుదారులమని, కమలా హారిస్ పట్ల తమకు ఎలాంటి అభిమానం లేదని.. జనబలం చదివి ఫోన్ చేసినవారందరికీ ఈ సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చిందని చెప్పారు. వారి అభ్యంతరంపై పత్రిక తరఫున వివరణ ఇది..

"పార్టీలకతీతంగా అమెరికాలో ప్రజాస్వామ్య పరిణతి గురించి చెప్పాలనే ఉద్దేశంతోనే ఉపాధ్యక్ష అభ్యర్థిగా కమలాహారిస్‌ను ఓ పార్టీ ఎంపిక చేసుకోవటాన్ని ప్రస్తావించే ప్రయత్నం పత్రికలో చేశాం. అలాగే ఎన్నికైతే మహిళగా, భారతీయ అమెరికన్‌గా, ఆఫ్రికన్ అమెరికన్‌గా ఆమె సృష్టించే రికార్డును ఒక ఫ్యాక్చువల్ అంశంగా చెప్పాం. అయితే ఈ క్రమంలో ఉపాధ్యక్ష పదవికి కమలాహారిస్‌కు రచయిత ఓటు పరంగా సపోర్ట్ చేస్తున్న అభిప్రాయాన్ని కలిగించటం రీరైటింగ్/ఎడిటింగ్‌పరంగా లోపం. పొరపాటుకు చింతిస్తున్నాం"

-ఎడిటోరియల్ విభాగం, జనబలం

# ఎన్‌జేఏసీ చట్టాన్ని కొట్టివేసి సెల్ఫ్‌గోల్ చేసుకున్న సుప్రీంకోర్టు

సుప్రీంకోర్టులో తెలుగువాడైన ఒక సీనియర్ న్యాయమూర్తి పక్షపాత ధోరణితో ఢిల్లీ నుంచి చక్రం తిప్పుతున్నారని, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పులను ప్రభావితం చేస్తున్నారని వ్యక్తిగత కోణంలో ఆరోపణలు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయటమే కాకుండా అందులోని అంశాల్ని మీడియాకు బహిర్గతం చేయటం జాతీయ స్థాయి దాకా తీవ్ర చర్చకు దారితీసింది. కొందరు రాజకీయ నేతల అండతో సదరు న్యాయమూర్తి సుప్రీంకోర్టు జడ్జీ స్థాయికి చేరుకున్నారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ న్యాయమూర్తుల కూర్పు ప్రక్రియను కూడా జగన్, ఆయన పార్టీ ఎంపీలు, కొందరు నేతలు తప్పుపట్టారు.

దేశవ్యాప్తంగా రాజకీయనేతల అవినీతి కేసులపై సత్వర విచారణ జరిపి దోషులను తేల్చాలని ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యంలో ఆ జడ్జీ ఆదేశించటం.. అనేక కేసులలో కీలక నిందితునిగా ఉన్న వైఎస్ జగన్‌కు కంటగింపుగా మారి అడ్డుకునేందుకే తక్షణాస్త్రంగా ఆరోపణల లేఖను సంధించారనే ప్రత్యారోపణ కూడా బలంగా వినిపిస్తోంది.



ఈ మొత్తంలోని నిజానిజాలు చర్చనీయాంశాలనటంలో సందేహం లేదు. న్యాయస్థానాల్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ నిర్ణయాలపై విచారణజరిగిన కొన్ని కేసుల మీద ఆయా సందర్భాల్లో లోక్‌సత్తా కూడా నిర్దిష్టంగా స్పందించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను ఏపీ ప్రభుత్వం తొలగించినప్పుడు రాజ్యాంగ వ్యవస్థల పట్ల సర్కారు తీరును ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్రంగా ఖండించారు. అలాగే కొన్ని విషయాల్లో న్యాయవ్యవస్థ అత్యుత్సాహాన్ని కూడా ప్రశ్నించారు.

అయితే ఇప్పుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి లేఖకు సంబంధించి అందులోని ఆరోపణల్లో నిజమెంత, ఫిర్యాదు చేసే పద్ధతి అదేనా, ఆ న్యాయమూర్తి పక్షపాత ధోరణితో వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవహరించారా అన్న ప్రశ్నలకన్నా కూడా.. అసలీ పరిస్థితి తలెత్తకుండా, ఒకవేళ తలెత్తినా వివాదాస్పద చర్చనీయాంశం కాకుండా, ప్రజల్లో న్యాయవ్యవస్థ విశ్వసనీయత దెబ్బతినకుండా పరిష్కారమయ్యేలా ఏర్పాట్లు ఎందుకు చేయలేకపోయాం? అన్నది ప్రధానంగా మనం దృష్టి పెట్టాల్సిన విషయం.

ఈ ఏర్పాటులో మొదటి అంశం- సరైన ప్రమాణాలతో న్యాయమూర్తుల నియామకం. రెండోది, న్యాయమూర్తులపై ఆరోపణలు వచ్చినప్పుడు ఇప్పుడున్న పద్ధతిలో కాకుండా ఆచరణసాధ్యమైనరీతిలో వారిపై విచారణ జరిపి కచ్చితంగా చర్యలు తీసుకునే వ్యవస్థ ఏర్పాటు.

సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల్ని నిష్పాక్షికంగా, పారదర్శకంగా, ప్రజాస్వామికంగా ఎంపిక చేసే వ్యవస్థే గనక మన దేశంలో ఉండి ఉంటే, సదరు న్యాయమూర్తి మీద వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంత తీవ్రమైన ఆరోపణలు చేసే అవకాశం వచ్చేది కాదు. న్యాయమూర్తుల ఎంపికకు ప్రామాణిక ప్రక్రియ ఉంది కాబట్టి పలు ఆరోపణల్ని ప్రజలు కూడా పట్టించుకునేవారు కాదు. తప్పు చేసిన న్యాయమూర్తులపై చర్యలకు ఇప్పుడున్న అభిసంశన స్థానంలో ఆచరణసాధ్యమైన జవాబుదారీ చట్టం ఉండి ఉంటే.. జగన్మోహన్ రెడ్డి చేసిన మిగిలిన ఆరోపణల్ని కూడా ప్రజలు పట్టించుకోకుండా చట్టానికే వదిలేసి ఉండేవారు. న్యాయవ్యవస్థ పట్ల నమ్మకం ఏమాత్రం సడలేది కాదు.

ఎన్నో కులాలు, మతాలు, ధోరణులు ఉన్న భారత్ వంటి దేశంలో అందరికీ న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చే న్యాయవ్యవస్థ లేకుంటే తీవ్ర ప్రమాదకర పరిణామాలు జరుగుతాయని, న్యాయమూర్తులుగా సమర్థులు, నిజాయతీపరులు ఉండటమే కాదు ఉన్నారనే విశ్వాసాన్ని కలిగించేలా ఉన్నత న్యాయవ్యవస్థలో నియామకాల్ని కొన్ని ప్రమాణాలతో జరపాలని, ఇప్పుడు చేస్తున్నట్లు జడ్జీలను జడ్జీలే నియమించుకునే పద్ధతిని మార్చి జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ)ని ఏర్పాటు చేయాలని అందుకే జేపీ లోక్‌సత్తా ఆవిర్భావం నుంచే స్పష్టం చేస్తూ వచ్చారు. ఇందుకోసం దాదాపు 10-15 సంవత్సరాలు నిశ్శబ్దంగా పనిచేశారు. ఎన్‌జేఏసీ బిల్లును తాను స్వయంగా డ్రాఫ్ట్ చేయగలిగినా, ఎవరి నుంచీ, ముఖ్యంగా న్యాయవ్యవస్థ నుంచి అభ్యంతరాలు రాకుండా ఉండేందుకు విజ్ఞులైన ముగ్గురు న్యాయదిగ్గజాల చేత తయారుచేయించారు. వారిలో జస్టిస్ జేఎస్ వర్మ, జస్టిస్ వెంకటాచలయ్య సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేయగా, జస్టిస్ కృష్ణ అయ్యర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సుప్రసిద్ధులు. వీరి చేత రూపొందించిన ఎన్‌జేఏసీ బిల్లును రెండు ప్రధాన జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, పార్లమెంటులో ప్రాతినిధ్యమున్న ఇతర రాజకీయ పార్టీల నేతలు ఆమోదించేలా జేపీ ఒప్పించారు. ఎట్టకేలకు నరేంద్రమోదీ ప్రభుత్వం వచ్చాక ఆమోదించిన మొట్టమొదటి చట్టంగా పార్లమెంటు ఉభయ సభల్లో ఈ బిల్లు డిసెంబర్ 2014లో దాదాపు ఏకగ్రీవ ఆమోదం పొందింది. కొన్ని నెలల వ్యవధిలోనే మెజారిటీ రాష్ట్రాలు ఈ చట్టాన్ని




# ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా పంపిన సంస్కరణల ప్రతిపాదనలకు న్యాయమూర్తుల లిఖితపూర్వక ఆమోదం

ఉన్నత న్యాయనియామకాలకు జాతీయ జ్యుడీషియల్ కమిషన్ (ఇప్పుడు ఎన్‌జేఏసీ)ను ఏర్పాటు చేయాలని ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా పంపిన ప్రతిపాదనలకు జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ పంపిన ఉమ్మడి అభిప్రాయాలు:

**జస్టిస్ కృష్ణయ్యర్ ఈ అభిప్రాయాలను సమర్థించారు:**

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం (ఎఫ్‌డీఆర్) మన ప్రజాస్వామ్య రాజకీయంలో చట్టబద్ధ పాలనను ప్రభావవంతంగా పరిరక్షించేందుకు అవసరమైన న్యాయ సంస్కరణల కోసం డాక్యుమెంట్‌ను రూపొందించింది. ఈ విషయంలో మా అభిప్రాయాలను కోరుతూ డాక్యుమెంట్‌ని మాకు పంపారు.

డాక్యుమెంట్‌ను మేం గమనంలోకి తీసుకుని మన రాజకీయానికి అత్యంత కీలకమైన అందులోని అంశాలను శ్రద్ధగా అధ్యయనం చేశాం. అందులోని ప్రధానాంశాలు:

1) అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు ఏర్పాటు

2) సుప్రీంకోర్టు జడ్జీల నియామకం

3) హైకోర్టులకు జడ్జీల నియామకం

4) ఉన్నత న్యాయస్థానాలలో నేరాలకు పాల్పడ్డ జడ్జీల తొలగింపు

ఇప్పుడున్న పద్ధతిని మెరుగుపరిచేందుకు ఇందులో సూచించిన పరిష్కారాలను కూడా మేం పరిగణలోకి తీసుకున్నాం. మా అభిప్రాయాలను ఈ పరిష్కారాల మీద తెలియచేస్తున్నాం.

ఈ బ్యాక్‌గ్రౌండ్ పత్రం సమగ్రంగా ఉంది. ఈ అంశాన్ని ఎలా పరిష్కరించాలో సరైన దిశను సూచించింది. ఈ బ్యాక్‌గ్రౌండ్ పత్రం పట్ల అభినందనలతో మా ఆమోదాన్ని లిఖితపూర్వకంగా తెలియచేస్తున్నాం.....

These are our views in this matter
M.N Venkatachaliah & J.S Verma
Former Chief Justices of India

ధృవీకరించాయి.

ఆ తర్వాత 99వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆమోదం పొందిన ఎన్‌జేఏసీని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలవటంతో.. ఎన్‌జేఏసీ ఆవశ్యకతను, అందుకోసం ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా చేసిన సుదీర్ఘ కృషిని వివరిస్తూ ఎంపీలకు, అన్ని పార్టీల అధ్యక్షులకు డా॥ జేపీ లేఖ రాశారు. 'రాజ్యాంగ ప్రజాస్వామ్యబద్ధమైన అంశం, దానికితోడు తమ నియామకాలకు సంబంధించిన సున్నితమైన అంశం కాబట్టి సుప్రీంకోర్టు న్యాయనియంత్రణ పాటిస్తుందని ఆశిస్తున్నాం. ఒకవేళ తీర్పు ఎన్‌జేఏసీకి వ్యతిరేకంగా వస్తే పార్లమెంటు ఆ ఎమర్జెన్సీ పరిస్థితిలో రాజ్యాంగసభలాగా వ్యవహరించి, పార్లమెంటు సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగ ప్రజాస్వామ్య సూత్రాల్ని పరిరక్షించాలి' అని ఆ లేఖలో జేపీ కోరారు. దాంతోపాటు లోక్‌సత్తా కృషిని బుక్‌లెట్ రూపంలో పంపారు. ఈ వివరాలను సుప్రీంకోర్టుకి కూడా పంపుతూ ఇంప్లీడ్ అయి తన వాదనలు వినిపించే అవకాశం కల్పించాలని జేపీ కోరారు. కానీ అత్యున్నత న్యాయస్థానం ఆ అవకాశం ఇవ్వలేదు. దాంతో ఇక భారం పూర్తిగా పార్లమెంటు మీద, పౌరసమాజం మీదే ఉందని, లోక్‌సత్తా తన వంతు సహకారం, సమన్వయం అందిస్తుందని జేపీ విజ్ఞప్తి చేశారు. కానీ అక్టోబర్ 16, 2015న సుప్రీంకోర్టు అన్యాయంగా ఎన్‌జేఏసీ చట్టాన్ని కొట్టివేసింది.

ఇది దేశ అత్యున్నత న్యాయస్థానం చేసుకున్న సెల్ఫ్‌గోల్ అని, సుప్రీంకోర్టు ఎప్పటికైనా తన తీర్పును పునస్సమీక్షించుకుని ఈ చట్టాన్ని ఏదోకరకంగా మళ్లీ తీసుకురాక తప్పదని ఆరోజే జేపీ స్పష్టం చేశారు.

"ఎన్‌జేఏసీని ఏర్పాటుకు పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన 99వ రాజ్యాంగ సవరణను కొట్టివేస్తూ, జడ్జీలను జడ్జీలే నియమించుకునే పాత కొలీజియం వ్యవస్థనే కొనసాగించాలనటం సుప్రీంకోర్టు సెల్ఫ్ గోల్ చేసుకోవటమే. ప్రపంచంలోని మరే ప్రజాస్వామ్య దేశంలోనూ ఇలా మాట్లాడే సాహసాన్ని న్యాయవ్యవస్థ చేయదు. కంచే చేను మేసినట్టు అత్యున్నత న్యాయస్థానం వ్యవహరించింది. రాజ్యాంగాన్ని ధిక్కరించింది. సుప్రీంకోర్టుకు స్వయంప్రతిపత్తి రాజ్యాంగం నుంచి వస్తుంది తప్ప.. రాజ్యాంగాన్నే కాదనే అధికారం సుప్రీంకోర్టుకు లేదు. న్యాయమూర్తులు స్వయంభులు, దైవదూతలు, దైవాంశసంభూతులు, చక్రవర్తులు కాదు.. రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలకు లోబడి పనిచేయాల్సిందే. అసలీ పరిస్థితి ఇక్కడిదాకా రావటానికి మన దేశంలో రాజకీయాలు దిగజారటమే కారణం. అవినీతి, గూండాయిజం వంటి వాటితో రాజకీయం దిగజారటం వల్లే ప్రజలు రాజకీయానికి ప్రత్యామ్నాయంగా న్యాయవ్యవస్థ మీద మితిమీరి ఆధారపడుతున్నారు. రాజకీయం దిగజారి, అరుపులు, నినాదాలు తప్ప విధానాల సంక్లిష్టతల గురించి అవగాహన తక్కువ ఉండటం వల్ల మనదేశంలో ఇలాంటి తీర్పుని ఇచ్చారు. ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ జడ్జీలను జడ్జీలే నియమించుకోరు. ఫ్రాన్స్, కెనడా, బ్రిటన్ తదితర దేశాలన్నిటిలో ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వాల, పార్లమెంటుల పాత్ర ఉంటుంది. చాలా దేశాల్లో సమాజంలోని పౌరులకు కూడా అవకాశం కల్పిస్తారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి

## జాతి నిర్మాణంలో వెనకడుగు

ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతి హోదాలో జోర్డాన్, ఇజ్రాయిల్, పాలస్తీనాల్లో పర్యటించినప్పుడు అక్కడి విద్యార్థులు ఆయన ముందు ఒక పెద్ద ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు- కేవలం రెండు భాషలు, ఒకే మతంలో భిన్న వర్గాలు ఉంటేనే ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాల్లో నిరంతరం ఘర్షణలు, రక్తపాతం జరుగుతుంటే.. భారత్‌లో అన్ని భాషలు, మతాలు, తెగలు, భిన్న ఆచారవ్యవహారాలు ఉన్నా ఎలా దేశమంతా కలిసి ఉంటోంది? అని అడిగారు. నిజమే, ఆ ఘనత ప్రాథమికంగా మన జాతీయోద్యమ నేతలది. దేశానికి స్వతంత్రం తేవటం కన్నా, మన జాతీయోద్యమ నేతలు సాధించిన గొప్ప కార్యం ఈ దేశమంతటినీ ఏకం చేయటం. అలాగే ఈవేళ మనదేశ సమగ్రత, ప్రజాస్వామ్యం కనీస స్థాయిలో నిలబడటానికి న్యాయస్థానాల స్వయం ప్రతిపత్తి కూడా ఓ కీలకకారణమనటంలో ఏమాత్రం సందేహం లేదు. అయోధ్య కేసు కావచ్చు, స్వతంత్ర భారత చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణాలలో ఒకటైన 2 జీ స్పెక్ట్రం లైసెన్సుల కేటాయింపు కేసు కావచ్చు.. కోర్టు జోక్యం చేసుకోబట్టే అనేక భయంకర పరిణామాలకు అడ్డుకట్టపడింది. 2జీ కుంభకోణంపై లోక్‌సత్తాయే పిటిషన్ వేసి అక్రమ లైసెన్సుల్ని రద్దుచేయించింది, బొగ్గు తదితర ప్రకృతి వనరులకు బహిరంగ వేలం విధానం వచ్చేలా చేసింది. అయితే మనం పెద్దలు వేసిన పునాదిని మనం కొనసాగించగలుగుతున్నాంగానీ వారు ఆశించిన జాతి నిర్మాణ లక్ష్యాన్ని మాత్రం సాధించలేకపోతున్నాం. అధికారాన్ని మార్గంగా కాకుండా లక్ష్యంగా భావిస్తూ ఎన్నికల రాజకీయాలకే పరిమితమవుతుండటం, ప్రజల భాగస్వామ్యాన్ని, పారదర్శకతను పెంచే వ్యవస్థల నిర్మాణానికి బదులు ప్రజలతో సంబంధం లేని వ్యవస్థలను పెంచి పోషించటం వంటి నియంతృత్వ పోకడలతో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని దిగజారుస్తున్నాం. జాతి నిర్మాణానికి అవసరమైన కీలక సమయాన్ని వృధా చేస్తున్నాం. ఎన్‌జేఏసీ (99వ రాజ్యాంగ సవరణ)ని రద్దు చేస్తూ అక్టోబర్ 16, 2015న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు జాతి నిర్మాణంలో మరో వెనకడుగు అని చెప్పకతప్పదు.

## ఏ వ్యవస్థయినా ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీయే..

### అయితే రాజ్యాంగంలో పొందుపరిచినట్లు ఒక్కో వ్యవస్థా ఒక్కో రీతిలో జవాబుదారీ

న్యాయవ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తి ఉండాల్సిందే కానీ, న్యాయమూర్తులు దైవదూతల్లా, దైవాంశసంభూతుల్లా తమను తాము నియమించుకుని, మిగిలినవారెవ్వరూ తమను ప్రశ్నించటానికి వీల్లేదంటే, అక్కడ అవినీతి, అసమర్థతలు రాజ్యమేలుతున్నా ప్రజలు తలవంచాల్సిందేనంటే.. అది రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదు. రాజకీయ జోక్యంతో నియామకాలు చేస్తూ తమపై కేసులు వచ్చినప్పుడు కొన్ని పార్టీల నేతలు 'నాట్‌బిఫోర్' వంటి నాటకాలాడి తప్పించుకుంటున్నారన్న నిర్దిష్ట ఆరోపణలు ఉన్నాయి. కొందరు న్యాయమూర్తులు బెయిలుకు అనూహ్యస్థాయిలో పదుల కోట్ల లంచం తీసుకున్న కేసులో సాక్ష్యాలతో పట్టుబడ్డారు. న్యాయవ్యవస్థలో అవినీతి, అక్రమాలు జరగటమంటే మన ప్రజాస్వామ్య నిర్మాణానికి చెదలు పట్టటమే. ఆర్థిక సంస్కరణలు వచ్చాక న్యాయవ్యవస్థను పటిష్ఠం చేయాల్సిన అవసరం మరింత పెరిగింది. లక్షలకోట్ల కుంభకోణాలకు, అవినీతినేతలకు కళ్లెం వేయాలంటే న్యాయవ్యవస్థ తగిన 'ప్రత్యేక' సంస్థాగత ఏర్పాట్లతో అక్షరాలా నిప్పులా పనిచేయాలి. ఉన్నత న్యాయమూర్తుల నియామకాల్లో ఇప్పుడున్న కొలీజియం వ్యవస్థలో జడ్జీలే జడ్జీలను నియమించుకుంటారు. అసలు ఎవరిని, ఎందుకు జడ్జీగా నియమించారో ఎవరికీ అంతుచిక్కదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి రాష్ట్రపతి న్యాయమూర్తుల్ని సంప్రదించాలని రాజ్యాంగం చెబుతుంటే, దానికి వక్రభాష్యం చెప్పి మొక్కుబడిగా రాష్ట్రపతికి పేర్లు పంపి కొలీజియం ద్వారా న్యాయమూర్తులే న్యాయమూర్తుల్ని నియమించుకుంటున్నారు. ఒకవేళ రాష్ట్రపతికి అభ్యంతరాలున్నా ఒకసారి తిరస్కరించటం మినహా చేయగలిగిందేమీ లేదు. ఈరకంగా కొలీజియం వ్యవస్థ పూర్తిగా రాజ్యాంగవిరుద్ధం. ప్రజలకు ఇంకా పరిణతి లేదు కాబట్టి తమను ఎంపిక చేసే శక్తి వారిలో నుంచి వచ్చిన ప్రతినిధులకు ఉండదని, కాబట్టి తమనుతామే నియమించేసుకుంటామని కొందరు న్యాయమూర్తులు చేస్తున్న వాదన ఈదేశ ప్రజాస్వామ్యాన్ని అవమానించటమే. ఎవరికీ జవాబుదారీకాని వ్యవస్థ ఎంత గొప్పదైనా, రాజకీయ జోక్యమున్న వ్యవస్థకన్నా ఎప్పుడోకప్పుడు ప్రమాదకరంగా మారుతుందని చెప్పటానికి బోలెడు ఉదాహరణలున్నాయి. రాజకీయాలను, చట్టసభలను భ్రష్టుపట్టించటం వల్ల, రాజకీయ వ్యవస్థకన్నా న్యాయవ్యవస్థ మీదే ఆధారపడటం మేలు అనే భావన కలగొచ్చు. అది ఇంకా ప్రమాదకరం. న్యాయవ్యవస్థ సహా ఏ వ్యవస్థయినా ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీ కావాల్సిందే. అయితే రాజ్యాంగంలో పొందుపరిచినట్టు ఒక్కో వ్యవస్థా ఒక్కో రీతిలో జవాబుదారీ కావాల్సుంటుంది.

ఉన్నత న్యాయమూర్తులను నియమించమని రాజ్యాంగంలో పదజాలం ఉంటే, దానికి విపరీతార్థాలు చెప్పి ప్రపంచంలో ఏ ప్రజాస్వామిక దేశంలోనూ లేనిరీతిలో జడ్జీలను జడ్జీలే నియమించుకునే విడ్డూరమైన కొలీజియం వ్యవస్థని మన సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. ఈ తరహా వ్యవస్థనే కొనసాగించాలనుకుంటోంది. దైవదూతల్లా, దైవాంశసంభూతుల్లా తమను తామే నియమించుకుంటామని, ప్రభుత్వం, ప్రజలతో తమకు సంబంధం లేదని చెప్పటం ద్వారా సుప్రీంకోర్టు తన విశ్వసనీయతను తానే తగ్గించుకుంది. దేశంలో సంక్లిష్టమైన మందిరం-మసీదు, రిజర్వేషన్లు, నదీజలాల పంపిణీ, ఆంధ్ర-తెలంగాణ వంటి రాష్ట్రాల మధ్య తగాదాలు లాంటి ఘర్షణలు

## జస్టిస్ కృష్ణ అయ్యర్ రాసిన లేఖ

జనవరి 18, 2011

మై డియర్ జయప్రకాష్ నారాయణ్, మీరు పంపిన జస్టిస్ వర్మ, వెంకటాచలయ్య అభిప్రాయాలను చదివించుకుని విన్నాను (నా కంటిచూపు సరిగా లేనందున). మౌలికంగా నాకు ఎటువంటి విభేదం లేదు. మీకు నేను టెలిఫోన్‌లో వివరించినట్టు, ఈ విషయంలో మీరు ముందుకెళ్లవచ్చు. ఉన్నత న్యాయవ్యవస్థకు నియమితులయ్యే అభ్యర్థి నిజాయతీ మనందరం ముక్తకంఠంతో అంగీకరించాల్సిన ముఖ్యవిషయం.

కార్యనిర్వాహక, శాసన, న్యాయవ్యవస్థలు సంపన్నులకే చెందితే సోషలిస్టు ఆర్థిక న్యాయం ఎప్పటికీ సాధ్యం కాదు.

In that case the poor will be the martyrs of the system and the richer will be the masters as the oft-quoted anonymous poem explains:

The law locks up both man and woman
Who steals the goose from off the common,
But lets the greater felon loose
Who steals the common from the goose

With regards,
Yours sincerely,
V.R KRISHNA IYER

తలెత్తినప్పుడు రాజకీయం మాత్రమే వాటిని పరిష్కరించటం కష్టం. అటువంటి పరిస్థితుల్లో విశ్వసనీయమైన సుప్రీంకోర్టు అవసరం. కానీ ఎన్‌జేఏసీపై తరహాలో తీర్పులతో సుప్రీంకోర్టు తన విశ్వసనీయతను కోల్పోతే ఉపద్రవాలు ముంచుకొచ్చి దేశ సమగ్రత కూడా ప్రమాదంలో పడుతుంది. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థయినా ప్రజల మద్దతును ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పొందాల్సిందే. అలా ప్రజలతో సంబంధం లేని వ్యవస్థలకు విశ్వసనీయత, నైతికత ఉండదు.. పార్లమెంటు, పౌరులు, ప్రభుత్వం పాత్ర అక్కర్లేదు అంటే ఇక కలెక్టర్లని కలెక్టర్లు, ఎన్నికల సంఘాన్ని ఎన్నికల సంఘం, యూపీఎస్‌సీని యూపీఎస్‌సీ, ఇలా ప్రతి వ్యవస్థా తనను తానే నియమించుకోవచ్చు, రేపు ఎన్నికలు, పార్లమెంటు కూడా అక్కర్లేదనవచ్చు. ఈ ధోరణి అరాచకత్వానికి, నియంతృత్వానికి దారితీస్తుంది. ఎప్పటికైనా ఎన్‌జేఏసీ ఏర్పాటు తప్పనిసరి" అని జేపీ అన్నారు.

ఆనాడు జేపీ చెప్పిన మాట వాస్తవమని రుజువు చేసే దిశగానే తాజా పరిణామాలు కూడా చోటుచేసుకున్నాయి.

ఇప్పుడు వైఎస్ జగన్‌కు అనుకూలంగా కోర్టుల్ని విమర్శిస్తున్న ఆలోచనాపరుల్లో కూడా కొందరు ఆరోజున ఆయన ప్రతిపక్షంలో ఉండటంతోనో ఏమో ఎన్‌జేఏసీని విమర్శించారు. కోర్టుల్లో రాజకీయ జోక్యం అంటూ వక్రభాష్యాలు చెప్పారు.


జడ్జీలను జడ్జీలే నియమించుకునే కొలీజియం స్థానంలో, అప్రజాస్వామిక ఏర్పాటు స్థానంలో.. న్యాయవ్యవస్థతోపాటు శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల భాగస్వామ్యమున్న జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్ కమిషన్‌ను ఏర్పాటు చేయటం వల్ల ఉన్నత న్యాయవ్యవస్థలో జరిగే నియామకాలలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుంది. న్యాయ, కార్యనిర్వాహక, శాసన, పౌర వ్యవస్థల నుంచి ప్రతినిధులతో పరస్పర సమతుల్యతతో ఎన్‌జేఏసీని రూపొందించటం జరిగింది.

జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ చట్టంతోపాటు న్యాయసంస్కరణలపై ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా డాక్యుమెంట్‌లో పేర్కొన్నట్లు న్యాయమూర్తులపై ఆరోపణలను విచారించేందుకు జ్యుడీషియల్ అకౌంటబిలిటీ చట్టం కూడా తెచ్చి ఉంటే ఈవేళ ఉన్నత న్యాయవ్యవస్థ చుట్టూ ఇంత రచ్చ ఉండేది కాదు. అలాగే సమర్థులు న్యాయమూర్తులుగా వచ్చేందుకు ఐఏఎస్, ఐపీఎస్‌ల తరహాలో ఇండియన్ జ్యుడీషియల్ సర్వీస్ (ఐజేఎస్)ని ఏర్పాటు చేయటం, కింది కోర్టులలో న్యాయమూర్తుల సంఖ్యను పెంచటం, న్యాయ విచారణ పద్ధతుల్ని సులభతరం చేయటం, స్వతంత్ర ప్రాసిక్యూషన్, స్థానిక న్యాయస్థానాల ఏర్పాటు, నేరపరిశోధనలో, పోలీసు యంత్రాంగంలో సంస్కరణలు వంటివి అవసరం. ఇందుకోసం కూడా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా కృషిని కొనసాగిస్తున్నాయి.

ఏదోకరూపంలో ఎన్‌జేఏసీలోని జవాబుదారీతనాన్ని, ఇతర న్యాయసంస్కరణలను సాధించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి పోరాడాల్సుంది. రాజకీయాలను బాగు చేసుకుంటూ, ప్రతి వ్యవస్థా జవాబుదారీతనంతో వ్యవహరించే నిర్మాణాన్ని చేసుకోవటం మినహా ప్రజలు కేంద్రంగా పాలనకు మరో మార్గం లేదు. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు సమతుల్యతతో సమర్థవంతంగా పనిచేసినప్పుడే రాజ్యాంగ నిర్మాతలు ఆశించినట్లు చిట్టచివరి పౌరునికి కూడా సాధికారత లభిస్తుంది. రాజకీయ నేతలు, న్యాయమూర్తులు, పౌర సమాజం ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించి మేలుకోకుంటే, న్యాయవ్యవస్థ విశ్వసనీయత ఇంకా పలుచబడి భారతదేశం భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఉన్నత న్యాయస్థానాల తీర్పుల్లోని పరిణతి పట్ల, నిష్పాక్షికత పట్ల అసంతృప్తులు, అనుమానాలతో విమర్శలు, నినాదాలు చేస్తే చాలదు.. ఎన్‌జేఏసీ ఏర్పాటు సహా న్యాయసంస్కరణల మీద దృష్టి పెట్టటం ఇప్పుడు భారతదేశం ముందున్న కర్తవ్యం.

(జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ ఏర్పాటు రాజ్యాంగ సవరణ కోసం లోక్‌సత్తా చేసిన కృషిని వివరించే బ్యాక్‌గ్రౌండ్ పత్రాలు, అప్పటి ప్రధానమంత్రికి రాసిన లేఖలు, న్యాయమూర్తుల బృందాలు పంపిన లేఖలు, సమగ్ర సమాధానాల పూర్తి వివరాలన్నిటినీ వివరించే బుక్‌లెట్‌ని http://www.fdrindia.orgలోచూడవచ్చు)

# న్యాయవ్యవస్థ - జవాబుదారీతనంపై న్యాయకోవిదులు, రాజనీతిజ్ఞులు ఏమన్నారు..




పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక వ్యవస్థ శాసన వ్యవస్థకు, .... (లేదా) .... న్యాయవ్యవస్థకు .... లోబడి పనిచేయాలనే నిబంధనను నేను ఏ రాజ్యాంగంలోనూ చూడలేదు..... రాజ్యాంగంలోని ప్రొవిజన్లకు రాజ్యవ్యవస్థలోని అన్ని విభాగాలూ లోబడి పనిచేయాల్సిందే..... తన అధికారం రాజ్యాంగం ద్వారా పరిమితమని ఏ రాజ్యాంగ అధికార వ్యవస్థ గుర్తుంచుకోకపోయినా, ఆ దేశంలో రాజ్యాంగబద్ధ ప్రభుత్వం పనిచేయలేదు...."

**-డా॥ బి.ఆర్ అంబేద్కర్**

✦ ఏ చట్టాలు రాజ్యాంగబద్ధం.. ఏవి కావు అని - తమకు సంబంధించినవైనా, తమ విధినిర్వహణ పరిధిలోనైనా, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థకు సంబంధించినవైనా - నిర్ణయించే అధికారం న్యాయమూర్తులకు ఇవ్వాలన్న అభిప్రాయం న్యాయవ్యవస్థను నియంతృత్వ విభాగంగా మారుస్తుంది.

- థామస్ జఫర్సన్

✦ మన న్యాయమూర్తులు ఎవరు, వాళ్లు ఎలా ఎంపికయ్యారు అనేవి ప్రజాప్రయోజనాల దృష్ట్యా బహిరంగ పరచాల్సిన, చర్చించాల్సిన అంశాలు.

- టామ్ లెగ్, లార్డ్ ఛాన్సలర్స్ విభాగం మాజీ శాశ్వత కార్యదర్శి

✦ పార్లమెంటు సార్వభౌమాధికారం, చట్ట ప్రాధాన్యత రెండూ పరస్పర వ్యతిరేకంగా కనిపించవచ్చు, ఒకదాన్ని ఇంకోటి నిలువరిస్తున్నట్టుగా అనిపించవచ్చు. కానీ అది భ్రమే. పార్లమెంటు సార్వభౌమాధికారం.. చట్ట ప్రాధాన్యాన్ని అవసరంగా భావిస్తుంది.

- ఎ.వి డైసీ, బ్రిటీషు న్యాయకోవిదుడు, రాజ్యాంగ సిద్ధాంతకర్త

✦ ఎక్కువ అధికారాన్ని ప్రదర్శించే పదవిలో ఉన్నవారు జవాబుదారీతనంతో వ్యవహరించటానికి స్వయంగా ముందుకు రావటం ప్రజాస్వామ్య పరిణతికి అవసరం. న్యాయాధికారాన్ని జవాబుదారీతనం నుంచి మినహాయించటానికి వీల్లేదు. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీయకుండా జవాబుదారీతనానికి పద్ధతుల్ని రూపొందించటం ఎలా అన్నదే సవాలు.

- ఎ లీ సాయర్, 'డెవలపింగ్ మెకానిజమ్స్ ఫర్ జ్యుడీషియల్ అకౌంటబిలిటీ ఇన్ యు.కె', లీగల్ స్టడీస్, వాల్యూమ్ 24, ఇష్యూ 1-2, 2004

# హైదరాబాద్‌లో కాంటూర్ సర్వేతో డ్రైయిన్లు, రోడ్లు నిర్మించాలి..

## మేయర్‌కి సాధికారతనిచ్చి నగర పాలనను ప్రక్షాళన చేయాలి: జేపీ

హైదరాబాద్‌లో అక్టోబర్‌లో పడినట్లు అసాధారణ వర్షపాతం పడితే ఏ నగరంలోనైనా వరద వస్తుందని, కానీ ఇంత ఉపద్రవానికి దారితీయటం, ఇన్ని పదుల వేల మంది జీవితాల్ని ఇంత గందరగోళపరచటం మాత్రం కచ్చితంగా మన పాలనా వైఫల్యమేనని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

హైదరాబాద్‌లో వర్షబీభత్సంపై జేపీ మీడియాతో మాట్లాడుతూ, సాధారణ వర్షంతో వరదలు రావటం – మామూలు పరిస్థితుల్లో పరిపాలన, సమస్యలు, వైఫల్యం.. ఈ రెంటినీ వేర్వేరుగా చూస్తేనే మనం గందరగోళ పడకుండా పరిష్కారం సాధించగలమన్నారు.

“వాతావరణ శాఖ చాలా నిర్దిష్టంగా సమాచారం ఇచ్చినా కూడా మీట నొక్కినట్లు ఇంత వర్షం సమస్య వెంటనే





పరిష్కారమయ్యేది కాదు. అక్టోబర్ 13న ఒక్కరోజే కేవలం ఐదారు గంటల్లో 7, 8 టీఎంసీలు.. అంటే సుమారు 3 లక్షల క్యూసెక్కుల నీళ్లు నగరం మీద గుమ్మరించినట్లు పడ్డాయి. కృష్ణ లాంటి పెద్దనదిలోకే ఇన్ని నీళ్లు వస్తే మంచి వరద వచ్చినట్లు. అలాంటిది మూసీలోకి అన్ని నీళ్లు వస్తే తట్టుకోవటం కష్టం. నీరు పల్లమెరుగు కాబట్టి.. ఇంత వర్షం పడినప్పుడు నీళ్లు వెళ్లటానికి మార్గం లేకున్నా, మార్గం కుంచించుకుపోయినా ఎటు వీలుంటే అటు పల్లపు ప్రాంతాలకు వరద ప్రవహిస్తుంది. దారి లేకుంటే నీటి మట్టం పెరిగి ముంచుతుంది. హైదరాబాద్‌లో అదే జరిగింది. నగరంలో ఎప్పుడైతే భూములకు విలువ పెరిగిందో అప్పుడు ఆక్రమణలు పెరిగాయి. సరస్సులను ఆక్రమించటం, లేఅవుట్లు వేయటం యధేచ్ఛగా జరిగాయి. నేను శాసనసభ్యునిగా ఉన్నప్పుడు హకట్‌పల్లిలో సరస్సులను, నాలాలను ఆక్రమణల నుంచి విడిపించి చుట్టూ రక్షణ ఏర్పాటు చేయటానికి చాలా గట్టి ప్రయత్నం చేశాను. అయితే ఆ ప్రయత్నానికి విపరీత ప్రతిఘటన వచ్చింది. మనం ఇతర దేశాల్లోలాగా పేదలకు సరైన గృహ వసతుల్ని ఏర్పాటు చేయకపోవటం సమస్యను జటిలం చేసింది. ఈమధ్య కాలంలో పట్టణ గృహనిర్మాణం గురించి మాట్లాడుతున్నారుగానీ ఆచరణలో పెద్దగా పురోగతి కన్పించటం లేదు. ఇందుకు కొన్ని సమస్యలున్నాయి. కానీ ప్రభుత్వం చెరువుల ఆక్రమణల పట్ల ఏమాత్రం శ్రద్ధ లేకుండా వ్యవహరించటంతో నిజాయతీగా కొనుగోళ్లు చేసినవాళ్లు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు, నగర ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. నాకు తెలిసి దుర్గం చెరువు లోతట్టు ప్రాంతం వంటి చోట్ల పలువురు డాక్టర్లు, సంపన్నులు కూడా ఇళ్లు కొనుక్కున్నారు. వాళ్లేమీ తప్పు చేయలేదు, చట్టబద్ధంగానే కొనుక్కున్నారు. దీర్ఘకాలంగా చెరువు కట్ట వద్ద ఆక్రమణలు, లేఅవుట్లను కట్టడి చేయకపోవటం వల్ల పదుల వేల మంది అక్కడ నివాసముంటున్నారు. తల్లకిందులుగా తపస్సు చేసినా కూడా పెద్ద వర్షం వచ్చినప్పుడు అక్కడ ముంపు జరగకుండా ఆపలేము. దీర్ఘకాలంలోని సమస్యను స్వల్పకాలంలో పరిష్కరించలేం. 1908లో మూసీ మహాప్రళయం వచ్చినప్పుడు 14 గంటల్లో 42 సెంటీమీటర్ల వర్షం పడింది. అప్పుడు నగరంలోని నాలుగున్నర లక్షల జనాభాలో దాదాపు పదిహేను వేల మంది మృత్యువు పాలయ్యారు. అప్పుడు ఎగువన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను నిర్మించారు. అవి మూసీ వరదను నిరోధించటంతోపాటు ఫేజ్‌ల వారీగా కృష్ణా జలాలు వచ్చేవరకు నగరంలో మంచినీటి వనరులుగా కూడా ఉపయోగపడ్డాయి. దాదాపు 112 ఏళ్ల తర్వాత ఆ స్థాయి సమస్యను మళ్లీ ఎదుర్కొంటున్నాం” అని జేపీ అన్నారు.

**1908లోలా దీర్ఘకాలికంగా ఆలోచించాలి..**
**ఆ స్థాయిలో స్పందించాలి**

వెంటనే కాకపోయినా మళ్లీ ఇలాంటి ఉపద్రవం వచ్చి తీరుతుందని జేపీ హెచ్చరించారు. అందుకే.. ఈవేళ వచ్చిన సమస్యను ఎదుర్కోవటానికి పాలనా యంత్రాంగం తంటాలు పడటం చాలదని, రేపొద్దున ఏం చేద్దామనే ఆలోచన

చేయాలన్నారు. 1908లో ఎలాగైతే అంత పెద్ద వరద నుంచి నగరాన్ని కాపాడటంతోపాటు మంచినీటి వనరుగా కూడా ఉపయోగపడే రిజర్వాయర్లను నిర్మించారో, ఇప్పుడు కూడా అంత దీర్ఘకాలికంగా ఆలోచించాలన్నారు. అప్పటి నిజాం ప్రభుత్వం రాచరికంలోనే, తక్కువ వనరులు, సాంకేతికతతోనే అద్భుతంగా స్పందించిందని, ఆ స్థాయిలో మనం ఈవేళ్టి పరిస్థితులకనుగుణంగా స్పందించాలన్నారు.

**లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాసం చేపట్టాలి, స్థానిక డ్రెయిన్లను పెద్ద డ్రెయిన్లతో అనుసంధానం చేయాలి**

"ఏ మహానగరంలోనైనా చేయాల్సిన పని కాంటూర్ సర్వే. మన హైదరాబాద్‌లో చేయలేదు. మనం డ్రెయిన్లను వర్షపు నీరు ప్రవహించే విధంగా కాకుండా, నీటి సహజ ప్రవాహ దిశను మూసివేసి ఇష్టమొచ్చినట్లు నిర్మించాం. ప్రపంచంలో ఏ నగరంలోనూ ఇలా ఉండదు. లండన్ నగరాన్నే తీసుకుంటే, అక్కడ నాలాలు, రోడ్లు, మురుగు పారుదల అన్నీ నీటి ప్రవాహ దిశ వైపే ఉంటాయి. ఇది చేయకపోతే వరద ముంపు ప్రమాదం కొనసాగుతూనే ఉంటుంది. వర్షపు నీరు ఎటు ప్రయాణిస్తుందో తెలుసుకునేందుకు మనం అసలు కాంటూర్ సర్వే కూడా చేయలేదు. మనకు ఇప్పుడు డిజిటల్ టెక్నాలజీ వంటివి అందుబాటులో ఉన్నాయి కాబట్టి వెంటనే ఈపని చేయాలి. దీనికి 30-40 కోట్ల కంటే ఎక్కువ ఖర్చవదు. హైదరాబాద్‌లో కాంటూర్ సర్వే జరిపించి వర్షపు నీటి ప్రవాహానికనుగుణంగా డ్రైనేజీలు, రోడ్లు, నిర్మాణాలు చేయాలి. కొత్తగా లేఅవుట్లను దాని ప్రకారం ఇవ్వాలి. స్థానిక కాలనీల నుంచి డ్రెయిన్లను పెద్ద డ్రెయిన్లతో అనుసంధానం చేయాలి. ఇప్పటికే ఉన్న లోతట్టు ప్రాంతాలవారిని ఖాళీ చేయించి పునరావాసం కల్పించాలి. లోతట్టు ప్రాంతాల్లో లేఅవుట్లు ఆమోదించకుండా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఆమోదించిన చోట ఏం చేయాలో పరిష్కారాలు ఆలోచించాలి. చెరువులను ఆక్రమించకుండా, వాటిల్లో వ్యర్థాలను కలపకుండా, పూడికతీతలు సహా నిర్వహణ సక్రమంగా ఉండేలా, పర్యావరణాన్ని పరిరక్షించేలా నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి" అని జేపీ కోరారు.

**రెండు సెంటీమీటర్ల వర్షానికే ట్రాఫిక్ స్తంభించేంత, ముఖ్యమంత్రి ఇంటి ముందే మురుగు పారేంత గొప్పగా మన రోజువారీ పాలన**

ఇక రోజువారీ నగర పాలనలో మనది ఘోరవైఫల్యమని జేపీ అన్నారు. 2 సెంటీమీటర్లు వర్షం పడితేనే వరదలొచ్చే స్థాయిలో పాలన సాగుతోందన్నారు. "ముఖ్యమంత్రి గారి నివాస ప్రాంతం, కేబీఆర్ పార్కు వంటి చోట్లే మురుగు రోడ్ల మీద పారుతోంది. నగరంలో డ్రైనేజీ అనేది లేకుండా పోయింది. గంట సేపు వర్షం పడితే ట్రాఫిక్ స్తంభించిపోతోంది. రోడ్లు అధ్వాన్నమైపోతాయి. ఉన్న డ్రెయిన్లను సరిగా కలపకపోవటం, వరద నీటిలోకి మురుగునీటి డ్రెయిన్లను కలపటం ప్రపంచంలో ఎక్కడా ఉండదు, మన వద్దే ఉంది. మన నగరంలో 80 శాతం ఇళ్లకి మురుగు రవాణా వ్యవస్థ లేదు. అప్రూవ్ చేసిన అధికారిక లేఅవుట్లలో కూడా సరస్సుల్లోనో, వరద నీటి డ్రెయిన్లలోనో మురుగును కలుపుతున్నారు. దీనివల్ల ఇళ్లల్లోకి కూడా మురుగు వస్తోంది. ఎప్పుడైతే ఇలా కలగాపులగమైందో, మంచినీరు తాగి అనారోగ్యం పాలవటం జరుగుతోంది. 2009లో భోలక్‌పూర్‌లో మంచినీరు తాగి 9మంది మరణించారు. ఏ నగరంలోనైనా మంచినీళ్లు తాగితే మరణశిక్ష ఉంటుందా? మన హైదరాబాద్‌లో అది కూడా జరిగింది. ఇవన్నీ రోజువారీ పాలనకు సంబంధించిన అంశాలు" అని జేపీ అన్నారు.

**కూకట్‌పల్లిలో చెరువుల్ని పరిరక్షిస్తుంటే అన్ని పార్టీలూ కలిసి అంతు తేల్చాయి, ఇప్పుడు తీవ్రత అర్థమైంది కాబట్టి ప్రక్షాళనకు ఇదో అవకాశం**

"మామూలు సందర్భంలో పార్టీలు కొంత గందరగోళం చేస్తుంటాయి. ఉదాహరణకు ఇందాక చెప్పినట్లు కూకట్‌పల్లిలో డ్రెయిన్లను ప్రక్షాళన చేయటానికి నేను కోరగా అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్ సమీర్ శర్మ బృందాల్ని పంపించారు. ఆయన నా వద్ద జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఎప్పుడైతే ఆయన ఆక్రమణలను తొలగించి చెరువులను, లోతట్టు ప్రాంతాలను పరిరక్షించే పని మొదలుపెట్టారో అన్ని పార్టీలవారూ ఆయన మీద విరుచుకుపడి అంతు తేల్చారు. పార్టీలకతీతంగా దీనికి పాల్పడ్డారు. అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం సహా అన్ని పార్టీల కార్పొరేటర్లూ ధర్నాలు చేసి చివరకు ఆయన్ను బదిలీ చేయించారు. మనం రోజువారీ పాలనను పట్టించుకోవటం లేదు. ఇప్పుడు వచ్చిన ఉపద్రవం ఇంకా అందరి మనసుల్లో ఉంది కాబట్టి రోజువారీ పాలనను బాగు చేసుకోవటం మీద దృష్టి పెడితే అందరూ త్వరగా కలిసివస్తారు" అని జేపీ తెలిపారు.

**మూడు, నాలుగేళ్లలో పూర్తయ్యేట్లు నిర్మాణాలు, హైదరాబాద్ ఆదాయంలో కొంతైనా నగరం కోసం ఖర్చు పెట్టాలి**

డ్రెయిన్లు, పునరావాసానికి వ్యయం రూ.12,000 కోట్లకు పెరిగిందంటున్నారని, ఏళ్ల తరబడి నిర్మాణ కార్యక్రమాల్ని సాగదీయకుండా 3-4 ఏళ్లలో పూర్తయ్యేట్లు ప్రణాళిక, పనులు మొదలుపెట్టటం అవసరమని జేపీ స్పష్టం చేశారు. "హైదరాబాద్ నుంచి అందాజ్‌గా రూ.20,000 కోట్ల మిగులు ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి వస్తోంది. కానీ నగర కనీసాభివృద్ధికి ఎంత ఖర్చు చేస్తున్నారు? ఆర్థిక సంఘం, జాతీయ స్థాయి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ కోసం ఎంత ఖర్చు చేస్తోంది అంటే.. సున్నా. హైదరాబాద్ ఆదాయంలో కొంతైనా హైదరాబాద్ కోసం కేటాయించండి" అన్నారు.

**మేయర్‌కు అధికారాలుంటే ఢిల్లీ తరహాలో ప్రజలు పాలనలో భాగస్వాములవుతారు, మార్పు కనిపిస్తుంది**

నగర పాలనను రాష్ట్ర ప్రభుత్వం గుప్పెట్లో పెట్టుకోకుండా మేయర్‌కు నిధులతోపాటు అధికారాలివ్వాలని,, బాధ్యతల్ని అప్పచెప్పాలని జేపీ స్పష్టం చేశారు. "ప్రపంచంలో ఏ నగరాన్నైనా తీసుకోండి.. లండన్, న్యూయార్క్, లాస్‌ఏంజిల్స్, టోక్యో.. మేయర్లు ఎవరంటే ప్రపంచవ్యాప్తంగా కూడా

చాలాచోట్ల ఠవెంటనే చెప్పేస్తారు. కానీ మన దేశంలో మాత్రం తమ నగరం మేయర్ ఎవరో ఆ నగరవాసుల్లో కూడా ఎక్కువమంది చెప్పలేరు. ఢిల్లీ పేరుకు రాష్ట్రమేగానీ అదో పెద్ద నగరం మాత్రమే. ఢిల్లీ ముఖ్యమంత్రి పేరుకు ముఖ్యమంత్రిగానీ, ఆయన మన దేశంలో కొంత ఎక్కువ అధికారాలున్న మేయర్. ఢిల్లీలో స్థానికంగా ఉన్న ఈ సాధికారత వల్లే అక్కడ ఎంతో కొంత మార్పు కనిపిస్తోంది, ప్రజలు పాలనలో భాగస్వాములవుతున్నారు, పాలనను చూసి ఓటు వేస్తున్నారు. కానీ మన వద్ద అధికారమంతా కమిషనర్ చేతుల్లో ఉంది.. మేయర్లు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నారు. వారికి నిధులు, విధుల్ని ఇవ్వటంతోపాటు కాగితం మీద ఉన్న వార్డు కమిటీల్ని ప్రజల నుంచి ఏర్పాటు చేయండి. అప్పుడు ప్రజల భాగస్వామ్యం ఏర్పడి ప్రకృతి వైపరీత్యాల సమయంలో వేగంగా స్పందించటం, రోజువారీ సమస్యలను సులభంగా పరిష్కరించటం సాధ్యమవుతుంది. ఎప్పుడైతే నగరాల్ని నిర్వీర్యం చేశామో, ఎన్నికల్ని ఆర్భాటాలుగా తయారుచేశామో నగర జీవనం దుర్భరంగా మారింది. ఎందుకయ్యా అధికారం అని కార్పొరేటర్లని అడిగితే, ఎన్నికల్లో ఖర్చు పెట్టింది తిరిగి సంపాదించటానికని చెబుతున్నారు. నగర పాలనను పూర్తిగా మారిస్తేనే ప్రజల రోజువారీ జీవితాలు బాగుపడతాయి" అని జేపీ అన్నారు.

**ఈ ఏడాది మూడు పెద్ద సంక్షోభాలను చూసిన హైదరాబాద్, పరిష్కారాలు చెప్పేవాళ్లు నగరంలోనే ఉన్నా వారిని భాగస్వాముల్ని చేయటం లేదు**

"ఈ సంవత్సరం హైదరాబాద్ మూడు పెద్ద సంక్షోభాలను చూసింది. కొవిడ్, వలస కార్మికులు, వరద. నగరాల సంక్షోభం గ్రామాల సంక్షోభం కంటే పెద్దది. కాబట్టి నగరాల్లో ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తూ స్థానిక సాధికారత కల్పించండి. నగరాల్లో ఆలోచించేవాళ్లు, పన్నులు కట్టేవాళ్లు, పరిష్కారాలు చూపేవాళ్లు ఉంటారు. వరద సమస్యకి పరిష్కారం చెప్పగలిగేవాళ్లు హైదరాబాద్‌లో పలువురు ఉన్నారు. కానీ వాళ్లను భాగస్వాముల్ని చేయటంలా. అధికారాలన్నీ సెక్రటేరియట్‌లో గుప్పెట్లో పెట్టుకుని కూర్చున్నారు" అని జేపీ విమర్శించారు.

**శాసనసభ్యునిగా ఎప్పుడూ నగర పాలక సంస్థ సమావేశాల్లో పాల్గొనలా, నగరాల స్థానిక ప్రభుత్వాలకు రాజకీయ పరపతినివ్వండి**

"నేను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు నగర పాలక సంస్థ సమావేశంలో పాల్గొనమని కోరినా కూడా వెళ్లలేదు. స్థానిక ప్రభుత్వాల్లో ఎమ్మెల్యేల పెత్తనం ఉండకూడదు. వాటికి గౌరవం, స్వతంత్ర ప్రతిపత్తి ఉండాలి. నగరాల స్థానిక ప్రభుత్వాలకు రాజకీయ పరపతినివ్వండి, తగిన నిధులు, విధులనివ్వండి, రోజువారీ జోక్యం చేసుకుంటూ పెత్తనం చేయకుండా పర్యవేక్షణకే రాష్ట్ర ప్రభుత్వాలు పరిమితం కావాలి" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.



# వరద బాధితులకు లోక్‌సత్తా తోడ్పాటు

లోక్‌సత్తా ఎన్ఆర్ఐ విభాగం 'పీపుల్ ఫర్ లోక్‌సత్తా' (పీఎఫ్ఎల్) సహకారంతో లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము హైదరాబాద్ వరద బాధితులకు సహాయాన్ని అందించారు. ప్రత్యేకంగా చేయించిన నిత్యావసరాల కిట్‌లను మన్సూరాబాద్ వినాయక్‌నగర్‌లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర నేత సత్తయ్య సారథ్యం వహించగా, ఎల్‌బీనగర్ అధ్యక్షుడు అంజయ్య, యువత విభాగం అధ్యక్షుడు కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో వరద బారిన పడినవారి సహాయార్థం లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలకు ఉదారంగా సాయం అందించాలని, వ్యవస్థాపకుడు జేపీ పర్యవేక్షణలో ప్రతి రూపాయినీ పారదర్శకంగా జవాబుదారీతనంతో సద్వినియోగం చేస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, కిషోర్ మల్లాడి తదితర నేతల బృందం అంతకుముందు సామాజిక దాతలకు విజ్ఞప్తి చేశారు.

# మూసీ ప్రళయం మళ్లీ వస్తే..?

## -మణికొండ వేదకుమార్, పట్టణ ప్రణాళిక వ్యవహారాల నిపుణులు

మూసీ వరదల సమయం 1908లో నిజాంగా మీర్ మహబూబ్ అలీ ఖాన్ ఉన్నారు. ఆ వరదలకు ఆయన చలించిపోయారు. ఉదార హృదయంతో బాధితులను ఆదుకున్నారు. 1911లో చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ గద్దెనెక్కారు. 1908 నాటి బీభత్సం మరోసారి చోటుచేసుకోకూడదని భావించి నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగానే 1914లో సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు (సిఐబి)ని ఏర్పాటు చేశారు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన ఆవశ్యకతను, దాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరాన్ని ఆ కాలంలోనే గుర్తించారు. అందుకు ఓ కాలపరిమితినీ నిర్దేశించుకున్నారు. సిటీ ప్లానింగ్‌కు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. అప్పటి ప్రఖ్యాత ఇంజినీర్లు దలాల్, సర్ అలీ నవాజ్ జంగ్, కద్‌మైత్యార్ జంగ్ లాంటి వారంతా ఆయా పనుల్లో కీలకపాత్ర వహించారు. సమగ్ర నగర ప్రణాళికను తయారు చేయాల్సిన ఆవశ్యకతను ఆ కాలంలోనే సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎంతో నొక్కి చెప్పారు. ఆయన సూచనలకు అనుగుణంగా నగరంలో పౌర వసతుల మెరుగుకు సిఐబి చర్యలు తీసుకుంది. పార్కులు, బహిరంగ స్థలాలు, ఆట స్థలాలు నిర్మించారు. స్లమ్ క్లియరెన్స్, హౌజింగ్ కాలనీల నిర్మాణం, నూతన తరహాలో మంచినీరు, డ్రైనేజీ వ్యవస్థల ఏర్పాటు, దుమ్ములేని రోడ్ల నిర్మాణం వంటి పథకాలు చేపట్టారు. వీటన్నింటి వల్ల నాటి ప్రజల జీవనప్రమాణాలు మెరుగయ్యాయి. భాగ్యనగరం అందమైన నగరంగా రూపుదిద్దుకోవడం మొదలైంది.

ఎన్నో విపత్తులు ప్రకృతి కారణంగా గాకుండా మానవ తప్పిదాల వల్లే చోటుచేసుకుంటున్నాయి. అలాంటివాటిని ప్రకృతి విపత్తులు అనడం కూడా తప్పే. 1970లో నగరాన్ని ముంచెత్తిన వరదలు కూడా అలాంటివే. చెరువుల పరిరక్షణ బాధ్యతను అధికారులు సక్రమంగా నిర్వహించి ఉంటే ఆ వరదలు వచ్చేవే కావు. అప్పుడు కూడా భారీ వర్షాల కారణంగా చెరువులు నిండిపోయాయి. ఒకదాని తరువాత ఒకటిగా కట్టలు తెగుతూ చెరువుల నీరు ఎంత, బయటకు వదలాల్సిన నీరు ఎంత అనే విషయాలను పట్టించుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఆ చెరువు పూర్తిగా నిండిపోయింది. చెరువుపై ఒకటికి మించిన సంస్థల పర్యవేక్షణ ఉండడం కూడా ఇందుకు కారణం అని చెప్పవచ్చు. ఫలితంగా ఉస్మాన్ సాగర్ చెరువుకట్టకు ముప్పు ఉందని భావించిన అధికారులు హడావుడిగా గేట్లు తెరిచారు. ఫలితంగా వరద నీరు నగరాన్ని ముంచెత్తింది. రేడియో లాంటి ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. ఇది కొంత ప్రజలలో అలజడి సృష్టించింది. కొందరు అతి భయంతో 'పానీ ఆరా భాగో' అనే నినాదాలతో పరుగులు తీయడంతో లోతట్టు (గండిపేట ఊరు నుంచి ఉప్పల్ గ్రామాల వరకు కూడా)



ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకులోనై ఇండ్లను వదిలి పిల్లలతో పరుగులు తీశారు. మళ్ళీ ప్రభుత్వం అప్రమత్తమై ప్రజలను తిరిగి ఇండ్లకు రావాలని రేడియో ప్రకటన ద్వారా ప్రయత్నం చేశారు. అంతలోనే చాలా గృహాలు కూడా దోచుకోబడ్డాయి. అప్పుడు కూడా ప్రాణ, ఆస్తి నష్టం చోటు చేసుకుంది. 2000 సంవత్సరంలో సంభవించిన వరద ప్రధానంగా మూసీ ప్రత్యక్ష వరద కానప్పటికీ పట్టణ వరదలకు సంబంధించిన సమస్యే. హుసేన్‌సాగర్ నిండిపోవడంతో పాక్స్ సాగర్ నుండి వరద ఎక్కువగా చేరడంతో ట్యాంక్‌బండ్ పరిరక్షణకు నీటిని బయటకు వదలాలని అధికారులు భావించారు. మత్తడిని కొంతమేర తొలగించడంతో గాంధీనగర్, అశోక్‌నగర్, హిమాయత్‌నగర్, నల్లకుంట లాంటి దిగువ ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ఇక్కడ కూడా మానవ తప్పిదాలే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం లాంటివన్నీ వరద ముంపునకు కారణాలయ్యాయి.

మూసీ మహా వరద వచ్చి నూటపదేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్, స్వచ్ఛంద సంస్థలు కలిసి పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. వివిధ రంగాలకు చెందిన ఎంతోమంది నిపుణులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతనూ ఈ సందర్భంగా ప్రచారం చేశారు. మురికివాడలు, ఇళ్ళ నిర్మాణం, మంచినీటి సరఫరా వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ, రవాణ, నగర అభివృద్ధి ప్రణాళికలు, పాలన యంత్రాంగం, పర్యావరణం లాంటి అంశాలనూ ఈ సందర్భంగా చర్చించారు. వరదలు రాకముందు ఉన్న పరిస్థితి, ఆ తరువాత చేపట్టిన అభివృద్ధి

**మహానేతలుగా అనుచరులు కీర్తించే కొందరికి హైదరాబాద్ భూ ఆక్రమణ వ్యవహారాలలో ప్రమేయం ఉంది. నగరంలోని ఒక శాసనసభా నియోజకవర్గంలో ఒక బలమైన నాయకుడిపై పోటీ చేసి ఓటమి పాలై ఆర్థికంగా దెబ్బతిన్న అభ్యర్థి తనను ఆదుకోవాలని సొంత పార్టీ అధిష్టానాన్ని అభ్యర్థించాడు. పార్టీ నాయకత్వం అతని వేడుకోలును మన్నించి కొన్ని చెరువు ప్రాంతాలను చూపించి వాటిని విక్రయించుకుని నష్టం పూడ్చుకోమని చెప్పింది. ఆ పరాజిత నేత ఆ చెరువులను ఆక్రమించి అనేక కాలనీలను సృష్టించి అమ్ముకుని లబ్ధి పొందాడు. - మొహమ్మద్ ఇర్ఫాన్**

పథకాలు, ప్రస్తుత పరిస్థితి, విపత్తులను ఎదుర్కొనేందుకు నగర సన్నద్ధత లాంటి అంశాలపై సదస్సులు నిర్వహించనున్నారు.

మూసీ నదిలోని నీరే కాదు, ఆ నీటిపై నుంచి వీస్తున్న గాలి కూడా కలుషితమైపోతోంది. మూసీ పక్క నుంచి నడవాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. ఆ కలుషిత గాలి నుంచి పురావస్తు విగ్రహాలను, ఇతర పురావస్తు విశేషాలను కాపాడేందుకు సాలార్ జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి వచ్చిందంటే సమస్య తీవ్రత అర్థమవుతుంది. అక్కడి పెయింటింగ్‌లను ఈ కలుషిత గాలి బారి నుంచి కాపాడేందుకు వాటిని ఉంచిన గదులను ఎయిర్‌కండీషన్ చేయించాల్సి వచ్చిందని నిపుణులు అంటున్నారు. మూసీ తీరం దోమల వృద్ధి కేంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి గృహ, పారిశ్రామిక వ్యర్థాలను తీసుకువచ్చే 18కి పైగా నాలాలు మూసీలో కలుస్తున్నాయి. మూసీ ఒడ్డున టన్నులకొద్దీ చెత్తను గుమ్మరిస్తున్నారు. ఇన్నాళ్ళూ మూసీ సుందరీకరణ పేరుతో వందల, వేల కోట్ల ఖర్చు ఫలితం లేకపోతోంది. హైదరాబాద్ అంటేనే మూసీ. మూసీ అంటేనే హైదరాబాద్. మరి అలాంటి మూసీ నదిని కాపాడుకోలేమా? నగర ఆవిర్భావానికి మూలకారణమైన మూసీని సమూలంగా నాశనం చేసుకుందామా?

మూసీ తీర ప్రాంతంతోపాటు నదీ పరివాహక ప్రాంతంలో విచ్చలవిడిగా చోటు చేసుకుంటున్న అభివృద్ధి కార్యక్రమాలు, రియల్ ఎస్టేట్, ఇతరత్రా నిర్మాణాలు నగరానికి వరద ముప్పును తీవ్రం చేస్తున్నాయి. మూసీ నదీమార్గాన్ని ఇరుకు చేయడం, దాన్ని ఓ మురికి కాలువగా పరిగణించడం, వరద నీటి కాలువలు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, నిర్వహణలో లోపాలు లాంటివన్నీ ఇందుకు కారణాలే. స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా అన్ని రకాల హైటెక్ హంగులతో సైబరాబాద్ నగరాన్ని నిర్మించుకున్నాం. ఆ సమయంలో అత్యంత ముఖ్యమైన, ప్రాథమిక అంశాన్ని విస్మరించాం. దానికి డ్రైనేజీ వ్యవస్థ లేదు. నమ్మశక్యం కాని నిజమిది. నేడు అక్కడ విడుదలవుతున్న డ్రైనేజీలో మూడింట ఒక వంతును మాత్రమే శుద్ధి చేస్తున్నారు. మిగిలిన డ్రైనేజీని నేరుగా అతి పురాతన, చారిత్రక ప్రాధాన్యం కలిగి, శతాబ్దాలపాటు గోల్కొండ ఖిలాకు తాగునీరు అందించిన దుర్గం చెరువులోకి పంపిస్తున్నారు. అన్నింటినీ మించి మరో ముఖ్యమైన కారణం హైదరాబాద్ సుస్థిర అభివృద్ధికి వీలు కల్పించేలా సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను ఇన్నాళ్ళపాటు రూపొందించకపోవడం, ఇప్పటి వరకూ రూపొందించిన ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయకపోవడం. నాడు నిజాంల కాలంలో నిర్మించిన మురికివాడలు ఇప్పటి కాలనీల కంటే మెరుగ్గానే ఉండినవి. అప్పట్లోనే అక్కడ దుమ్ములేని రోడ్లు, మురికి కాలువలు, విశాలమైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లాంటి వాటికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. అధికారులు ఎంతసేపూ ఎగువ ప్రవాహాన్నే పట్టించుకుంటున్నారు తప్పితే దిగువ ప్రవాహాన్ని పట్టించుకోవడం లేదు. రెండూ ముఖ్యమైనవే. రెండింటి మధ్యా సమతుల్యత ఉండాల్సిన అవసరముంది. పరస్పర సంబంధం లేకుండా చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు నగరానికి గుండెకోతనే మిగులుస్తున్నాయి. వివిధ జలాశయాల తీరప్రాంతాల్లో నిర్మాణ సంబంధ కార్యకలాపాలను నియంత్రించాలి. నదులు ప్రవహించే ప్రాంతాలను బట్టి దేశాన్ని బేసిన్‌లుగా విభజించారు. మూసీ నది కృష్ణా బేసిన్ కె10లోకి వస్తుంది. ఆ ప్రాంతాల్లో కురిసిన వర్షం అంతా కూడా ఏదో ఒక రూపంలో మూసీనే చేరుకుంటుంది. అందుకే ఆ ప్రాంతమంతటా వివిధ అభివృద్ధి పనులను, నిర్మాణ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు, పర్యవేక్షించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి. వాననీటి సంరక్షణ ఏర్పాట్లు చేయాలి. అన్ని అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ఇతర భవనాల్లో దీన్ని తప్పనిసరి చేయాలి. దీర్ఘకాలంలో ఇది వరదల నివారణకు తోడ్పడుతుంది. భూగర్భ జలాల పెంపునకు, నీటి కొరత నివారణకు సహాయకారిగా నిలుస్తుంది. మూసీ తీరంలో ఆక్రమణలు తొలగించాలి. బాధితులకు దగ్గరి ప్రాంతంలో పక్కా గృహాలు నిర్మించాలి. ఉపాధి కల్పించాలి. నగరం చుట్టుపక్కల చెరువుల కట్టలను పటిష్టం చేయడంతోపాటు నిర్వహణ వ్యవస్థను మెరుగుపర్చాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఛైర్మన్‌ను నియమించి 1665 కోట్ల నిధులను కేటాయించింది. మూసీ నదిని పరిరక్షించి, సుందరవనంగా మార్చి పూర్వ వైభవాన్ని తెచ్చే ప్రయత్నంలో ఇప్పటికే ప్రణాళికలు తయారుచేస్తూ ప్రక్షాళన ప్రక్రియకు నాంది పలికిన క్రమంలో, రాబోయే మూడు సంవత్సరాలలో మూసీ నదిని కలుషితం నుండి పరిరక్షించి ప్రజలకు అంకితం చేస్తుందని భావిద్దాం. ఇవన్నీ చేయాలంటే అటు ప్రభుత్వంలో, ఇటు అధికారుల్లో, ప్రజలలో సంకల్పం, చిత్తశుద్ధి, అంకితభావం, బాధ్యతాయుత ధోరణి అవసరం. అలా జరిగిన నాడే ఒకప్పుడు హైదరాబాద్‌కు జీవదాయనిగా ఉన్న మూసీ నది తన పాత వైభవాన్ని సంతరించుకుని సజీవంగా ఉంటుంది.

**(మూసీ మహావరదకు 110 ఏళ్ల సందర్భంగా 2018లో వెలువరించిన వ్యాసం. కర్టెసీ: ఆంధ్రజ్యోతి)**

# ఇంకో తరం పాటు కృషి చేస్తేనే సుస్థిర భవిష్యత్తు.. అందుకే టీఎల్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి: జేపీ



దేశంలో మార్పు కోసం ఇంకా చాలా కృషి జరగాల్సి ఉందని స్వతంత్రం వచ్చిన తొలిదశాబ్దాలలోనే గుర్తించిన విశిష్ట భారతీయుల్లో టీఎల్ నరసింహారావు ఒకరని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నివాళులర్పించారు. కేవలం ఆలోచనకే పరిమితం కాకుండా ఆచరణలో మార్పు కోసం కృషి చేశారన్నారు. ఈ క్రమంలోనే రెండో స్వతంత్ర పోరాటానికి సమగ్ర భావజాలంతో వచ్చిన లోక్‌సత్తాకు కీలక సమయంలో నాయకత్వాన్ని అందించారన్నారు. ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే ఎంతో చిత్తశుద్ధితో నిబద్ధతతో కార్యక్రమాల్ని నిర్వహించారన్నారు. ఈ కృషి ఇంకా అసంపూర్ణంగానే ఉందన్నారు. దేశంలో సాధించాల్సిన మార్పు.. పాలన, రాజకీయపరంగా ఇంకా చాలా ఉందని, ఇంకో తరం పాటు అవిశ్రాంతంగా కృషి చేస్తేనే మన బిడ్డలకు సుస్థిరమైన భవిష్యత్తును అందించగలమని అన్నారు. రాబోయే కాలంలో అత్యధిక శాతాన్ని సొంతం చేసుకునే యువత.. ఇదేదో ముసలాళ్ల వ్యవహారం, వయసు మళ్లాక దేశం గురించి ఆలోచిస్తాను అనుకోకుండా నరసింహారావు లాంటి వారి ఆచరణని, క్రమశిక్షణని, నిబద్ధతతని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తమ వ్యక్తిగత కలల్ని నెరవేర్చుకుంటూనే, కుటుంబాల్ని చూసుకుంటూనే ఈ వ్యవస్థాగత మార్పుల్ని సాధించే కృషిలో కొత్తతరం భాగస్వాములు కావాలన్నారు. టీఎల్ నరసింహారావు మృతి పట్ల జేపీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. 77 ఏళ్ల వయసులో అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందిన టీఎల్‌కు లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు కూడా శ్రద్ధాంజలి ఘటించారు.

టీఎల్‌గా ప్రసిద్ధులైన తుంగతుర్తి లక్ష్మీనరసింహారావు ఉమ్మడి నల్లగొండ జిల్లా నూతన్‌కల్ మండలం తాళ్లసింగారం గ్రామంలో 1943 జులై 1న జన్మించారు. ఆయనకు భార్య సావిత్రమ్మ, కుమారుడు భాస్కరరావు, కూతుళ్లు ఉషారాణి, శ్రీలత ఉన్నారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో రెండు దశాబ్దాలకుపైగా సేవలందించారు. లోక్‌సత్తా నల్లగొండ జిల్లా కార్యదర్శిగా కృషిని ప్రారంభించి, ఉద్యమ ప్రస్థానంలో అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనేక బాధ్యతల్ని నిర్వహించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమన్వయకర్తగా కూడా సేవలందించారు. ✦

## ఆకాంక్ష జిల్లాల్లో సత్ఫలితాలు




వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆకాంక్ష జిల్లాల కార్యక్రమం' సత్ఫలితాలు ఇస్తోంది. దీర్ఘకాలిక, వాస్తవ ఫలితాలు కనిపిస్తున్నాయని అధ్యయనం వెల్లడించింది. దేశంలోని 112 అత్యంత వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 2018 జనవరిలో ఆకాంక్ష జిల్లాల కార్యక్రమం (ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ ప్రోగ్రాం) రూపొందించింది. ఈ పథకం అమలు తీరుపై అమెరికాలోని హార్వర్డ్ బిజినెస్ స్కూలుకు చెందిన ప్రొఫెసర్ మైఖెల్ ఈ పోర్టర్, మెసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ స్కాట్ స్టెర్న్‌లు నెలకొల్పిన సోషల్ ప్రోగ్రెస్ ఇంపరేటివ్ అనే సంస్థ, భారత్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాంపిటీటివ్‌నెస్ అనే సంస్థ సంయుక్తంగా అధ్యయనం చేశాయి. వివిధ సాంఘిక, ఆర్థిక అంశాల్లో ఏ మేరకు పురోగతి సాధించిందీ లెక్కించాయి. ఆదర్శ అభివృద్ధికి ఎంత దూరంలో ఉన్నారో తేల్చే 'సరిహద్దుకు ఎంత దూరం' (డిస్టెన్స్ టు ఫ్రాంటియర్) అనే విధానాన్ని అనుసరించాయి. అక్షరాస్యత, పౌష్టికాహారం రంగాల్లో లక్ష్యానికి దగ్గరగా ఉన్నట్లు తేలింది. అంటే ఈ రంగాల్లో చెప్పుకోదగ్గ పురోగతి సాధ్యమయింది. వ్యవసాయం, నీటివనరులు, ఆర్థిక సమ్మిళితం, నైపుణ్యాభివృద్ధిలో మాత్రం తగిన పురోగతి కనిపించలేదు. చాలా జిల్లాలు ఈ విషయంలో లక్ష్యాలకు 40-90 శాతం దూరంలో ఉండిపోయాయి. అయితే ఈ పథకం ప్రారంభించటానికి ముందున్న పరిస్థితులతో పోలిస్తే అన్ని రంగాల్లోనూ కొంత ప్రగతి కనిపించింది. దీనివల్లనే కరోనా ప్రభావాన్ని చెప్పుకోదగ్గరీతిలో తట్టుకోగలిగాయి. ప్రణాళికల రూపకల్పనలో ఏయే అంశాలపై దృష్టి కేంద్రీకరించాలనే విషయాన్ని ఈ అభివృద్ధి నమూనా విశదం చేసినట్లు అధ్యయనం వివరించింది.

# ఆర్థిక స్వేచ్ఛకు, అవినీతి నిరోధానికి అరకొర చర్యలే భారత్‌లో వృద్ధికి అవరోధాలు




ప్రపంచ దేశాలలో ఆర్థిక స్వేచ్ఛ ఎలా ఉందో తెలియజేసే వార్షిక నివేదికను కెనడాకు చెందిన ఫ్రేజర్ ఇన్‌స్టిట్యూట్ సెప్టెంబర్‌లో విడుదల చేసింది. ఎకనామిక్ ఫ్రీడం ఆఫ్ ది వరల్డ్ 2020లో భారతదేశ ఆర్థిక స్వేచ్ఛకు సంబంధించిన విశ్లేషణను హైదరాబాద్‌కు చెందిన లిబరల్, పబ్లిక్ పాలసీ సంస్థ స్వతంత్రత సెంటర్ సహ వ్యవస్థాపకులు వెంకటేష్ గెరిటి, రాఘవేందర్ అస్కానీ 'జనబలం' పాఠకులకు సంక్షిప్తంగా అందిస్తున్నారు.

ప్రపంచ దేశాలలో ఆర్థిక స్వేచ్ఛ స్థాయిని కొలవటానికి ఈ సర్వే రూపొందించారు. 162 దేశాల పట్టికలో భారతదేశ ఆర్థిక స్వేచ్ఛ ఈ ఏడాది 105వ స్థానం దక్కించుకుంది.

మొదటి ఐదు స్థానాలను హాంకాంగ్, సింగపూర్, న్యూజిలాండ్, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా పొందగా, చివరి ఐదు స్థానాలలో ఇరాన్, అంగోలా, లిబియా, సూడాన్, వెనిజులా ఉన్నాయి. తైవాన్ 16, జపాన్ 20, జర్మనీ 21, మలేషియా 46, ఫిలిప్పిన్స్ 54, ఫ్రాన్స్ 58, ఇండొనేషియా 59, మెక్సికో 68, కజికిస్థాన్ 73, శ్రీలంక 83, రష్యా 89, భూటాన్ 98 స్థానాల్లో ఉంటే బ్రెజిల్‌తో కలిసి భారత్ 105వ ర్యాంకుని పంచుకుంది. మలేషియా, ఫిలిప్పిన్స్, ఎల్ సాల్వెడార్‌లు మనకంటే 44 స్థానాలు ముందున్నాయి.

ఈ ఆర్థిక స్వేచ్ఛ ర్యాంకుల్లోని పాయింట్ల లెక్కే ఓ దేశం అభివృద్ధిని నూరుశాతం నిర్ణయించదుగానీ.. సగటు లెక్కలో చూస్తే మాత్రం దేశాల అభివృద్ధికి ఈ ర్యాంకులకి మధ్య హేతుబద్ధమైన సంబంధం ఉంది. సామాజిక, రాజకీయ,

ఆర్థిక పరమైన ఉన్నతికి, మెరుగైన వ్యక్తిగత జీవనానికీ, ఈ ఆర్థిక స్వేచ్ఛకీ మధ్య గణనీయ సంబంధం ఉంది. ఆర్థిక స్వేచ్ఛ హెచ్చుగా ఉన్న దేశాలు అది లేని దేశాల కంటే మంచి జీవనంలో మెరుగైన స్థితిలో ఉంటున్నాయి. మొదటి ర్యాంకులు పొందిన నాలుగో వంతు దేశాల సరాసరి స్థూల దేశీయోత్పత్తి చివరి ర్యాంకులు సాధించిన నాలుగోవంతు దేశాల కంటే దాదాపు 7 రెట్లు అధికంగా ఉంది. అలాగే ఈ మొదటి స్థానాల దేశాలలో అత్యంత పేదల సంపాదన చివరి స్థానాలు పొందిన దేశాల్లో కంటే 10 రెట్లు ఎక్కువగా ఉంది. మొదటి ర్యాంకుల దేశాలలో సగటు జీవితకాలం 79.5 సంవత్సరాలుంటే చివరి దేశాలలో 61.6 మాత్రమే ఉంది. అలాగే రాజకీయ స్వేచ్ఛ, పౌర హక్కుల స్థితిలో కూడా చాలా వ్యత్యాసం ఉంది. మొత్తం మీద రెండు దశాబ్దాలుగా సాగుతున్న ఈ అధ్యయనాలు ఎక్కడ ఆర్థిక స్వేచ్ఛ ఎక్కువగా ఉంటే అక్కడ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడుల రేటు హెచ్చుగా, ఆర్థిక ప్రగతి రేటు హెచ్చుగా ఉందని స్పష్టం చేస్తున్నాయి. పెరుగుతున్న ఆదాయాలు, తరుగుతున్న పేదరికం కనిపిస్తున్నది. అలాగే ఆర్థిక స్వేచ్ఛ ఉన్న దేశాలలో రాజకీయ, న్యాయ వ్యవస్థలు ఆ దేశాలలో తలసరి ఆదాయాలను పెంచటంలో, ఆర్థికాభివృద్ధిని సాధించటంలో ముందున్నాయి. ఆర్థిక స్వేచ్ఛ నివేదిక రూపొందించటానికి ఐదు అంశాలను ప్రాతిపదికగా తీసుకుని వాటి ఆధారంగా అభివృద్ధి పట్టికను రూపొందించారు.

1) ప్రభుత్వ వ్యయాల సైజు
2) న్యాయ వ్యవస్థ, ఆస్తి హక్కుకు గల భద్రత
3) నికర డబ్బు
4) అంతర్జాతీయ వాణిజ్యానికి గల స్వేచ్ఛ
5) నియంత్రణ

ఈ ఐదు అంశాలలో 24 భాగాలుంటాయి. అందులో మరిన్ని ఉప భాగాలుంటాయి. మొత్తం మీద 12 అంశాలు ఈ పట్టికకు ప్రాతిపదికగా ఉంటాయి. అలాగే ప్రతి అంశాన్ని 0-10 స్కేలు మీద వాటి స్థితిని గుర్తించి అంతిమ పట్టికను రూపొందిస్తారు. అందుచేత సాధ్యమైనంత శాస్త్రీయ ప్రమాణాలతో ఈ నివేదికలు రూపొందిస్తున్నారని భావించాలి. అలాగే దీనికి అవసరమైన గణాక వివరాలను ఆయా దేశాల నుండి కాకుండా అంతర్జాతీయ సంస్థల నుండి సేకరించారు. వీటి ఆధారంగా వచ్చిన పాయింట్లు ప్రాతిపదికగా ర్యాంకులు ఇచ్చారు.

ఆర్థిక స్వేచ్ఛకు సంబంధించిన ఐదు రంగాలలో భారత్.. 1) ప్రభుత్వ వ్యయాల సైజులో 7.16 పాయింట్లతో 54వ ర్యాంకులో నిలిచింది 2) న్యాయ వ్యవస్థ, ఆస్తి హక్కుకు భద్రతలో 5.07 పాయింట్లతో 79వ ర్యాంకులో నిలిచింది 3) నికర డబ్బులో 8.34 పాయింట్లతో 88వ ర్యాంకులో నిలిచింది 4) అంతర్జాతీయ వాణిజ్యానికి గల స్వేచ్ఛలో 5.71 పాయింట్లతో 139వ ర్యాంకులో నిలిచింది 5) నియంత్రణలో 6.53 పాయింట్లతో 122వ ర్యాంకులో నిలిచినట్లు నివేదిక ప్రకటించింది.

మొత్తంగా చూస్తే.. అగ్రస్థానంలో ఉన్న హాంకాంగ్‌కు 8.94 పాయింట్లు రాగా, ద్వితీయ స్థానంలోని సింగపూర్‌కు 8.65 పాయింట్ల లభించాయి, భారతదేశానికి 6.56 పాయింట్లు దక్కాయి. 2015 సంవత్సర నివేదికతో పోల్చినప్పుడు 0.09 పాయింట్లు పెరిగాయి. ఈ పెరుగుదల పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ మరియు మానిటరీ స్వేచ్ఛల మెరుగుదల వల్ల సాధ్యమైంది. అయితే ఇక్కడ సాధించిన పాయింట్లను దేశంలో పెరిగిన అవినీతి కబళించింది. దీనికితోడు వ్యవస్థాగతమైన లోటుపాట్లు దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధిని దెబ్బతీస్తున్నాయని ఆ నివేదిక పేర్కొంది. భారతదేశంలో చట్టబద్ధపాలన సక్రమంగా లేదు. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని వ్యవస్థీకృతం చేయటంలో బలహీనతలున్నాయి. న్యాయప్రక్రియ దీర్ఘకాలం తీసుకునేదిగాను, వ్యయంతో కూడుకున్నదిగాను, రాజకీయ ఒత్తిళ్లకు గురయ్యేదిగాను ఉన్నది. సమర్థవంతంగా పనిచేసే న్యాయ, చట్ట వ్యవస్థల లోటు, ఆర్థిక వ్యవస్థలో అంతటా వ్యాపించిన అవినీతి వల్ల క్రియాశీలంగా వ్యవహరించే ప్రయివేటు రంగం మందగమనంలో పడింది. ఆస్తి హక్కుకు సమర్థవంతమైన భద్రత కల్పించకపోవటం, మేధోహక్కుల పరిరక్షణలో చాలా లోటుపాట్లు ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. భారతదేశ బ్యూరోక్రసీ కొత్త పెట్టుబడులకు అననుకూల వాతావరణాన్ని కల్పించేదిగా ఉంది. తక్కువ ధరలకు ప్రజలకు సరకులు అందించే బహుళజాతి చిల్లర వర్తకాన్ని అనుమతించటంలో జాప్యం, ప్రభుత్వ రంగ సంస్థల ఆధిక్యం వంటివి కొనసాగుతున్నాయని నివేదిక పేర్కొంది. అనేక రంగాలలో ప్రభుత్వ ఆధిపత్యం, దుబారాతో కూడిన సబ్సిడీ వ్యవస్థలతో బడ్జెట్‌లోటు పెరిగిపోతోంది. భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు ఆటుపోట్లతో సాగుతున్నాయి. కీలకమైన సేవారంగాల సరళీకరణ ఆగిపోయింది. అయితే కొన్ని ప్రయత్నాలు మాత్రం జరుగుతున్నాయని తెలిపింది.

మొత్తంగా చూస్తే, ఆర్థిక స్వేచ్ఛకు, అవినీతి నిరోధానికి తగిన చర్యలు అరకొర కావటం భారతదేశ అభివృద్ధికి అవరోధమన్నది నివేదిక సారాంశం.

# స్వేచ్ఛా మార్కెట్ వ్యవసాయ చట్టాలు రైతులకు మేలు చేస్తాయనటానికి ఇజ్రాయెల్ విజయాలే రుజువు







**Figure 2.2: Unintended consequences of Essential Commodities Act**




భారత ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ చట్టాలు రైతులకు అన్ని విధాలా మేలు చేస్తాయని, ఇజ్రాయెల్ సాధించిన విజయాలే ఇందుకు రుజువని ఇండియాలోని ఆ దేశ రాయబారి రాన్ మల్కా అన్నారు. ఈ చట్టాల వల్ల రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకునే అవకాశాలు పెరిగి గరిష్ఠ లాభాలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం ఈ చట్టాలపై జరుగుతున్న ఆందోళనలు సద్దుమణిగాక.. రైతులు ఈ ప్రయోజనాల గురించి పూర్తిగా తెలుసుకుంటారని అభిప్రాయపడ్డారు. భారత్–ఇజ్రాయెల్ భాగస్వామ్యం బలంగా ఉందంటే వ్యవసాయ రంగంలో ఇరు దేశాల మధ్య ఉన్న సహకారం కూడా ఓ కారణమని చెప్పారు. నూతన చట్టాలతో ఈ సహకారం మరింత బలోపేతమవుతుందన్నారు. కొత్త చట్టాలు కార్పొరేట్ వర్గాలకు మేలు చేసేలా ఉన్నాయన్న వాదన సరికాదన్నారు. "ఇజ్రాయెల్ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌లో మధ్యవర్తులు ఉండరు. రైతులు నేరుగా వినియోగదారులతో అనుసంధానం అయ్యేలా పారదర్శకత ఉంటుంది. ఈ దిశగా డిజిటల్ ప్లాట్‌ఫారాలు సమర్థంగా పనిచేస్తున్నాయి. భారత్‌లోనూ ఆ డిజిటల్ ప్లాట్‌ఫారాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్చుకొని వినియోగించుకోవచ్చు" అని రాన్ మల్కా అన్నారు. చాలాకాలంగా ఉన్న మార్కెటింగ్ పద్ధతులు మారుతుంటే కొంత ఆందోళన సహజమేనని, ఈ విషయంలో రైతుల్లో ఉన్న అపోహలు తొలగేందుకు కాస్త సమయం పడుతుందని వ్యాఖ్యానించారు.






### కరోనా వ్యాక్సిన్‌పై భారత్ వెంటనే మేలుకొంటే..

# ఖర్చు 80% తగ్గుతుంది, అందరికీ వేగంగా టీకా అవకాశాలు పెరుగుతాయి

"కొవిడ్ వ్యాక్సిన్ తయారీలో భారత్ ముందుండాలి. మనకు గొప్ప బయోటెక్ కంపెనీలున్నాయి. అంతర్జాతీయ టీకాలలో 60 శాతానికిపైగా మన వద్దే ఉత్పత్తి అవుతుంటాయి. ప్రభుత్వం విశ్వసించదగ్గ రీతిలో కార్యక్రమాల ద్వారా కంపెనీలకు ముందస్తు నిధుల్ని సమకూర్చాలి, వ్యయాల్ని తగ్గించాలి. ఇప్పుడు తెలివైన పెట్టుబడి వల్ల తర్వాత సమయం, డబ్బు ఆదా అవుతాయి. మన దేశ జనాభాలో 70 శాతానికి రెండు డోసుల చొప్పున కరోనా వ్యాక్సిన్‌ను ఇవ్వాలంటే మనకు 200 కోట్ల డోసులు కావాలి. ప్రస్తుత అంచనా ప్రకారం ఒక్కో డోసుకు 5 నుంచి 10 డాలర్లు ఖర్చవుతుంది. అంటే దాదాపు 10-20 బిలియన్ డాలర్ల బడ్జెట్ అవసరమవుతుంది. ఇప్పుడు గనక మనం 5-10 వేల కోట్ల రూపాయలను విజ్ఞతతో ఖర్చు పెట్టగలిగితే, వ్యాక్సిన్ అభివృద్ధిని ప్రభుత్వం వేగవంతం చేయగలుగుతుంది. అప్పుడు మొత్తం వ్యయం కేవలం 1-2 బిలియన్ డాలర్లు మాత్రమే అవుతుంది. కాబట్టి ఇప్పుడే ప్రభుత్వం కార్యరంగంలోకి దిగాలి. ప్రజల ప్రాణాల్ని కాపాడటానికి, వృద్ధిని, ఉపాధిని పునరుజ్జీవింప చేయటానికి మనకు సురక్షితమైన, సమర్థవంతమైన టీకా త్వరగా కావాలి. ప్రపంచ దేశాల నుంచి మన అవసరాలకు తగిన సాయం అందదు. మనం వ్యాక్సిన్ అభివృద్ధికి అయ్యే వ్యయాల్ని తగ్గించగలిగి, విజయవంతమైన వ్యాక్సిన్/వ్యాక్సిన్లను ఉత్పత్తి చేయటానికి అన్ని కంపెనీలూ ముందుకొచ్చేలా చేయగలిగితే.. 80% డబ్బును ఆదా చేసుకోగలుగుతాం. టీకాల అభివృద్ధిలో మన కంపెనీలకు ఉన్నత ప్రమాణాల పరిశోధనా సామర్థ్యం ఉంది. ప్రపంచ దిగ్గజాలతో మన సంస్థలకు వ్యూహాత్మక ఒప్పందాలున్నాయి. కానీ వ్యాక్సిన్ అభివృద్ధి చాలా ఖర్చుతో, రిస్కుతో కూడుకున్నటువంటిది. కంపెనీలకు ముందుగానే నిధులిచ్చేందుకు అమెరికా ప్రభుత్వం ఇప్పటికే దాదాపు 8 బిలియన్ డాలర్లను ఖర్చుచేసింది. వాళ్లకి 500 మిలియన్‌ల డోసుల దాకా అవసరమవుతాయి. అలాగే బ్రిటన్, చైనా వంటి దేశాలు కూడా టీకాల కోసం కంపెనీలకు నిధుల్ని వెచ్చిస్తున్నాయి"

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th October, 2020 Posting Date 15 &16th of every month




**BOOK POST**

**PRINT MATTER**

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**